www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 31-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 286 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 11.37 తదుపరి షష్ఠి; నక్షత్రం: హస్త రా. 1.09 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 7.34-9.22; దుర్ముహూర్తం: మ. 12.07-12.52; అమృతఘడియలు: రా. 6.23-8.11; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మనిషి మెదడులో మస్క్ చిప్



'న్యూరాలింక్' సంస్థ అమర్చినట్టు తెలిపిన టెక్ బిలియనీర్

ఫోన్లు, కంప్యూటర్లకు వైర్‌లెస్‌గా అనుసంధానం.. ఆలోచనతోనే వాటిని నియంత్రించగలిగే బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్

పక్షవాతం, ఇతర సమస్యలతో మంచానికే పరిమితమైన వారి ఆలోచనలను వేగంగా కంప్యూటర్‌కు ప్రసారం

2

కక్షే లక్ష్యం..



విజిలెన్స్ ఏడీ ప్రతాప్ రెడ్డి వచ్చిన కారులో కర్రలు, సంచిలో కారంపొడి ప్యాకెట్లు



వైసీపీ నాయకుడు కోరుకొండ శ్రీనివాస్‌తో (తెల్ల చొక్కా) కలిసి తనిఖీలకు వచ్చిన మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి

మారణాయుధాలతో మైనింగ్ సోదాలు!

- టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలే లక్ష్యం
- అధికారుల వాహనాల్లో వైసీపీ నేతలు
- కర్రలు, కత్తులు, కారం ప్యాకెట్లు కూడా..
- వీరెవరని నిలదీసిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి
- నీళ్లు నమిలిన మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి
- గుట్టురట్టవడంతో జారుకున్న వైనం..

వైసీపీ నేతలను వెంటేసుకుని మైనింగ్, విజిలెన్స్ అధికారుల తనిఖీలు. వాహనంలో కర్రలు, కత్తులు, కారంపొడి ప్యాకెట్లతో రాక. బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ మండలాల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే (పర్చూరు) ఏలూరి సాంబశివరావు అనుచరుల గ్రానైట్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా మంగళవారం జరిగిన తతంగమిది.

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అధికారులు తాము ప్రభుత్వ ఉద్యోగులమనే విషయం మరిచి పోయారు. అధికార పార్టీతో సంబంధాలను 'బహిరంగం'గా ప్రదర్శించారు. వైసీపీ నేతలను వెంటేసుకుని మరీ టీడీపీ సానుభూతిపరుల గ్రానైట్ ఫ్యాక్టరీలపై దాడులకు తెగబడ్డారు. పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓటర్ల జాబితా సవరణల్లో అవకతవకలను ఆధారాలతో సహా బయటపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఆయనపై గురిపెట్టింది. అందులో భాగంగానే డీఆర్‌ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు ఇటీవల ఆయన కార్యాలయాల్లో జీఎస్టీ సాకుతో సోదాలు నిర్వహించి ఒక డైరీని స్వాధీనం చేసుకున్నారు. దాని ఆధారంగా ఎమ్మెల్యేపై కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. నిన్నటి వరకు ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా కొనసాగిన తనిఖీలు మంగళవారం ఆయన అనుచరులైన టీడీపీ మద్దతుదారుల గ్రానైట్ ఫ్యాక్టరీలకూ విస్తరించాయి. ఈ క్రమంలో అధికారులకు, వైసీపీ నేతలకు మధ్య ఉన్న గీతను ప్రభుత్వం కూడా చెరిపేసింది. తాజా సోదాలకు మైనింగ్ విజిలెన్స్ అధికారులు వైసీపీ నేతలను

మిగతా 12వ పేజీలో...

మళ్లీ రిటైర్మెంట్ రణం!

జగన్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రిటైరైన వారికి సకాలంలో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందనే లేదు. పైగా... గ్రాట్యుటీ, జీపీఎఫ్‌లను విడతలవారీగా ఇస్తామంటూ నేరుగా ఏజీ కార్యాలయమే ఆర్డర్ కాపీలో రాసిచ్చింది. అంటే... ఖజానా ఖాళీ అయ్యిందని పరోక్షంగా అంగీకరించడమే. రిటైర్‌మెంట్ వయసు పెంచని పలు విభాగాల్లో పదవీ విరమణలు జరుగుతూనే ఉన్నాయి. వారికీ 'విడతల' వారీ ఉత్తర్వులే దిక్కవుతున్నాయి.! ఆ విడతలవారీ చెల్లింపులు కూడా జరగడం లేదు.



ఎవరూ అడగకున్నా... ఏ ఉద్యోగీ ఆశించకపోయినా పదవీ విరమణ వయసు రెండేళ్లు పెంచేశారు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలను ఇవ్వకుండా 'వాయిదా' వేయడమే దీని వెనుక అసలు ఉద్దేశం! కానీ... కాలం ఆగుతుందా? రెండేళ్ల సమయం ఇట్టే గడిచిపోయింది. గురువారం నుంచి ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణలు మళ్లీ మొదలు కానున్నాయి. సర్వీసు మొత్తంలో వారు దాచుకున్న సొమ్మును సర్కారు చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల ముందు జగన్ సర్కారుకు ఎదురవుతున్న మరో 'టెన్షన్' ఇది!



నేటి నుంచి ఉద్యోగుల పదవీ విరమణలు

- రెండేళ్ల 'పదవీ కాలం' పొడిగింపు ముగింపు
- గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఇతర ప్రయోజనాలపై టెన్షన్
- గతంలో రిటైరైన వారికే అందని ప్రయోజనాలు
- 'విడతల' వారీగా అంటూ చేతులెత్తేసిన సర్కారు
- ఉద్యోగులకు మొత్తంగా రూ.31,800 కోట్ల బాకీ
- 11 నెలల నుంచి సీపీఎస్ కంట్రిబ్యూషన్ నిల్
- 5 నెలలుగా జమకాని జీపీఎఫ్ మొత్తం
- ఏపీజీఎల్ఐ కటింగ్స్ ఏం చేస్తున్నారో!
- ఉద్యోగులతో జగన్ సర్కారు ఆటలు



పెన్షన్ బకాయిల కోసం విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం చేపట్టిన ఆందోళన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులకు జీతాలు ఇవ్వడమే కష్టం! పెన్షన్లు ఇవ్వడం ఇంకా కష్టం! ఒకటో తేదీ పడాల్సిన జీతాలు, పెన్షన్లు విడతల వారీగా 20వ తేదీ దాకా పడుతూనే ఉంటాయి. అవి దొరికితేనే జీతం! ఇదీ జగన్ జమానాలో దుస్థితి! ఇప్పుడు ప్రభుత్వానికి మరో టెన్షన్ మొదలైంది. రెండేళ్ల కాలం ఇట్టే కరిగిపోవడంతో... గురువారం నుంచి 'పదవీ విరమణ ప్రయోజనాలు' అనే కష్టాలు మళ్లీ మొదలుకానున్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక రెండేళ్లపాటు ఉద్యోగులకు కనీసం రిటైర్‌మెంట్ ప్రయోజనాలు కూడా అందజేయలేదు. రిటైరైన వారంతా సచివాలయం చుట్టూ తిరగడం, తెలిసిన వాళ్లతో సిఫారసు చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అసలే అప్పులతో బండి లాక్కొస్తున్న జగన్ సర్కారు ఈ ఒత్తిడి భరించలేకపోయింది. ఈలోపే 'రివర్స్ పీఆర్సీ'పై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు భగ్గుమన్నారు. దీంతో ఉద్యోగులను చల్లబరిచేందుకు వారి రిటైర్మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2021 నుంచి రిటైర్మెంట్లు నిలిచిపోయాయి. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందించాల్సిన 'బెడద' కూడా

మిగతా 12వ పేజీలో...

సీపీఎస్, జీపీఎఫ్ జమల్లేవు

ప్రతి నెలా సీపీఎస్ ఉద్యోగుల జీతం నుంచి కట్ చేస్తున్న 10 శాతం సీపీఎస్‌ను, ఓపీఎస్ ఉద్యోగుల జీతం నుంచి కట్ చేస్తున్న జీపీఎఫ్ కటింగ్‌లను ప్రభుత్వం సకాలంలో ఆ ఖాతాలలో జమ చేయడం లేదు. గత ఏడాది మార్చి నుంచి సీపీఎస్ కంట్రిబ్యూషన్‌ను, గత ఏడాది సెప్టెంబరు నుంచి ఉద్యోగుల జీపీఎఫ్ కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వమే వాడుకుంటోంది. దీంతో ఉద్యోగులకు వాటిపై అందే రాబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి.

నేడు జగన్ ఢిల్లీకి!



అమిత్ షా అపాయింట్‌మెంట్ ఖరారు కాగానే పయనం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ హస్తిన పర్యటన దాదాపు ఖరారైంది. బుధవారం ఆయన ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ కోసం ఆయన సోమవారం నుంచి ఎదురు చూస్తున్నారు. బుధవారం అనుమతి లభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వీరిద్దరూ రాజ్యసభ ఎన్నికలపైనే ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి జోరు, టికెట్లు రాని వైసీపీ ఎమ్మెల్యేల తిరుగుబాటుతో సతమతమవుతున్న జగన్‌కు.. చెల్లెలు షర్మిల రూపంలో మరో సమస్య వచ్చిపడింది. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టింది మొదలు ఆమె అన్ననే టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం సహకారం లేకుంటే సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కలేనని జగన్ ఆందోళన చెందుతున్నారు. దీనిపై మాట్లాడేందుకే హస్తిన వెళ్తున్నారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి బీజేపీకి ఇస్తానని.. ప్రతిగా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరనున్నట్లు సమాచారం. షా అపాయింట్‌మెంట్ కోసం వైసీపీ కీలక ఎంపీ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

అన్నపై హోదా అస్త్రం!

ఢిల్లీ వేదికగా 2న దీక్ష?



- రేపటికల్లా హస్తిన రావాలని ముఖ్య నేతలకు షర్మిల పిలుపు
- ఫిబ్రవరి 5న మడకశిరలో సభ తర్వాత గన్నవరం, విశాఖల్లో!
- విజయవాడలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ భేటీ
- విభజన హామీలపై ప్రధాని మోదీకి షర్మిల లేఖ

11

షర్మిలకు ప్రాణహాని

- జగన్‌కు తల్లి, చెల్లి, బాబాయి తేడా లేదు
- కేంద్రం షర్మిలకు భద్రత పెంచాలి
- నా ప్రాణాలకూ ముప్పు ఉంది.. టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు

ఒంగోలు ఎంపీ టికెట్..

మాగుంటకు ఇవ్వాల్సిందే!



- కాదని చెవిరెడ్డికి ఇస్తే సహకరించేది లేదు: బాలినేని
- రంగంలోకి సజ్జల, సాయిరెడ్డి.. సీఎంను కలవాలని సూచన
- అంగీకరించని మాజీ మంత్రి.. ఫలించని మంతనాలు
- టీడీపీతో సంప్రదింపులు జరుపుతున్న మాగుంట

11

దివ్యాంగులు కోరితే ఇంటివద్దే ఓటు

12

ఫారం 12-డి ద్వారా 'హోమ్ ఓటింగ్'.. దివ్యాంగ, నిండు గర్భిణి, బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు.. సీఈవో ముఖేష్ కుమార్ మీనా

బీజేపీ నేత హత్య కేసులో

15 మందికి మరణ శిక్ష


- కుటుంబ సభ్యుల ఎదుటే మారణకాండ
- ముద్దాయిలంతా పీఎఫ్ఐ సభ్యులు
- కేరళలో ఘటన జరిగిన 11ఏళ్లకు తీర్పు

2

కాలినడకన వస్తున్న

జవాన్లపై కాల్పులు

- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఘాతుకం
- ముగ్గురు జవాన్ల మృతి..
- 15 మందికి గాయాలు



వలస పక్షులతో వచ్చే లాభమేంటి?



ఎన్నికల ముందు విదేశాల నుంచి వస్తారు

- సీటు తీసుకుని ఓడితే మళ్లీ కనిపించరు
- వైసీపీ కంటే టీడీపీ వైపే ప్రవాసాంధ్రుల చూపు
- 6 ఎమ్మెల్యే సీట్లు, 3 ఎంపీ స్థానాల్లో వీరి హడావుడి
- గుంటూరు ఎంపీ అభ్యర్థిగా చంద్రశేఖర్ ఖరారు?
- మంగళవారం రాత్రే ఆయన స్వదేశానికి రాక
- స్థానికంగా బలం ఉన్నవారికి ఇవ్వాలనే చర్చ

హంగూఆర్భాటాలతో డబ్బు మూటలతో ఎన్నికల ముందు వాలుతున్న విదేశీ వలస పక్షుల వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానిక నేతలను కాదని సరిగ్గా ఎన్నికల ముందు దిగుమతి అవుతున్న వీరినే రాజకీయ పార్టీలు అక్కున చేర్చుకొని టికెట్లు ఇవ్వడం సమంజసమేనా అన్న చర్చ నడుస్తోంది. విదేశాల నుంచి వస్తున్న నేతలు కష్టకాలంలో అండగా నిలవగలరా..? పూర్తి కాలం ప్రజల కోసం వెచ్చించి పని చేయగలరా? అన్న ప్రశ్నలూ తలెత్తుతున్నాయి.

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడి వ్యాపారాలు అభివృద్ధి చేసుకొని సంపాదించిన కొందరు తెలుగు ప్రముఖులు ఈసారి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ తరహా విదేశీ నేతల తాకిడి ఈసారి టీడీపీకి బాగా ఎక్కువగా ఉంది. అధికార పక్షం వైసీపీ పరిస్థితి బాగోలేదన్న టాక్ వ్యాపించడంతో ప్రవాసాంధ్రులు

మిగతా 12వ పేజీలో...

రాంచీలో హేమంత్ ప్రత్యక్షం

ఎమ్మెల్యేలతో జార్ఖండ్ సీఎం భేటీ

- అందరూ రాజధానిలోనే ఉండాలని సూచన
- పాల్గొన్న సీఎం సతీమణి కల్పన సోరెన్
- రాష్ట్రంలో పరిస్థితులపై సీఎస్, డీజీపీతో గవర్నర్ భేటీ.. పోలీసుల మోహరింపు
- నేడు హేమంత్‌ను ప్రశ్నించనున్న ఈడీ
- అరెస్టు చేస్తే.. ముఖ్యమంత్రిగా కల్పన!

2



నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి

- ఫిబ్రవరి 9వ తేదీ దాకా నిర్వహణ.. ప్రస్తుత లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు
- లోక్‌సభలో రేపు మధ్యంతర బడ్జెట్.. ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల
- కిసాన్ సమ్మాన్ 50 శాతం పెంపునకు చాన్స్.. ప్రతి సమస్యపై చర్చకు సిద్ధమన్న కేంద్రం
- 11 మంది ఎంపీలపై అమల్లో ఉన్న సస్పెన్షనూ ఎత్తివేత
- ప్రతిపక్ష కూటమికి ఉమ్మడి కార్యాచరణ ఏది?

ఫ్యాక్షన్ 'గడ్డ'పై ఫ్యామిలీ ప్యాకేజీ

నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుటుంబ రాజ్యం

- ఇసుకలో బొక్కేశారు.. ప్రతిపనిలో కమీషన్
- అనుచరుల పేరిట విచ్చలవిడిగా బెల్టు షాపులు
- సొంతూరులో నకిలీ మద్యం తయారీ?
- ఉద్యోగాలు ఇప్పిస్తామని భారీగా వసూళ్లు
- కారుచౌకగా 200 ఎకరాలు స్వాహా
- రేషన్ బియ్యం దందాకు ఆ ఇలాకా కేరాఫ్
- మైనింగ్‌తో కొండలు, గుట్టలు మాయం
- చివరకు పంట ఉత్పత్తుల కొనుగోళ్లలోనూ దందా
- నామినేటెడ్ పోస్టులో తండ్రి.. అన్నింటా తల్లి చక్రం
- నంద్యాల జిల్లాలో సకుటుంబ అవినీతి చిత్రం



అమ్మో ఎమ్మెల్యే

నంద్యాల జిల్లాలోని ఆ నియోజకవర్గానికి ఫాక్షన్ 'గడ్డ'గా పేరు! రాజకీయ వారసుడిగా వచ్చి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తండ్రికి నామినేటెడ్ పదవి ఉంది. ఇక తల్లి కూడా అన్ని విషయాల్లో చక్రం తిప్పుతున్నారు. నియోజకవర్గమంతా కుటుంబ రాజ్యం నడుస్తోంది. 2019 ఎన్నికల ముందు ఆ కుటుంబానికి అప్పులు పుట్టకపోతే గడవని పరిస్థితి. కారుకు పెట్రోలు నింపేందుకు బంకుల్లో కూడా అప్పులే. అలాంటిది.. ఎమ్మెల్యేగా గెలిచాక దందాలతో కోట్లు వెనకేశారు.

3

ఆ నేత ఇలాకాలో జరిగే ప్రతి పనికీ కమీషన్ ఇవ్వాల్సిందే. బెల్టు షాపులు, రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కప్పం కట్టాలి. ఇక ఇసుకలో ఎమ్మెల్యేగారు కుమ్మేశారు. ఉద్యోగాల పేరిటా దండుకున్నారు. చౌకధరకు 200 ఎకరాలు కొట్టేశారు. ఒకటికి ఆరు ఖరీదైన కార్లయ్యాయి. పదవిని అడ్డుపెట్టుకుని కుటుంబం మొత్తం అక్రమార్జనకు తెగబడ్డారు. వీరిని సాగనంపితే తప్ప అక్రమాలకు తెరపడదని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.



పీసపాడు వీధుల్లో కర్రలు చేతబట్టి స్వైర విహారం చేస్తున్న వైసీపీ శ్రేణులు

పల్నాడులో ఎమ్మెల్యే బంధువు వీరంగం

- 200 మంది గూండాలను వెంటేసుకుని స్వైరవిహారం
- నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభివృద్ధి పట్ల సాయి నిరసన
- నాలుగు రోజులుగా సాయికి హెచ్చరికలు
- అయినా ఎమ్మెల్యే బంధువును కట్టడి చేయని పోలీసులు
- దీంతో క్రోసూరులో రెచ్చిపోయిన వైసీపీ శ్రేణులు
- తెలుగుదేశం కార్యాలయం ధ్వంసం...

గుంటూరు, జనవరి 30 : పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆగడాలు హద్దు మీరాయి. ఆయన అన్న కుమారుడు కల్యాణ్ నేతృత్వంలో వైసీపీ శ్రేణులు క్రోసూరు పట్టణ వీధుల్లో మంగళవారం స్వైర విహారం చేశాయి. ఫ్యాక్షన్ సినిమాను అక్కడి దృశ్యాలు గుర్తుకు తెచ్చాయి. టీడీపీకి చెందిన కంచేటి సాయికుమార్ గత ఎన్నికలకు ముందు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఆయన బలపరిచిన నంబూరు శంకరరావు పెదకూరపాడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా నిలిచి గెలిచారు. అయితే, ఇసుక వ్యవహారంలో ఎమ్మెల్యేతో విభేదాలు రావడంతో వారిమధ్య మనస్పర్థలొచ్చాయి. సాయిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం సాయి... టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే అవినీతిపై పోరాడుతున్న సాయికుమార్ టీడీపీలో చేరిన తర్వాత స్వరం మరింత పెంచారు. దీంతో నాలుగైదు రోజులుగా సోషల్ మీడియాలో ఎమ్మెల్యే అనుచరులు, వైసీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో సాయి లక్ష్యంగా హెచ్చరికలు, బెదిరింపులకు దిగారు. కాగా మంగళవారం సాయంత్రం క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి స్వగ్రామం పీసపాడుకు సాయి బయలుదేరారు. ఈ నేపథ్యంలో కల్యాణ్ నేతృత్వంలో 200 మందికి పైగా గూండాలు కర్రలు చేత పట్టుకొని క్రోసూరు పట్టణంలో స్వైర విహారం చేశారు. సాయికి అనుకూలురుగా పేరుపడిన ఓ దస్తావేజు లేఖరి, టీడీపీ నేత కంభంపాటి రాము కార్యాలయంపై దాడి చేసి బీభత్సం సృష్టించారు.. సాయికుమార్ స్వగ్రామానికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్న కుమారుడు కల్యాణ్ ఆధ్వర్యంలో క్రోసూరులో స్వైర విహారం చేస్తున్న గూండాలు పీసపాడు చేరుకుని వీధుల్లో పెద్ద, పెద్దగా సవాళ్లు, కేకలతో హోరెత్తించారు.

బీజేపీ నేత రంజిత్ హత్య కేసులో 15 మందికి మరణ శిక్ష

అలప్పుజ, జనవరి 30: కేరళకు చెందిన బీజేపీ ఓబీసీ నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో 15 మందికి మరణశిక్ష విధిస్తూ మంగళవారం ఇక్కడి కోర్టు తీర్పు చెప్పింది. దోషులంతా నిషేధిత ఇస్లామిస్ట్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కి చెందిన వారు. మవిలెక్కిరలోని అదనపు జిల్లా జడ్జి వి.జి.శ్రీదేవి ఈ శిక్షలు విధించారని స్పెషల్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ జి పడిక్కల్ తెలిపారు. మొత్తం 15మంది ముద్దాయిలకుగానూ 14 మందిని కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. అనారోగ్యం కారణంగా మరొకరు ఆస్పత్రిలో ఉన్నారని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయిన శ్రీనివాసన్‌ను 2012 డిసెంబరు 19న అతని ఇంట్లోనే కుటుంబసభ్యుల ముందే ముద్దాయిలు హత్య చేశారు. కుటుంబ సభ్యుల సమక్షంలోనే హత్య చేయడం క్రూరమైన నేరమని, దీన్ని అత్యంత అరుదైనదిగా గుర్తించి మరణ శిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ కోరింది. నిందితులంతా శిక్షణ పొందిన హంతకుల ముఠాకు చెందిన వారని తెలిపింది. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం గరిష్ఠ శిక్ష విధించింది. ఈ తీర్పుపై శ్రీనివాసన్ భార్య సంతృప్తి వ్యక్తం చేశారు.

మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీకి 75% హాజరు మస్ట్

న్యూఢిల్లీ, జనవరి 30: వైద్య కళాశాలల్లోని అధ్యాపక సిబ్బంది కాలేజీ వేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేయకూడదని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశించింది. వారికి 75% హాజరును తప్పనిసరి చేసింది. ఘోస్ట్ ఫ్యాకల్టీ సమస్యను పరిష్కరించే దిశగా కమిషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. గతవారం విడుదల చేసిన "పీజీ కోర్సులకు కనీస ప్రమాణాలు 2023 (పీజీఎంఎస్ఆర్-2023)"కు సంబంధించిన మార్గదర్శకాల్లో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఇమ్రాన్ ఖాన్‌కు మరో పదేళ్ల జైలు

ఇస్లామాబాద్, జనవరి 30: మరో తొమ్మిది రోజుల్లో పాకిస్థాన్ పార్లమెంటు అయిన నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సమయంలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ (71)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఖైదులో ఉన్న ఆయనకు మంగళవారం ప్రత్యేకకోర్టు మరో పదేళ్ల జైలు శిక్ష విధించింది.

పళనిలో అన్యమతస్థుల ప్రవేశం నిషిద్ధం

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని సుప్రసిద్ధ శైవక్షేత్రం పళని దండాయుధపాణి ఆలయంలో హిందువులు మినహా అన్యమతస్థులు ధ్వజస్తంభాన్ని దాటి లోపలకు వెళ్లేందుకు అనుమతించకూడదంటూ మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది. ఇటీవల ఆ ఆలయంలో 'అన్యమతస్థులు ఆలయంలో ప్రవేశించడానికి అనుమతి లేదు' అనే ప్రకటన బోర్డును ఆలయ నిర్వాహకులు తొలగించారు. దీన్ని వ్యతిరేకిస్తూ పళనికి చెందిన సెంథిల్‌కుమార్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

కాలినడకన వస్తున్న జవాన్లపై కాల్పులు

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

చింతూరు, జనవరి 30: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు రెచ్చిపోయారు. పహారా కోసం కాలినడకన వస్తున్న జవాన్ల రాకను పసిగట్టిన మావోయిస్టులు దారికాచి కాల్పులకు తెగబడ్డారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు, జవాన్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతిచెందగా 15 మంది గాయపడ్డారు. గాయపడిన జవాన్లను రాయపూర్ ఆస్పత్రికి తరలించారు.




భారత నౌకాదళం అదుపులోకి తీసుకున్న సముద్రపు దొంగలు

పాకిస్థానీయులను కాపాడిన భారత నేవీ

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సోమాలియా తూర్పు కోస్తా తీరంలో సముద్రపు దొంగల నుంచి మరో మత్స్యకార నౌకను, అందులో 19 మంది పాకిస్థాన్ దేశస్థులను భారత నౌకాదళం కాపాడింది. సోమాలియా, గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో ఇరాన్‌కు చెందిన మత్స్యకార పడవ 'నీమి'ని సముద్రపు దొంగలు హైజాక్ చేసినట్టు సోమవారం సమాచారం అందడంతో ఐఎన్ఎస్ సుమిత్ర వెంటనే నౌక నుంచి హెలికాప్టర్‌లో వెళ్లి రక్షణ చర్యలు చేపట్టింది. పడవలో 19 మంది పాకిస్థాన్ దేశీయులు ఉండగా వారిని కాపాడింది. అలాగే 11 మంది సముద్రపు దొంగలను అదుపులోకి తీసుకొంది.

మనిషి మెదడులో మస్క్ చిప్



మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమైన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, కాస్మాలజిస్ట్ స్టీఫెన్ హాకింగ్ గుర్తున్నారా? కండరాలను నిర్వీర్యం చేసే వ్యాధి కారణంగా శరీరమంతా చచ్చుబడిపోయినా.. వీల్‌చైర్‌లో కూర్చుని తన బుగ్గ కండరాన్ని కదలించడం ద్వారా ఎన్నో అద్భుతమైన ప్రతిపాదనలను, సిద్ధాంతాలను ప్రపంచానికి అందించారాయన! కానీ అది చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఆయన వీల్‌చైర్‌కి అమర్చిన కంప్యూటర్ తెరపై పదాలు వరుసగా వెళ్తుంటే.. తాను అనుకున్నపదం వచ్చినప్పుడు బుగ్గ కండరాన్ని కదల్చడం ద్వారా తాను చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పేవారాయన. అంత కష్టం లేకుండా.. ఆయన మెదడులో ఒక ఇంప్లాంట్‌ను అమర్చి, అది వైర్‌లెస్‌గా ఏ కంప్యూటర్‌కో, ఫోన్‌కో అనుసంధానమైపోయి.. ఆయన మెదడులో వచ్చిన ఆలోచనలను అక్షర రూపంలోకి మార్చే అవకాశం ఉంటే? అలాంటివాటిని 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)'గా వ్యవహరిస్తారు. అదుగో.. సరిగ్గా అలాంటి వైర్‌లెస్ బీసీఐ చిప్‌నే టెక్ బిలియనీర్ ఈలన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' స్టార్టప్ అభివృద్ధి చేసింది. ఆ ఇంప్లాంట్‌ను సోమవారం ఒక వ్యక్తికి అమర్చామని.. ఆ వ్యక్తి చక్కగా కోలుకుంటున్నారని మస్క్ మంగళవారం ట్విటర్ ద్వారా ప్రపంచానికి తెలిపారు. ఆ ఇంప్లాంట్‌కు 'టెలీపతి' అనే పేరు పెట్టినట్టు వెల్లడించారు. ఆ ఇంప్లాంట్ కేవలం మన ఆలోచనతోనే ఫోన్, కంప్యూటర్ సహా ఏ ఎలక్ట్రానిక్ పరికరాన్నైనా అనుసంధానం అయి వాటిని నియంత్రిస్తుందన్నారు. తొలిదశల్లో ఈ ఇంప్లాంట్‌ను.. రకరకాల కారణాల వల్ల తమ అవయవాలను కోల్పోయినవారికి ఉపయోగిస్తామని మస్క్ స్పష్టం చేశారు. " ఒక్కసారి ఊహించుకోండి.. స్టీఫెన్ హాకింగ్ (మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా వేలు కూడా కదపలేక కుర్చీకే పరిమితమైన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త) తన ఆలోచనలతోనే అత్యంత వేగంగా టైప్ చేసేవారికన్నా వేగంగా తన ఆలోచనలను ప్రసారం చేయగలిగితే? అదే నా లక్ష్యం" అని ట్వీట్ చేశారు.

ఏడేళ్లుగా పరిశోధనలు..

2016లో మస్క్ ప్రారంభించిన 'న్యూరాలింక్' స్టార్టప్ ఏడేళ్ల పరిశోధనల ఫలితమే ఈ ఇంప్లాంట్. దీన్ని సర్జరీ ద్వారా.. మెదడులో కదలికలను నియంత్రించే భాగానికి అనుసంధానం చేస్తారు. అలాగే, మన ఫోన్‌లో ఉన్న న్యూరాలింక్ యాప్‌కు దాన్ని కనెక్ట్ చేస్తారు. అప్పుడది మెదడులోని నాడుల కదలికలను ఆలోచనలుగా తర్జుమా చేసి, వాటిని ఆదేశాలుగా మలిచి న్యూరాలింక్ యాప్ ద్వారా కంప్యూటర్ లేదా ఫోన్‌ను నియంత్రించగలిగేలా చేస్తుందన్నమాట. ఈ ఇంప్లాంట్‌ను మానవులకు అమర్చి ప్రయోగాలు చేయడానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ గత ఏడాది మే నెలలో అనుమతిచ్చింది. దీంతో న్యూరాలింక్ సంస్థ 'ప్రైమ్ (ప్రిసైజ్ రోబోటికల్లీ ఇంప్లాంటెడ్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)' పేరిట ట్రయల్స్‌ను ప్రారంభించింది. వెన్నుపూసకు గాయాలు కావడం వల్ల, అమ్యోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్ (ఏఎల్ఎస్) వంటి వాటి వల్ల మంచానికే పరిమితమైనవారి నుంచి ఈ ట్రయల్స్‌లో పాల్గొనడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎన్1.. ఆర్1

న్యూరాలింక్ తయారుచేసిన ఈ బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లో ముఖ్యమైనవి.. ఎన్1 ఇంప్లాంట్, దాన్ని మెదడులో అమర్చే ఆర్1 అనే సర్జికల్ రోబో. ఎన్1 ఇంప్లాంట్ ఒక నాణెం పరిమాణంలో ఉంటుంది. దాంట్లో.. చిప్, ఒక బ్యాటరీ, చిప్‌కు అనుసంధానంగా.. 1024 ఎలక్ట్రోడులను కలిగి ఉన్న 64 అత్యంత సన్నటి దారాలు (అవి వెంట్రుకలో ఇరవయ్యో వంతు పరిమాణంలో ఉంటాయి) ఉంటాయి. ఆ చిప్‌ను ఆర్1 రోబో పుర్రె గుండా మనిషి మెదడులో అమరుస్తుంది. ఈ రోబో ఎత్తు 8 అడుగులు.

ఎంతవరకూ సురక్షితం?

జంతువులపై నిర్వహించిన ట్రయల్స్‌లో భద్రతాపరమైన ప్రోటోకాల్స్‌ను ఉల్లంఘించినందుకు న్యూరాలింక్‌కు జరిమానా కూడా పడింది. అంతేకాదు.. ఆ ట్రయల్స్‌లో భాగంగా జంతువులకు 'టెలీపతి' ఇంప్లాంట్‌ను అమర్చగా కొన్ని పక్షవాతానికి గురయ్యాయి. మరికొన్ని మూర్ఛ, మెదడువాపు వంటి సమస్యలతో ఇబ్బందిపడ్డాయి. ఈ ప్రయోగాల్లో 1500 దాకా జంతువులు (గొర్రెలు, కోతులు, పందులు) చనిపోయినట్టు రాయిటర్స్ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే మానవులపై ప్రయోగానికి ఎఫ్‌డీఏ అనుమతులు రావడానికి చాలాకాలం పట్టింది.



ఎన్1 ఇంప్లాంట్



ఇంప్లాంట్‌ను మెదడులో అమర్చే రోబో

ఇదే మొదటిది కాదు


బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ ఇంప్లాంట్లు కొత్తవేమీ కావు. బ్లాక్‌రాక్ న్యూరోటెక్ అనే సంస్థ రెండు దశాబ్దాల క్రితమే 'యూటా యారే' అనే పేరుతో ఒక ఇంప్లాంట్‌ను అభివృద్ధి చేసింది. సింక్రాన్ అనే మరో సంస్థ కూడా గతంలో ఇలా బ్రెయిన్ ఇంప్లాంట్లను మనుషులకు అమర్చింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఈపీఎఫ్ఎల్ (ఎకోల్ పాలిటెక్నిక్ ఫెడరల్ ఇన్ లాసాన్) గత ఏడాది మే నెలలో.. ఒక పక్షవాత బాధితుడి మెదడులో ఇంప్లాంట్‌ను అమర్చి అతడు నడవగలిగేలా చేసింది. అతడి పేరు గెర్ట్ జాన్ ఆస్కామ్ (41). పన్నెండేళ్ల క్రితం సైక్లింగ్ పోటీల్లో అతడు ప్రమాదానికి గురయ్యాడు. వెన్నుపూసకు దెబ్బతగలడంతో అప్పట్నుంచీ వీల్‌చైర్‌కే పరిమితమైన జాన్ మెదడులో.. స్విట్జర్లాండ్‌కు చెందిన ఒక సంస్థ అతడి బ్రెయిన్‌లో ఒక ఇంప్లాంట్‌ను అమర్చింది. అతడు నడవాలనుకున్నప్పుడు ఆ ఇంప్లాంట్ అతడి ఆలోచనను ఆదేశంగా మలచి నాడుల ద్వారా కాళ్లకు పంపుతుంది. సాధారణ ఆరోగ్యవంతుల్లాగా నడవలేకపోవచ్చుగానీ.. దానివల్ల అతడు అప్పుడే అడుగులు నేర్చుకునే పసిపిల్లల్లాగా నడుస్తున్నాడు. ప్రపంచవ్యాప్తంగా కనీసం 42 మంది తమ మెదళ్లలో ఇలాంటి ఇంప్లాంట్లను కలిగి ఉన్నారని వాషింగ్టన్ పోస్ట్ వార్తాసంస్థ తెలిపింది.

-సెంట్రల్ డెస్క్

బ్రెయిన్‌జాకింగ్ ముప్పు

టెక్నాలజీ రెండువైపులా పదునుండే కత్తి లాంటిది. అందుకు ఉదాహరణ కంప్యూటర్లు, ఫోన్లే. మన సౌలభ్యం కోసం తయారుచేసుకున్న ఈ పరికరాలను హ్యాక్ చేసి సమాచారాన్ని తస్కరించే దొంగలున్నట్టే.. పక్షవాతం కారణంగా కదల్లేని వారి శరీరంలో అమర్చే న్యూరల్ ఇంప్లాంట్లను వేరెవరైనా హ్యాక్ చేసి సదరు మనుషులను తాము చెప్పినట్టల్లా రోబోల్లా ఆడించే ప్రమాదం ఉందనే ఆందోళనలు చాలాకాలంగా ఉన్నాయి. నిజానికి 2022లో ఒక సందర్భంలో సాక్షాత్తూ ఈలన్‌మస్కే.. భవిష్యత్తులో మానవులు తమ బ్రెయిన్‌చిప్‌లను ఎప్పటికప్పుడు వైర్‌లెస్‌గా అప్‌గ్రేడ్ చేసుకుంటారు అని జోస్యం చెప్పాడు. అంటే మన ఫోన్‌లో ఆండ్రాయిడ్, ఐవోఎస్ అప్‌డేట్లు వైఫై ద్వారా వచ్చినట్టుగానే.. బ్రెయిన్ చిప్‌లను కూడా ఎప్పటికప్పుడు కొత్త సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు అన్నమాట. కానీ, ఆ అప్‌డేట్లలో బగ్స్ ఉంటే? అనే ప్రశ్నకు ఇప్పటిదాకా ఎవరిదగ్గరా సమాధానం లేదు. దీంట్లో ఇంకో ముప్పు కూడా ఉంది. ఇప్పుడు బాగా డబ్బున్నవాళ్లు ఖరీదైన ఫోన్లు కొనుక్కున్నట్టే.. భవిష్యత్తులో తమ బ్రెయిన్ ఇంప్లాంట్లకు అత్యంత ఖరీదైన అప్‌గ్రేడ్‌లు చేయించుకుని తెలివిని పెంచేసుకుంటే బాగా తెలివైనవాళ్లు.. తెలివి తక్కువగా ఉన్నవారు అనే వర్గాలుగా మానవాళి విడిపోతుందన్న ఆందోళనా కొందరిలో ఉంది.

లోకం తీరు



మహిళా ఉద్యోగి పింఛను పిల్లలకు

- తమ తదనంతరం సంతానాన్ని నేరుగా నామినేట్ చేయొచ్చు
- సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్‌కు సవరణ

న్యూఢిల్లీ, జనవరి 30: మహిళా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కుటుంబ పింఛను విషయంలో కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వారి తదనంతరం పింఛను భర్తకే చెందుతుండగా.. ఇకమీదట మాత్రం అర్హులైన పిల్లలకు వెళ్లేలా పింఛన్లు, పింఛనుదారుల సంక్షేమ శాఖ (డీవోపీపీడబ్ల్యూ) సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్ (2021)లో సవరణ చేసింది. అయితే, దీనికి సంబంధించి వారు లిఖితపూర్వకంగా తమ సంతానాన్ని నామినేట్ చేస్తూ విభాగాధిపతికి లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా.. పింఛను కుమారుడు లేదా కుమార్తెలకు వెళ్తుంది. భార్యాభర్తలు విడాకులు తీసుకుని, గృహ హింస, వరకట్న నిరోధక చట్టం, ఐపీసీ కేసుల వంటి వివాదాలు ఉన్న కుటుంబాల్లో ఈ మార్పు చాలా కీలకం కానుంది. ఎందుకంటే.. ప్రస్తుతం మహిళా ఉద్యోగులు, పింఛనుదారుల ప్రతిపాదనల మేరకు మరణానంతరం తొలుత పింఛను వారి భర్తకు, ఆయన మరణం/అనర్హుడు అయిన తర్వాతనే సంతానానికి వెళ్తోంది. ఇకపై మాత్రం నేరుగానే పిల్లల పేర్లను ఇవ్వొచ్చు. ఒకవేళ సంతానం లేకున్నా, మైనర్లు అయినా, మానసిక వైకల్యంతో బాధపడుతున్నా.. వారి సంరక్షకుడి హోదాలో/సంరక్షకుడిగా ఉన్నంతకాలం పింఛను భర్తకే వెళ్తుంది. పిల్లలు మేజర్ అయ్యాక వారికి చెందుతుంది. ఇక మహిళా పింఛనుదారు చనిపోయిన సందర్భంలో, భర్త ఉన్నప్పటికీ పిల్లలు మేజర్ అయితే వారికే అందుతుంది. కాగా, ఈ నిర్ణయం మహిళా సాధికారత పట్ల మోదీ నిబద్ధతకు నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

చంద్రబాబు భద్రతపై ఎన్ఎస్‌జీ మళ్లీ సీరియస్

- తూర్పుగోదావరి పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపై ఎన్ఎస్‌జీ(నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్) మరోమారు సీరియస్ అయ్యింది. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కాతేరులో 'తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా' సభలో జనం ఒక్కసారిగా వేదికపైకి రావడంతో తోపులాట జరిగి చంద్రబాబు కింద పడబోగా, అప్రమత్తమైన ఎన్ఎస్‌జీ కమెండోలు, వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఆపి ఆయనను సురక్షితంగా వేదిక నుంచి హెలీప్యాడ్ వద్దకు తీసుకెళ్లారు. ఈ ఘటనను ఎన్ఎస్‌జీ సీరియస్‌గా తీసుకొంది. తూర్పుగోదావరి పోలీసులపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. భద్రతా వైఫల్యంపై ఢిల్లీలోని తమ కేంద్ర కార్యాలయానికి కూడా ఎన్ఎస్‌జీ నివేదిక అందజేసినట్టు సమాచారం. కాగా, చంద్రబాబు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎన్ఎస్‌జీ సీరియస్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతేడాది ఇదే జిల్లాలోని అనపర్తిలో రాత్రి వేళ సుమారు 7 కి.మీ. చీకటిలో చంద్రబాబు నడవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చింది. అప్పుడు కూడా ఎన్ఎస్‌జీ తమ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇచ్చింది.

'రెడ్‌బుక్' విచారణ 6కు వాయిదా

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర ముగింపు సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో చేసిన వ్యాఖ్యలపై సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు వచ్చే నెల 6కి వాయిదా వేసింది. ప్రభుత్వం చెప్పినట్టుగా అక్రమ కేసులు నమోదు చేసిన అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకున్నామని, అధికారంలోకి రాగానే వారి సంగతి తేల్చుతామని లోకేశ్ వ్యాఖ్యానించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా, వచ్చేనెలకు వాయిదా వేశారు.

మాకు నితీశ్ అవసరం లేదు

- పోరు కొనసాగిస్తాం: రాహుల్

పూర్ణియా, జనవరి 30: బిహార్‌లో సామాజిక న్యాయం కోసం తాము పోరాటం కొనసాగిస్తామని, దీనికి నితీశ్ కుమార్ అవసరం తమకు ఏమాత్రం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ నుంచి కొంచెం ఒత్తిడి వచ్చేసరికి నితీశ్ 'యూటర్న్' తీసుకున్నారని విమర్శించారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా ఆయన మంగళవారం పూర్ణియా చేరుకున్నారు. రంగభూమి మైదానంలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దళితులు, ఓబీసీలు, గిరిజనులు, ఇతరుల జనాభా కచ్చితంగా తెలియాలంటే దేశంలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మణిపూర్‌లో అంతర్యుద్ధ వాతావరణం ఏర్పడినా ప్రధాని ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని మండిపడ్డారు. ఇండియా కూటమిని వీడి, మళ్లీ బీజేపీతో చేతులు కలిపిన జేడీయూ అధినేత నితీశ్ ఆదివారం బిహార్ సీఎంగా తొమ్మిదోసారి ప్రమాణ స్వీకారం తెలిసిందే.

షిండే కూటమిలో 'మరాఠా' చిచ్చు!

ముంబై, జనవరి 30: మహారాష్ట్రలో సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని మహాయుతి కూటమిలో మరాఠా చిచ్చు రేగింది. మరాఠాలను ఓబీసీలో చేర్చాలన్న షిండే నిర్ణయంపై అజిత్‌పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ వర్గం, బీజేపీ మండిపడుతున్నాయి. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం (ఒకటో తేదీన) రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు నిర్వహించాలని ఎన్‌సీపీకి చెందిన రాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్ ఓబీసీలకు పిలుపిచ్చారు. 3వ తేదీన తాను మెగా ర్యాలీ నిర్వహిస్తానని ప్రకటించారు. మరాఠాలను ఓబీసీలో చేర్చడాన్ని బీజేపీకి చెందిన కేంద్రమంత్రి నారాయణ్‌రాణే కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. భుజ్‌బల్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం, రాష్ట్ర బీజేపీ నేత ఫడణవీస్ స్పందించారు. సీఎంతో కూర్చుని మాట్లాడకుండామని, అనవసరపు ప్రకటనలతో అలజడి రేగుతుందని అన్నారు. ఇరు వర్గాలకు ఇబ్బంది లేకుండా షిండే వ్యవహరించాల్సిందని, చర్చలతో పరిష్కారం కనుక్కోవాలని కోరారు.

డీ-రిజర్వేషన్ ముసాయిదా తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 30: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన పోస్టులకు తగిన అభ్యర్థులు దొరకని పక్షంలో వాటిని అన్ రిజర్వుడుగా ప్రకటించాలనే ప్రతిపాదనతో రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో.. యూజీసీ వాటిని తన వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ప్రజలు,సంబంధిత భాగస్వాముల నుంచి ఫీడ్‌బ్యాక్ కోరుతూ తమ వెబ్‌సైట్‌లో పెట్టిన ఈ గైడ్‌లైన్స్‌ను తొలగించినట్టు యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ మంగళవారం వెల్లడించారు.

రాంచీలో సోరెన్ ప్రత్యక్షం

- జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలతో భేటీ
- ఎమ్మెల్యేలు రాజధానిలోనే ఉండాలని సూచన.. పాల్గొన్న సీఎం సతీమణి
- సీఎస్, డీజీపీతో గవర్నర్ భేటీ

రాంచీ, జనవరి 30: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయనుందన్న వార్తల నేపథ్యంలో దాదాపు 30 గంటలకు పైగా కనిపించకుండా పోయిన ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు, సీఎం హేమంత్ సోరెన్ మంగళవారం రాంచీలోని తన అధికార నివాసంలో ప్రత్యక్షమయ్యారు. తాను ఎక్కడికీ పోలేదని, ప్రజల హృదయాల్లో ఉన్నానని చెప్పారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బాపూ వాటికలో నివాళి అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జేఎంఎం కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులతో హేమంత్ సోరెన్ అంతకు ముందు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆయన భార్య కల్పన సోరెన్ కూడా పాల్గొన్నారు. బుధవారం హేమంత్‌ను ఈడీ ప్రశ్నించనున్న నేపథ్యంలో, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో సమీక్ష జరిపారు. ఎమ్మెల్యేలను రాజధానిలోనే ఉండాలని సూచించారు. అనంతరం జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే మీడియాకు వివరాలు అందిస్తూ.. 'సీఎం హేమంత్ సోరెన్‌కు రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నాయి. ఆయన మచ్చ లేకుండా బయటపడతారు. నియంతలను ఎదుర్కోవటానికి మాకైన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాం' అని తెలిపారు. హేమంత్ సోరెన్ మంగళవారం వేకువజామున రాంచీకి వచ్చినట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సీఎస్, డీజీపీ తదితర ఉన్నతాధికారులతో ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. అదనంగా ఏడు వేల మంది పోలీసులను మోహరించారు. సీఎం నివాసం, రాజ్‌భవన్, ఈడీ ఆఫీసు వద్ద నిషేధాజ్ఞలు విధించారు.

ప్లాన్ బీ.. సీఎం కుర్చీలో కల్పన సోరెన్!



హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేస్తే, సీఎం బాధ్యతలను ఆయన భార్య కల్పన సోరెన్ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. జేఎంఎంలో కూడా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు లేవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జేఎంఎం కూటమి ప్లాన్ బీని సిద్ధం చేసుకుందని పేర్కొన్నాయి. అయితే, కల్పన ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేరు. పార్టీ ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ జనవరి 2వ తేదీన రాజీనామా చేశారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన గాండే నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కల్పన కోసమే సర్ఫరాజ్ రాజీనామా చేసినట్లుగా అప్పట్లో ఊహాగానాలు వెలువడ్డాయి.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి



న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్నాయి. ప్రస్తుత 17వ లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు కానుండగా నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాక తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ ఏడాదిలోనే లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బుధవారం ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ప్రస్తుత లోక్‌సభకు చివరి సమావేశాలు కావడంతో సుహృద్భావ వాతావరణంలో నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి 146 ఎంపీలను సస్పెండ్ చేయగా వారిలో 132 మందిపై దీన్ని ఆ సెషన్ వరకే పరిమితం చేశారు. మిగతా 14 మందిలో 11 మంది రాజ్యసభ సభ్యులు, ముగ్గురు లోక్‌సభ సభ్యులున్నారు. ఈ 14 మంది సభ్యుల కేసును ఉభయసభల ప్రివిలేజ్ కమిటీలకు పంపారు. జనవరి 12న లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ ముగ్గురు లోక్‌సభ సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. రాజ్యసభకు చెందిన ప్రివిలేజ్ కమిటీ మంగళవారం 11 మంది సభ్యులపై సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. మరోవైపు.. బడ్జెట్ సమావేశాల్లో ప్రతి సమస్యపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయా పార్టీల ఫ్లోర్ లీడర్లకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి ఈ మేరకు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గత సమావేశాల్లో మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంటు భద్రత, మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వ రద్దు అంశంపై నిలదీసిన ప్రతిపక్ష కూటమి ఈసారి ఉమ్మడి కార్యాచరణను ఇప్పటివరకూ ప్రకటించలేదు. కాగా, కేంద్రం తాజా ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పీఎం కిసాన్ మొత్తాన్ని 50% పెంచి ఎకరాకు రూ.9 వేలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

చండీగఢ్ కార్పొరేషన్ బీజేపీ చేతికి!

చండీగఢ్, జనవరి 30: చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో మేజిక్ జరిగింది. ఇండియా కూటమిగా బరిలో దిగిన ఆప్, కాంగ్రెస్ పార్టీలకు కలిపి 20 మంది(13+7) కౌన్సిలర్లు ఉన్నా బీజేపీకి చెందిన మనోజ్ కుమార్ సోలంకి 16 ఓట్లతో మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆప్ అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌కు 12 ఓట్లు వచ్చాయి. కూటమికే చెందిన 8 ఓట్లు చెల్లలేదని ప్రకటించారు. దాంతో ఆగ్రహించిన ఆప్, కాంగ్రెస్ సభ్యులు కార్పొరేషన్ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను బహిష్కరించారు. ఆ తర్వాత ఏకపక్షంగా జరిగిన ఎన్నికల్లో మిగతా రెండు పదవులను కూడా బీజేపీ దక్కించుకుంది. 2022లో కూడా ఆప్‌కు చెందిన కౌన్సిలర్ ఓటు చెల్లదని ప్రకటించిన తర్వాత బీజేపీ సభ్యుడు మేయర్‌గా ఎన్నికయ్యారు. చండీగఢ్ మున్సిపల్ చట్టం ప్రకారం ఏటా జనవరిలో మూడు ప్రధాన పోస్టులకు ఎన్నికలు జరుగుతాయి. పార్టీ ఫిరాయించదలచుకున్న సభ్యులు బ్యాలెట్ పేపర్ వెనుక టిక్ పెట్టడం, గోప్యతను భంగం కలిగిందన్న కారణంతో సదరు ఓటును చెల్లదని ప్రకటించడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది.





తిరుపతి గరుడ కూడలిలో జరుగుతున్న సినిమా షూటింగ్, నిలిచిపోయిన వాహనాలు

శ్రీవారి భక్తులకు సినిమా కష్టాలు

- అలిపిరి సర్కిల్లో షూటింగ్‌తో ఇబ్బందులు
- భక్తులు, మీడియాతో బౌన్సర్ల దురుసు ప్రవర్తన
- చిత్ర యూనిట్‌పై పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30: తిరుపతిలోని అలిపిరి గరుడ కూడలిలో సినిమా షూటింగుకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో శ్రీవారి భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీగా ఉండే ఉదయం వేళల్లో చిత్రీకరణ చేయడం, శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలను నిలిపివేయడంతోపాటు సినిమా యూనిట్‌కు చెందిన బౌన్సర్ల దురుసు ప్రవర్తన తీవ్ర వివాదాస్పదమైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ హీరో ధనుష్, అక్కినేని నాగార్జున నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణ తిరుపతిలో మంగళవారం జరిగింది. స్థానిక అలిపిరి గరుడ కూడలిలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్‌కు పోలీసులు అనుమతినిచ్చారు. సాధారణంగా ఉదయం వేళల్లో ఈ కూడలి వద్ద రద్దీ వుంటుంది. వీఐపీ దర్శనాలకు వెళ్లేవారినుంచి వివిధ ప్రదేశాలనుంచి రైళ్లు, బస్సుల్లో వచ్చే భక్తులు కూడా తిరుపతి నుంచి తిరుమలకు ఆ సమయంలోనే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో షూటింగ్‌కోసం పోలీసులు.. భక్తుల వాహనాలను దారి మళ్లించడంతో ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు వెళ్లాల్సిన భక్తులు సమయానికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో పోలీసులతో, సినిమా యూనిట్ సిబ్బందితో భక్తులు వాగ్వాదానికి దిగారు. దీంతో యూనిట్‌కు చెందిన బౌన్సర్లు భక్తుల పట్ల, పరిస్థితిని చిత్రీకరిస్తున్న మీడియా కెమెరామెన్ పట్ల దురుసుగా వ్యవహరించారు. ఓ కెమెరామెన్ సెల్‌ఫోన్ కూడా పగులగొట్టారు. పరిస్థితులు చేయిదాటిపోతుండడంతో షూటింగ్‌ను త్వరగా ముగించేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్ద జరిగిన షూటింగ్‌లో కూడా చిత్ర యూనిట్, బౌన్సర్లు మీడియా ప్రతినిధులపై దౌర్జన్యంగా వ్యవహరించడంతోపాటు బెదిరించడంతో మీడియా ప్రతినిధులు చిత్ర యూనిట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీవారి భక్తులను నిలిపివేసి పవిత్ర స్థలంలో సినిమా షూటింగ్‌కు అనుమతినివ్వడంపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. గరుడ కూడలిలో నిరసన ప్రదర్శనకు కూడా అనుమతి ఇవ్వని పోలీసులు.. ఏకంగా సినిమా షూటింగ్‌కు అనుమతి ఇవ్వడంపై బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

మంత్రాలయం, జనవరి 30: కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.4,15,32,738 వచ్చింది. 2023 డిసెంబరు 28 నుంచి జనవరి 29 వరకు ఆదాయాన్ని మఠం గురురాజాంగణ భవనంలో మంగళవారం సిబ్బంది, భక్తులు లెక్కించారు. 33 రోజులకు సంబంధించి రూ.4,15,32,738 నగదుతో పాటు 3642 గ్రాముల వెండి, 44 గ్రాములు బంగారు, విదేశీ డాలర్లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.

ఫ్యాక్షన్ 'గడ్డ'పై ఫ్యామిలీ ప్యాకేజీ



నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుటుంబ రాజ్యం

- ఇసుకలో బొక్కేశారు.. ప్రతి పనిలో కమీషన్
- అనుచరుల పేరిట విచ్చలవిడిగా బెల్టు షాపులు
- సొంతూరులో నకిలీ మద్యం తయారీ?
- ఉద్యోగాలు ఇప్పిస్తామని భారీగా వసూళ్లు
- కౌరుచౌకగా 200 ఎకరాలు స్వాహా
- రేషన్ బియ్యం దందాకు ఆ ఇలాకా కేరాఫ్
- మైనింగ్‌తో కొండలు, గుట్టలు మాయం
- చివరకు పంట ఉత్పత్తుల కొనుగోళ్లలోనూ దందా
- నామినేటెడ్ పోస్టులో తండ్రి.. అన్నింటా తల్లి చక్రం
- నంద్యాల జిల్లాలో సకుటుంబ కథాచిత్రం

అక్రమార్జనలో అమ్మ పెత్తనం

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అనే సామెత ఉంది. ఇక్కడ రివర్స్ అన్న మాట. పుత్రరత్నం దందాలు సాగిస్తుంటే.. ఆయన పదవిని అడ్డుపెట్టుకుని తల్లి పెత్తనం సాగిస్తున్నారు. ఓ రకంగా ఆమె షాడో ప్రజా ప్రతినిధి. డబ్బులు వచ్చే అవకాశం ఉన్న ఏ వనరునూ వదలరన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు తెలియకుండా ఏదీ జరగరాదని కొడుకు అనుచరులకు ఆర్డర్ వేస్తారు. ఉద్యోగాల పేరిట సాగించిన వసూళ్లలో ఆమెదే ముఖ్య పాత్ర.

(నంద్యాల-ఆంధ్రజ్యోతి)

నంద్యాల జిల్లాలోని కీలక సెగ్మెంట్‌లో ఎమ్మెల్యే కుటుంబం దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంది. ముఖ్యంగా ఆయన పెదనాన్నకు నియోజవర్గంలో బాగా పేరుంది. సదరు ప్రజా ప్రతినిధి, ఆయన తండ్రి పెద్దాయనకు ఫాలోవర్లుగా ఉండిపోయారు. చాలాకాలంగా ఆ కుటుంబానికి పదవులు లేకపోవడం.. తండ్రి గుర్రపు పందెల్లో డబ్బు పోగొట్టుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ఎన్నికలకు ముందు ఆ కుటుంబానికి అప్పులు పుట్టకపోతే గడవని పరిస్థితి. గట్టిగా ఎకరా భూమి కూడా లేదు. ఆరు సెంట్లలో ఓ సాధారణ ఇల్లు ఉండేది. తండ్రికొడుకులు తిరగడానికి ఓ మాదిరి కారు ఉంది. అలాంటిది 2019లో ఎన్నికల్లో గెలవగానే వారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తారు. ఏదైనా వ్యాపారంలో లాభాలు ఆర్జించి సంపాదించారా? అంటే.. ఆ కుటుంబం మొత్తానికి వ్యాపారాలు ఉన్న దాఖలాలు ఏమీ లేవు. పదవిని అడ్డు పెట్టుకుని అక్రమ సంపాదన పోగేశారు. దేన్నీ వదలి పెట్టకుండా దోచుకుంటున్నారు. వారి ఆస్తులు చూసి స్థానిక ప్రజలు ఔరా అని నోరు వెళ్లబెడుతున్నారు..!

మైనింగ్ మాఫియా..

సదరు నేత ధాటికి నియోజకవర్గంలోని కొండలు, గుట్టలు మాయమవుతున్నాయి. వేసవి మొదలవుతుందనగానే భారీ యంత్రాలతో కొండలను పిండి చేసి యథేచ్ఛగా గ్రావెల్, మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తారు. టిప్పరుకు 9 నుంచి 12వేల వరకు వసూలు చేసి వెంచర్లకు, బిల్డింగ్ నిర్మాణదారులకు అమ్ముతారు. ఇక చెరువులు, చేలల్లో మట్టి తవ్వకాలకు అడ్డూ అదుపే ఉండదు. పట్టా, డీకేటీ భూముల్లో రైతులతో ఒప్పందం చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఏడు అడుగుల మేర తవ్వుతారు. ఈ మట్టిని ట్రాక్టర్లలో సమీప జిల్లా కేంద్రంలోని ఇటుక బట్టీలకు తరలించి, ఒక్కో ట్రాక్టరుకు రూ.8 వేలు వసూలు చేస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు చేస్తున్న వాహనాలను అధికారులు పట్టుకున్నా.. స్టేషనులో ఉండాల్సినవి తెల్లారేసరికి ప్రజా ప్రతినిధి ఇంటి పరిసరాల్లో కనిపిస్తాయి. ఈ నాలుగున్నరేళ్లలో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా సదరు నేత లెక్కకు మించి సంపాదించారన్న ఆరోపణలు ఉన్నాయి.

రేషన్ బియ్యం పక్కదారి

రేషన్ బియ్యం దందాకు నియోజకవర్గం కేరాఫ్ అడ్రస్‌గా మారడం వెనుక సదరు ప్రజా ప్రతినిధి అండ పుష్కలంగా ఉంది. ఆయన అనుచరుడు, మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్ రేషన్ బియ్యాన్ని సేకరించి అమ్ముతున్నారు. నియోజకవర్గానికి వచ్చే 80 శాతం రేషన్ బియ్యాన్ని అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. సదరు కౌన్సిలర్ మీద ఇప్పటికే 6ఏ కేసులు కూడా నమోదయ్యాయి. ఇక పాఠశాల నాడు-నేడు కాంట్రాక్టు పనుల్లో ఎమ్మెల్యే లెక్కకట్టి మరీ కమీషన్లు దండుకున్నట్లు సమాచారం. ఎలాగూ పాఠశాలల కమిటీ సభ్యులు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో కమీషన్ల వ్యవహారం అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది.

అక్రమంగా మద్యం తయారీ?

రాష్ట్రంలో బెల్టు షాపులను తొలగించామని అధికార వైసీపీ గొప్పగా చెబుతోంది. కానీ ఈ నియోజవర్గంలో బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామంలో ఆయన అనుచరుల ఆధ్వర్యంలో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ప్రభుత్వ మద్యం షాపుల నుంచే సరుకు తీసుకెళ్లి అమ్ముతున్నట్టు సమాచారం. ప్రజా ప్రతినిధి తన అధికారాన్ని అడ్డుపెట్టి ఇందుకు సహకరిస్తున్నట్టు విమర్శలున్నాయి. సరఫరా చేసే మద్యాన్ని బట్టి ఆయా బెల్టు షాపుల నుంచి కప్పం వసూలు చేస్తూ, నెలకు రూ.15 లక్షలకు పైనే దండుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో నకిలీ మద్యం కూడా తయారవుతున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో ఆయన సొంతూరికి సామాన్యంగా బయటివాళ్లు ఎవరూ వెళ్లే సాహసం చేయరు. దీన్ని అదనుగా తీసుకుని ఎమ్మెల్యే అనుచరులు అక్కడ మద్యం తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ మద్యాన్ని బెల్టు షాపులకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. ఇలా నియోజకవర్గ ప్రజలను మత్తులో ముంచి వారి ఇంటిని, ఒంటిని గుల్ల చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

కారుచౌకగా భూములు సొంతం

ఎమ్మెల్యే అయ్యాక తన ఇంటిని అందంగా తీర్చిదిద్దుకున్నారు. ఇంటి చుట్టుపక్కల ఉండే స్థలాలను సంబంధిత యజమానులను బెదిరించి తక్కువ ధరకు కొనేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో దాదాపు 200 ఎకరాలకు పైగా కూడబెట్టినట్లు తెలుస్తోంది. యజమానులను బెదిరించి మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా నామమాత్రంగా రూ.5 వేలు, రూ.10 వేలు ఇచ్చి బలవంతంగా రాయించుకున్నారన్న విమర్శలున్నాయి. ఇక కొన్ని భూములనైతే అధికార బలం చూపించి తన పరం చేసుకున్నట్లు విమర్శలున్నాయి. సదరు ప్రజా ప్రతినిధి అనుచరులు సైతం భూ ఆక్రమణలకు తెరలేపారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ బంజరు భూములు ఉన్నాయో కనిపెట్టి మరీ తమ పరం చేసుకుంటున్నారు. ఇందుకు ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అక్రమాలతో నియోజకవర్గ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఇసుకలో దందా.. కమీషన్లు

వైసీపీ ప్రభుత్వంలో కొత్త ఇసుక పాలసీ వచ్చాక ఎమ్మెల్యే ఇసుక అమ్మకాలను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. 2021లో స్థానిక మార్కెట్ యార్డులో ఇసుక డంప్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని ఎమ్మెల్యే దగ్గరి వ్యక్తి నిర్వహించేవారు. అధికారం చేతిలో ఉండటంతో సదరు ప్రజాప్రతినిధి తన అనుచరుడితో కలిసి ఇసుకను భారీగా పక్కదారి పట్టించారు. దాదాపు 8500 టన్నుల ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు ఇసుక డంప్‌పై దాడులు చేసి, నిర్వాహకుడికి జరిమానా విధించి, 2022లో డంప్‌ను తొలగించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే కన్ను పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై పడింది. మార్కెట్ యార్డును కేంద్రంగా చేసుకుని పసుపు, మినుము, శనగ ఉత్పత్తుల కొనుగోళ్లలో బాగా కమీషన్లు దండుకుంటున్నారు. రైతుల వద్ద నుంచి వచ్చే పంట ఉత్పత్తులకు కొర్రీలు పెట్టి తక్కువ ధరకు అనుచరుల ద్వారా కొనుగోలు చేయించి, ఆ తర్వాత ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లు

నియోజకవర్గంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగం పేరిట ఆశ చూపి సదరు నేత లక్షలు కొట్టేశారనే ఆరోపణలున్నాయి. కొత్తగా ఏర్పాటవుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి 8 నుంచి 14 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాల కాంట్రాక్టు పనుల్లోనూ కమీషన్ల పర్వం నడిచినట్లు తెలుస్తోంది. ఇక అంగన్వాడీ వర్కర్ పోస్టుకు ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు, సూపర్‌వైజర్ పోస్టులకు రూ.5 లక్షల వరకు దండుకున్నారు. డబ్బులు అందుకున్నాక ఎమ్మెల్యే ముఖం చాటేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో ఫిర్యాదు చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో బాధితులు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నిస్తే దాడులు

ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేస్తున్న అక్రమాలపై ఎవరైనా ప్రశ్నించినా, పత్రికల్లో వార్తలు రాసినా ఆయన అనుచరులు రంగంలోకి దిగుతారు. 'మట్టి తవ్వకాలు ఎవరు జరుపుతున్నారో తెలియదా? మరోసారి అడిగినా, అక్రమాల గురించి రాసినా మీ అంతు చూస్తాం' అంటూ బెదిరింపులకు దిగుతారు. ఫిర్యాదు చేసిన వారిపై ఎదురు కేసులు పెట్టి వేధించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న కక్షతో ఓ చానల్ విలేకరిని (ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కాదు) ఇంటికి పిలిపించి కొట్టినట్లు తెలుస్తోంది.



ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విజయవాడ లెనిన్ సెంటర్‌లో దీక్ష చేస్తున్న చలసాని, వివిధ పార్టీల నేతలు

హోదా కోసం గళమెత్తితే ఐటీ, ఈడీ దాడులు

- జయదేవ్ ప్రకటనతో మోదీ కక్షపూరిత వైఖరి వెలుగులోకి
- ప్రత్యేక హోదా సాధన సమితి నేతల ధ్వజం.. పలు జిల్లాల్లో నిరసనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ప్రత్యేక హోదా కోసం పార్లమెంటులో గళమెత్తితే ఐటీ, ఈడీ దాడులు చేసిందని, దీంతో రాజకీయాలే వదిలేసుకుంటున్నానని ఆయన పేర్కొనడం మోదీ కక్ష సాధింపు ధోరణి ఏ స్థాయిలో ఉంటుందో అర్థమౌతోందని ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విభజన హామీలు, ప్రత్యేక హోదా నినాదం మారుమోగింది. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో ప్రత్యేక హోదా సాధన సమితి నేతృత్వంలో మంగళవారం నిరసన దీక్షలు జరిగాయి. విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఏపీ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం పేరుతో దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ హోదా ఇవ్వకుంటే యువతకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఏపీకి చెందిన ఎంపీలు సిగ్గుంటే పార్లమెంటులో హోదా కోసం పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ పాల్గొన్నారు.

మేము ఉత్సవ విగ్రహాలమా?

- ఏపీ సర్పంచ్‌ల్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి

కర్నూలు(కలెక్టరేట్)/ ఏలూరు(కలెక్టరేట్)/ విజయనగరం(కలెక్టరేట్), జనవరి 30: వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఒక్క అభివృద్ధి పనీ చేయలేక పోతున్నారని, ఉత్సవ విగ్రహాల్లా ఉండాల్సిందేనా? అని ఏపీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో మంగళవారం సర్పంచులు నిరసన దీక్ష చేపట్టారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచుల న్యాయబద్ధమైన 16 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం దుర్మార్గమని విమర్శించారు. మహాత్మా గాంధీ వర్ధంతి రోజున నల్ల కండువా, బ్యాడ్జీలతో సర్పంచ్‌లు నిరసన తెలిపే దుస్థితి తీసుకురావడం వైసీపీ ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. పంచాయతీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్‌లు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు మంజూరు చేయాలంటూ విజయనగరం కలెక్టరేట్ వద్ద జిల్లాలోని సర్పంచ్‌లు మరోసారి ఆందోళన చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారిపై లైంగిక దాడి

- అంగన్వాడీ కార్యకర్త బంధువు దురాగతం.. పోక్సో కేసు నమోదు

గాలివీడు, జనవరి 30: అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు అంగన్వాడీ కేంద్రంలోనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంగన్వాడీ వర్కర్ నిర్లక్ష్యంతో తమ బిడ్డ ఓ కామాంధుని చేతిలో లైంగిక దాడికి గురయ్యిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని ఓ మినీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం నాలుగేళ్ల చిన్నారిని తల్లి వదలి వెళ్లింది. అనంతరం అంగన్వాడీ కార్యకర్త తనకు పని ఉందని పిల్లలను చూసుకోవాలంటూ తన సమీప బంధువు రెడ్డెప్ప(55)కు చెప్పి బయటకు వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన నిందితుడు చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లడంతో లైంగికదాడిని గుర్తించిన తల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీనిపై రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగాధర్‌బాబు, గాలివీడు ఎస్ఐ వెంకట శివకుమార్‌తో కలిసి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నిందితునిపై లైంగిక దాడి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. త్వరలోనే నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కాగా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడని సమాచారం.

ఏజీ శ్రీరామ్‌ది అధికార దుర్వినియోగం

- నిబంధనలకు విరుద్ధంగా స్టాండింగ్ కౌన్సిల్ నియామకం
- మనోహర్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేయండి
- ఇద్దరి అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశించండి
- హైకోర్టులో న్యాయవాది వ్యాజ్యం.. నేడు విచారణ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ లా ఆఫీసర్స్ నియామక నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా విశాఖ, నెల్లూరు మినహా ఆంధ్ర ప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.మనోహర్‌రెడ్డిని నియమించడం ద్వారా అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ తన హోదాను దుర్వినియోగం చేశారంటూ హైకోర్టులో న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. మనోహర్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేయాలని అభ్యర్థించారు. ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డి అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, సీబీఐ డైరెక్టర్‌తోపాటు వ్యక్తిగత హోదాలో ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డిలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యం బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఎదుట విచారణకు రానుంది. కాగా, ఏజీగా 2019లో శ్రీరామ్ బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఏపీ హైకోర్టు, ట్రిబ్యునల్‌లలో లా ఆఫీసర్ల నియామకంలో పారదర్శకత పాటించడంలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఎంతోమంది అర్హులైన, ప్రతిభావంతులైన న్యాయవాదులు ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి ఏజీ శ్రీరామ్ సిఫారసుతో 2022 సెప్టెంబరు 9న మనోహర్‌రెడ్డిని స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. ప్రతిభావంతులు, ఈడబ్ల్యూఎస్, బలహీనవర్గాల న్యాయవాదులకు అన్యాయం చేశారు. మనోహర్‌రెడ్డి 2004-11 మధ్య రెండు పర్యాయాలు ట్రిబ్యునల్‌లో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. చట్టనిబంధనలకు విరుద్ధంగా మళ్లీ మూడవ విడత ఆయనను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. ఆయన హైకోర్టులో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయరు. కేసులను వాదించే సామర్థ్యం లేదు. హైకోర్టులో బ్రోకర్ కార్యకలాపాలు చేస్తున్నారు. 2019లో మనోహరెడ్డిని స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ న్యాయవాది ఎం.సాల్మన్‌రాజు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ కేసు పెండింగ్‌లో ఉండగానే సాల్మన్‌రాజును ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. అనంతరం పార్టీ ఇన్ పర్సన్ సాల్మన్‌రాజు విచారణకు హాజరుకాకపోవడంతో హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ వ్యవహారాన్ని క్విడ్ ప్రోకోగా పరిగణించాలి' అని పిటిషన్‌లో వివరించారు.

చైర్మన్ దంపతులకు రెండు చోట్లా ఓట్లు

- నరసాపురం 2, 8 వార్డుల్లో.. స్వగ్రామంలోనూ తప్పుల తడకగా ఓటర్ల జాబితా

కాళ్ల, జనవరి 30: ఓటరు జాబితాలను ఎన్నిసార్లు సవరించినా కుప్పలు తెప్పలుగా తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. ఒకవైపు ఎన్నికల సంఘం ఎలాంటి తప్పులకూ తావు లేకుండా జాబితాలను సిద్ధం చేయాలని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మునిసిపల్ చైర్మన్ బర్రె శ్రీవెంకటరమణ, ఆమె భర్త జయరాజు ఓట్లు నరసాపురం 2, 8వ వార్డుల్లో ఉన్నాయి. అయితే వారి సొంత ఊరు కాళ్ల మండలం మోదీ గ్రామంలో కూడా వారికి ఓట్లు ఉన్నాయి. గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మోదీ గ్రామంలో చైర్మన్ దంపతులు ఓటు వేస్తున్న సమయంలో టీడీపీ ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో సైతం వీరి ఓట్లు రెండు చోట్లా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మోదీ గ్రామంలోని 237వ బూత్‌లో శ్రీవెంకటరమణ, 369వ బూత్‌లో ఆమె భర్త జయరాజు ఓట్లు ఉన్నాయి. దీంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు!

- బాబు అరెస్టుతో మరణించినవారి కుటుంబాలకు భువనేశ్వరి భరోసా
- బాపట్ల జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర
- మృతుల కుటుంబ సభ్యులకు మూడేసి లక్షల ఆర్థిక సాయం



పర్చూరు నియోజకవర్గం చిననందిపాడులో మువ్వ సింగారావు కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'కుటుంబంలో ఒకరిని కోల్పోతే ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. అధైర్యపడొద్దు.. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుంది. ఏ కష్టమొచ్చినా మా దగ్గరకు రావొచ్చు. మనమంతా టీడీపీ కుటుంబ సభ్యులమే' అని మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె బాపట్ల జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపగిలి మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లిలో చనిపోయిన కోట వెంకటేశ్వరరావు(60) కుటుంబ సభ్యులను ఓదార్చారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. పర్చూరు నియోజకవర్గం చిననందిపాడులో.. చంద్రబాబును అరెస్టు చేశారనే మనస్తాపంతో మరణించిన మువ్వ సింగారావు(52) కుటుంబానికి అండగా ఉంటామని భువనేశ్వరి ధైర్యం చెప్పారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలిచ్చారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడిలో మరణించిన టెక్కెం నాగేశ్వరరావు (56) కుటుంబసభ్యులను కూడా ఓదార్చారు. తమకు ఒక సెంటు భూమి కూడా లేదని.. చంద్రబాబు మీద ఉన్న అభిమానంతో ఆయన అరెస్టు తట్టుకోలేక నాగేశ్వరరావు ప్రాణాలు విడిచారని వారు భువనేశ్వరికి వివరించడంతో ఆమె కూడా కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చి.. రూ.3 లక్షల సాయాన్ని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి వెంట మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఉన్నారు.

అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి 8 లక్షల సాయం

గతేడాది చెరుకుపల్లిలో వైసీపీ కార్యకర్త చేతిలో సజీవ దహనమైన బాలుడు అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి కూడా భువనేశ్వరి ఆర్థిక సాయం చేశారు. 8 లక్షల రూపాయల చెక్కును బాలుడి అక్కకు అందించారు. ఏ కష్టం వచ్చినా పార్టీ వెంటే ఉంటుందని ధైర్యం చెప్పారు.

ఎన్ఆర్ఐ యశస్వికి ఊరట

- లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ బొద్దులూరి యశస్వికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై సీఐడీ అధికారులు జారీ చేసిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను హైకోర్టు రద్దు చేసింది. ఫిబ్రవరి 2న హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్) ముందు హాజరై వాట్సాప్ నెంబర్‌తోపాటు ఈ మెయిల్ వివరాలు అందజేయాలని, రూ.5లక్షల పూచీకత్తు సమర్పించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. అలాగే, దర్యాప్తునకు అందుబాటులో ఉంటానంటూ హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్), దర్యాప్తు అధికారి వద్ద వేర్వేరుగా అఫిడవిట్‌లు దాఖలు చేయాలని సూచించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి మంగళవారం ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలుచేసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే కారణంతో యశస్విపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయగా, దానిని రద్దు చేయాలని కోరుతూ యశస్వి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ..అమెరికా నుంచి వచ్చిన యశస్విని ఏపీ సీఐడీ పోలీసులు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేసి గుంటూరుకు తరలించారని, 41ఏ నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారని తెలిపారు. సీఐడీ అధికారులు జారీచేసిన లుక్ అవుట్ సర్క్యులర్ ఉద్దేశం నెరవేరిందన్నారు. పిటిషనర్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని, లుక్ అవుట్ సర్క్యులర్ కారణంగా తిరిగి అమెరికాకు వెళ్లలేకపోతున్నారని వివరించారు. పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తారని, ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదని, లుక్ అవుట్ నోటీసును రద్దు చేయాలని అభ్యర్థించారు. సీఐడీ తరఫున న్యాయవాది శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ.... పిటిషనర్‌పై మొత్తం మూడు కేసులు నమోదయ్యాయని, ఇప్పటికే రెండు కేసుల్లో సీఆర్పీసీ 41(ఏ) కింద నోటీసులు ఇచ్చి విడుదల చేశారని, ఆ తరువాత కూడా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. యశస్వి అమెరికాకు వెళ్తే దర్యాప్తునకు అందుబాటులో ఉండరని, లుక్ అవుట్ నోటీసును రద్దు చేసేటట్లైతే షరతులు విధించాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సముచిత తీర్పు


గాజాలో ఇజ్రాయెల్ మానవహననానికి పాల్పడుతోందని దక్షిణాఫ్రికా వేసిన పిటిషన్‌మీద హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఇటీవల వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులు స్వాగతించదగినవి. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని చెప్పనందుకు, ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదని వ్యాఖ్యానించనందుకు ఎక్కువమందికి ఈ తీర్పు నచ్చనప్పటికీ, ఇజ్రాయెల్‌ను అది బాగానే తప్పుబట్టింది. అన్నీ కాకున్నా ఇజ్రాయెల్ చర్యలు అనేకం దక్షిణాఫ్రికా ఆరోపిస్తున్న జీనోసైడ్ కన్వెన్షన్ పరిధిలోకే వస్తాయని, గాజాకు మానవసాయం దక్కకుండా చేయడం, ఆస్పత్రులను ధ్వంసం చేయడం, జీనోసైడ్‌ను కీర్తించే వ్యాఖ్యలు చేయడం వంటివి కూడనివని న్యాయస్థానం ప్రకటించింది. హమాస్ తన నిర్బంధంలో ఉన్న బందీలను విడుదలచేయాలని కూడా అది తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తీర్పును కొన్ని ఇస్లామిక్ సంస్థలు తప్పుబట్టినప్పటికీ, హమాస్ స్వాగతించడం విశేషం.

సైనికచర్యను నిలిపివేయాలన్న మాట లేదుకదా అని ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలు దీర్ఘాలు తీస్తున్నాయి కానీ, ఆ మాట అనకుండానే ఈ తీర్పు ఇజ్రాయెల్ దూకుడును తప్పుబట్టింది. పాతికవేలమందిని చంపి, ఇళ్ళు, ఆస్పత్రులు కూల్చి, నీరు, ఆహారం, మందులు లేకుండా చేసి, బయటనుంచి వచ్చే మానవసాయాన్ని నిరోధించడం ద్వారా, ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదంటూ దక్షిణాఫ్రికా వాదించిన నేపథ్యంలో, ఇజ్రాయెల్ చర్యలు ఆ దిశగానే ఉన్నాయని న్యాయస్థానం ఇలా ప్రాథమికదశలో, మధ్యంతర ఉత్తర్వుల్లోనే వ్యాఖ్యానించడం దక్షిణాఫ్రికా విజయమే. ఇజ్రాయెల్ సత్వరమే తీసుకోవాల్సిన చర్యలను వివరించడం ద్వారా పదిహేనుమంది న్యాయమూర్తులు జీనోసైడ్‌ను అడ్డుకోవాల్సిన కర్తవ్యాన్ని తమవంతుగా నిర్వర్తించారు. ఆస్పత్రులు, రక్షితస్థలాలు, జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో సైతం ఇజ్రాయెల్ అమానుషంగా వ్యవహరిస్తున్న తరుణంలో, ఆ చర్యలను ఎత్తిచూపడం, కూడదని చెప్పడం అవసరం.

ఐసీజేలో ఒక్కముక్క తనకు వ్యతిరేకంగా వచ్చినా తనమీద మిగతా ప్రపంచం ఒత్తిడిపెరుగుతుందని ఇజ్రాయెల్‌కు తెలుసు. ఎన్నడూ ఐసీజే మెట్లు ఎక్కని ఆ దేశం ఈ కారణంగానే ఉద్దండులైన న్యాయవాదులను మోహరించి, దక్షిణాఫ్రికా వాదనలను పూర్వపక్షం చేసేందుకు శతథాప్రయత్నించింది. హమాస్ దుశ్చర్యలివిగో అంటూ చాలా వీడియోలను ప్రదర్శించింది. అయినప్పటికీ, గాజా పూర్తిగా నేలమట్టమై, 85శాతం మంది నిర్వాసితులై, గర్భిణీలకు వైద్యం అందని, పసికందులకు ఆక్సిజన్ దక్కని పరిస్థితుల సృష్టివెనుక ఇజ్రాయెల్ లక్ష్యం ఏమిటో ఐసీజేకు అర్థమయ్యే ఉంటుంది. మానవసాయానికి సంబంధించిన తన ఆదేశాల అమలుపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఇజ్రాయెల్‌పై ఐసీజే ఒత్తిడిపెంచింది కూడా ఇందుకే. తమ మిత్రదేశాన్ని ఐసీజే తప్పుబట్టినందుకు కాబోలు ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ ఒకదానికి వెంటనే అమెరికా, ఆ తరువాత చాలా పాశ్చాత్యదేశాలు ఆర్థికసాయాన్ని నిలిపివేశాయి. 'యుఎన్‌ఆర్‌డబ్ల్యూఏ'లో పనిచేస్తున్న స్థానిక సిబ్బంది హమాస్ దాడిలో పాలుపంచుకున్నారంటూ ఇజ్రాయెల్ అమెరికాకు సాక్ష్యాలు అందించడం, ఈ సంస్థకు ఆర్థికసాయం నిలిచిపోవడం విచిత్రమైన పరిణామం.

తక్షణ కాల్పుల విరమణ కోసం దక్షిణాఫ్రికా చేసిన ప్రయత్నం ఫలించకపోయినప్పటికీ, ఈ మధ్యంతర ఉత్తర్వులు ఇజ్రాయెల్ మిత్రదేశాల మీద నైతిక ఒత్తిడి తెచ్చేందుకు ఉపకరిస్తాయి. ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలమీద హౌతీలు దాడులు చేస్తున్నందుకు ప్రతిగా అమెరికా యెమెన్‌లో దాడులు చేస్తున్నది. అమెరికా దాడులు హౌతీలను నిలువరిస్తున్నాయా? అన్న ప్రశ్నకు లేదని సమాధానం చెప్పారు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్. మరి వాటిని కొనసాగిస్తారా? అన్న ప్రశ్నకు అవును అన్నారాయన. ఇరాన్ మద్దతున్న ఉగ్రవాదసంస్థలని అమెరికా అంటున్నవన్నీ ఎంతటి ప్రతిఘటన ఎదురైనా వెనక్కుతగ్గడం లేదు. ఆదివారం జోర్డన్–సిరియా సరిహద్దులో జరిగిన దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు మరణించినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని బైడెన్ శపథం చేశారు. గాజా యుద్ధం ఆరంభమైన తరువాత, దానితో ముడిపడిన ఒకదాడిలో తమ సైనికులు మరణించిన విషయాన్ని అమెరికా ధ్రువీకరించడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై గత నాలుగునెలల్లో వందలాది దాడులు జరిగాయి. ప్రతీకారం పేరిట అది తీసుకొనే చర్యలతో యుద్ధం విస్తరిస్తోంది. ఇజ్రాయెల్ ను నిలువరించి, మానవసాయానికి వీలుకల్పించి, అతివేగంగా కాల్పులవిరమణ అమలు జరగందే ఈ విషవలయాన్ని ఛేదించడం అసాధ్యం.

మోదీ జిత్తులతో విపక్షాలు చిత్తు...!



బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మూలంగా ఏర్పడిన భావోద్వేగాలపైనే మోదీ నమ్మకం పెట్టుకోలేదని, విపక్షాల ఎజెండా, ఐక్యతను దెబ్బగొట్టేందుకు ఆయన ఎంతో ముందుగా వ్యూహరచన చేసి పెట్టుకున్నారని గత కొద్ది రోజులుగా బిహార్‌లో సంభవిస్తున్న పరిణామాలను బట్టి ఎవరికైనా అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో బిహార్ నుంచి ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసినవారెవరైనా బిహార్‌ను మోదీ వదిలివేస్తారని ఎలా అనుకుంటారు? జెడి(యు), ఆర్‌జెడి, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే 2019 ఫలితాలు తారుమారవుతాయని భావించినందువల్లే మోదీ చక్రం తిప్పారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రజల శ్రేయస్సు, సిద్ధాంతాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార సాధనకే మెజారిటీ రాజకీయ పక్షాలు ప్రాధాన్యమిస్తున్నాయని బిహార్‌లో నితీశ్ కుమార్ మళ్లీ ఎన్డీఏ ఒడిలో చేరడంతో మరోసారి రుజువైంది. లేకపోతే డిసెంబర్‌లో పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ఇండియా' కూటమికి చెందిన దాదాపు 150 ఎంపీలతో పాటు తన పార్టీకి చెందిన ఎంపీలను కూడా మోదీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా బహిష్కరించిన విషయాన్ని నితీశ్ ఇంతలోనే ఎలా మరచిపోయారు? మర్యాదపురుషోత్తముడు, రామరాజ్య స్థాపకుడు, అధికారాన్ని తృణప్రాయంగా విసర్జించాడని, ప్రజల నిందలకు విలువ ఇచ్చేవాడని గుర్తింపు పొందిన శ్రీరాముడికి ప్రాణప్రతిష్ఠ చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం ఆలయం నుంచి బయటకు రాగానే సార్వత్రిక ఎన్నికల తర్వాత మూడోసారి ఎలా అధికారంలోకి రావాలా అన్న విషయంపైనే అధికంగా దృష్టి సారించడంలో ఆశ్చర్యం లేదు.

రాముడి ప్రాణప్రతిష్ఠ మూలంగా ఏర్పడిన భావోద్వేగాలు, తన పాలన, వ్యక్తిగత ఆకర్షణ పైనే మోదీ నమ్మకం పెట్టుకోలేదని, ప్రతిపక్షాల ఎజెండాను, ఐక్యతను దెబ్బగొట్టడంతో పాటు వాటిని కకావికలం చేయడం గురించి కూడా ఆయన ఎంతో ముందుగా వ్యూహరచన చేసి పెట్టుకున్నారని గత కొద్ది రోజులుగా సంభవిస్తున్న పరిణామాలను బట్టి ఎవరికైనా అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో బిహార్ నుంచి ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసినవారెవరైనా బిహార్‌ను మోదీ వదిలివేస్తారని ఎలా అనుకుంటారు? జెడి(యు), ఆర్‌జెడి, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కలిసి పోటీ చేస్తే 2019 ఫలితాలు తారుమారవుతాయని భావించినందువల్లే ఆయన చక్రం తిప్పారు.

అంతే కాదు, మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడం, రామమందిర భావోద్వేగాలు సృష్టించడంతోనే 'ఇండియా' కూటమి నేతల్లో భవిష్యత్ పట్ల అయోమయం ఏర్పడిందనడంలో సందేహం లేదు. ఈ సమయంలోనే మోదీ వెనువెంటనే పావులు కదిపి బిహార్ నేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం, నితీశ్‌ను ఎన్డీఏలో చేర్చుకోవడం వ్యూహాత్మకంగా జరిగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో విజయం తర్వాత మోదీ దూకుడుగా వ్యవహరించి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష ఎంపీలందర్నీ గెంటేసి కీలకమైన బిల్లులను ఇష్టారాజ్యంగా ఆమోదించుకున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జోడో యాత్ర బిహార్‌లో ప్రవేశిస్తున్న సమయంలో, పార్లమెంట్ చివరి సమావేశాలు జరుగుతున్న సమయంలో నితీశ్‌ను చేరదీసి ప్రతిపక్షాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. 'ఇండియా కూటమి నుంచి నితీశ్ వైదొలగడం రాత్రికిరాత్రి జరిగిన పరిణామం కాదు. చాలా ముందుగా పథకం ప్రకారం జరిగిన కుట్ర' అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇప్పుడు బాధపడితే లాభం ఏమిటి?

దేశ రాజకీయాల్లో బీజేపీ ధాటిని చూసి భయపడిన నితీశ్ మోదీ రక్షణలో చేరడమే మంచిదని భావించవచ్చు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండానే దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న నితీశ్ కుమార్‌కు రాజకీయాల్లో ఎలా మనుగడ సాగించాలో తెలుసు. ఎమ్మెల్సీగా ఉంటూనే సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ ప్రాప్తకాలజ్ఞత వల్లే తొమ్మిదోసారి ముఖ్యమంత్రి కాగలిగారు. ఈ రికార్డుతోనే ఆయన తన జీవిత చరమాంకం క్షేమంగా గడపాలని నిర్ణయించుకున్నారు. దేశంలో రాజకీయాల ప్రమాణాలు రోజురోజుకూ క్షీణిస్తున్న సమయంలో విలువల గురించి ఆలోచించడం వృథా అని ఆయన భావించి ఉంటారు. అదే సమయంలో బిహార్ రాజకీయాల్లో నితీశ్‌కు ఎంతో కొంత బలం లేకపోతే ప్రతి పార్టీ ఆయనతో చేతులు కలపాలని ఎందుకు అనుకుంటుంది అన్న విషయం కూడా ఆలోచించాలి. 2013, 2017, 2022లో మూడుసార్లు బీజేపీని వదుల్చుకున్నప్పుడు నితీశ్‌ను ఘోరంగా తిట్టిపోసిన ఆ పార్టీ నేతలు నాలుగోసారి 2024లో ఆయనను ఎందుకు అక్కున చేర్చుకున్నారు? ఇది బీజేపీ నైతికతకు సంబంధించిన విషయం కాదు, దాని రాజకీయ అవసరానికి సంబంధించిన విషయం. అదే సమయంలో ఆర్‌జెడి, కాంగ్రెస్‌లు కూడా నితీశ్ తమవైపు ఎన్నిసార్లు వచ్చినా అన్నిసార్లు ఆలింగనం చేసుకున్న విషయం మరిచిపోరాదు.

బీజేపీ వర్గాల ప్రకారం కోయి, కుర్మీ, ధనుక్ వంటి యాదవేతర ఓట్లలో అత్యధికులు నితీశ్ వైపు ఉన్నారు. 14 శాతం యాదవులను మినహాయిస్తే, మిగిలిన 13 శాతం ఎన్డీఏ వైపు మళ్లించేందుకు బీజేపీ కృషి చేస్తోంది. నితీశ్ చొరవతోనే తొలుత ఇండియా కూటమికి కదలిక ఏర్పడింది. సీ ఓటర్ సర్వే ప్రకారం ఈసారి 40 లోక్‌సభ సీట్లలో సగానికిపైగా మహా కూటమికి లభిస్తాయని తేలింది. ఒకవైపు ప్రతిపక్షాల అవకాశాలను దెబ్బతీస్తూనే బిహార్‌లో బలోపేతం అయ్యేందుకు నితీశ్‌తో బీజేపీ చేతులు కలిపింది. ఇప్పటికే చిరాగ్ పాశ్వాన్, జితన్‌రాం మాంఝీ బీజేపీతో ఉన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కు వ్యతిరేకంగా నితీశ్ కుమార్ రంగంలోకి దిగినప్పుడు లవకుశ రాజకీయాలను ఉపయోగించుకుని కుశావహ నేత శకుని చౌదరిని తన వెంట ఉంచుకున్నారని బిహార్‌కు చెందిన ఒక సీనియర్ జర్నలిస్టు తెలిపారు. ఇప్పుడు శకుని చౌదరి కుమారుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాట్ చౌదరిని ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. అంటే అతి వెనుకబడిన వర్గాలు, దళితులు, మహాదళితులను తన వైపు తిప్పుకునేందుకు మోదీ ఒక పథకం ప్రకారం వ్యవహరించారు. అదే సమయంలో అగ్రవర్ణాలకు చెందిన విజయసిన్హాను రెండో డిప్యూటీ ముఖ్యమంత్రిగా నియమించి వారికి కూడా బీజేపీ తగిన సంకేతాలను పంపింది.

బిహార్‌లో జరుగుతున్నది దేశ రాజకీయాలకు అద్దం పడుతోంది. దేశంలో మెజారిటీ పార్టీలకు నైతికత కానీ, సైద్ధాంతికత కానీ, లేవు. జనతాదళ్ (ఎస్) నేత దేవెగౌడ కూడా నితీశ్‌కు తక్కువేం కాదు. పలుసార్లు ఈ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బిఎస్‌పి చేతులు కలపని పార్టీ అంటూ లేదు. డీఎంకే, అన్నాడీఎంకే కూడా పొత్తులు మారుస్తూ వచ్చాయి. కనుక బిహార్‌లో జరుగుతున్నది ప్రత్యేకమైన విషయం ఎంత మాత్రమూ కాదు. అయినప్పటికీ ప్రతిపక్షాలు కాడిని పడేయాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇక ప్రజాస్వామ్యాన్ని మరిచిపోవాల్సిందే అని మల్లికార్జున ఖర్గే అనడం ఆయనలోని భయాన్ని సూచిస్తోంది. కాని జరుగుతున్న పరిణామాలు మోదీలో భయాన్నే ఎక్కువగా సూచిస్తున్నాయి. ఇండియా కూటమి జనతా ప్రయోగం మాదిరి సంఘటితం అవుతుందని భయపడినందువల్లే ప్రతిపక్షాలను కుప్పకూల్చేందుకు ఆయన విజృంభిస్తున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి 37.3 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ప్రతిపక్షాల ఓట్లు చీలిపోవడం ద్వారానే ఆయన విజయం సాధించగలిగారు. 2024 ఎన్నికల్లో మోదీ బీజేపీ 50 శాతం పైగా సాధించాలని పార్టీ నేతలను ఉత్సాహపరుస్తున్నప్పటికీ 63 శాతం బీజేపీ యేతర ఓట్లను చీల్చనిదే అది సాధ్యం కాదని ఆయనకు తెలియనిది కాదు. ఆ దిశగా ఆయన ఎత్తుగడలు సాగుతున్నాయి.

భారతదేశ రాజకీయాలను పూర్తిగా నియంత్రించేందుకు రానున్న రోజుల్లో మోదీ ఇంకా ఎన్ని ఆయుధాలను ప్రయోగిస్తారో ఊహించలేము. అవి ప్రజాస్వామికమా, అప్రజాస్వామికమా అన్న ప్రశ్నలను బీజేపీ పట్టించుకోదని చండీగఢ్‌లో జరిగిన మేయర్ ఎన్నిక తీరు, లోక్‌సభ ఎన్నికల సమయంలో బిహార్, జార్ఖండ్‌లో ఈడీ సెంహారం స్పష్టం చేస్తున్నాయి. బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్‌ను మనీలాండరింగ్ కేసులో పదిగంటలకు పైగా విచారణ జరపడం ఇప్పటికే దెబ్బతిన్న మహా కూటమిని మరింత బలహీనపరిచే చర్యల్లో భాగమే. జెఎంఎం కనుక ఎన్డీఏలో ఉండి ఉంటే ఇప్పుడు ఈడీ ధాటికి తట్టుకోలేక ముఖ్యమంత్రి హేమంత సోరెన్ ఎక్కడో తలదాచుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. చండీగఢ్‌లో మేయర్ పదవి పొందడం కోసం ప్రతిపక్షాలకు చెందిన 8 ఓట్లు చెల్లవని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజని, ఒక్క మేయర్ పదవికోసమే బీజేపీ ఇంత దిగజారితే ఇక లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు ఎంతకైనా దిగజారవచ్చని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించాయి.

అయితే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు మోదీ సర్వశక్తులు ఒడ్డుతారని ఎవరికైనా తెలియకపోతే అది అమాయకత్వమే అవుతుంది. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే తమ మనుగడ ఏమవుతుందో అని కొన్ని రాజకీయ పార్టీలు భయపడడం, మరి కొన్ని రాజకీయ పార్టీలు ఈ భయంతోనే మోదీ అండదండలకు ప్రయత్నించడం సహజమే. నిజంగానే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అసలు ప్రతిపక్షమే ఉండకపోవచ్చు. కాని ఈ భయం ప్రజల్లో ఏర్పడిందా? ఆ భయం చైతన్యంగా మారుతోందా? అలా మార్చే ప్రయత్నాల్లో ఈ పార్టీలు ఎంతవరకు కార్యసాధకం కాగలుతున్నాయి? మోదీలోని ఏ లక్షణాలు ప్రజల్లో ఆయన పట్ల సానుకూలత ఏర్పరుస్తున్నాయి? దక్షిణాదిన తెలంగాణ, కర్ణాటకలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధించలేకపోతోంది? జాతీయ స్థాయిలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పర్చుకోవడం మాత్రమే కాదు, ఈ ప్రత్యామ్నాయాన్ని నీరుకార్చేందుకు చేసే ప్రయత్నాలను వమ్ము చేసే నాయకత్వం కూడా దేశానికి అవసరం. ఈ లోటు స్పష్టంగా కనపడుతోంది.

కొల్లేరు పరిరక్షణకోసం అరుణోదయ పాట!

మా చిన్నతనంలో కొల్లేరును ఒక పాఠ్యాంశంగా మాత్రమే చదువుకుని ఉన్న నాకు గత కొంతకాలంగా కొల్లేరును కబ్జాల సంబంధిత వార్తలుగా చూడాల్సివస్తోంది. స్థానిక మత్స్యకార్ల ప్రజా నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి ఆహ్వానం మేరకు అరుణోదయ బృందంతో కలిసి కొల్లేరు పర్యటించిన నాకు ఉత్తరాసియా, తూర్పు యూరప్ దేశాల నుండి సుమారు లక్షల సంఖ్యలో వచ్చే 150 రకాలు పక్షులు రోజురోజుకు తగ్గిపోతుండడం, అనాదిగా చేపల వృత్తిపైన ఆధారపడుతున్న మత్స్యకారులు (వడ్డీలు) వలసబాట పడుతుండడం మనసును కలచివేసింది. 673 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి 122 గ్రామాలకు అందులో (94 లంక గ్రామాలు), లక్షలాది ప్రజలకు జీవనాధారంగా ఉన్న కొల్లేరులో ఏ రవాణా సౌకర్యాలు లేని కాలంలో కూడా తాటి దోనెలపై తిరుగాడుతూ వలసలు లేకుండా బతికిన మనుషులున్నారు. నూటికి 90 శాతం ఈ ప్రాంతంలో విస్తరించిన సంప్రదాయ మత్స్యకారులైన వడ్డీల వారు అన్ని కులాల వారిని మత్స్యకారులుగానే అక్కున చేర్చుకున్నారు. కానీ అట్లా పక్షులకు, కొల్లేరు కుటుంబాలకు జీవనాధారమైన చేపలు జల కాలుష్యంతో తగ్గుముఖం పడుతుండడం, మంచినీటి సరస్సు మధ్యలో జీవిస్తున్న ప్రజలే మంచినీటికి కటకటలాడుతుండడం ఆశ్చర్యం గొలిపే వైపరీత్యం. కాంటూరులో మార్పులతో వైశాల్యం తగ్గినా సమస్యలు మాత్రం తగ్గడం లేదు.



ప్రభుత్వాల అసంబద్ధ విధానాల పైనా, కొల్లేరు ఆక్రమణదారులపైనా జరిగే స్థానిక ప్రజల పోరాటమే కొల్లేటి పక్షులను, మనుషులను, అనాదిగా వస్తున్న ప్రజల జీవనాధారాన్ని కాపాడగలదని భావిస్తూ మా అరుణోదయ బృందం స్థానికులతో కలిసి కొల్లేటి పాట రూపొందించింది.

1999 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కొల్లేరులోని 1,66,000 ఎకరాలను 1972 అభయారణ్యం చట్టం కింద పక్షుల అభయారణ్య ప్రాంతంగా ప్రకటించింది. దాని మూలంగా స్వేచ్ఛాయుతమైన కొల్లేరు ప్రజల జీవితం ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం నియంత్రణలోకి వచ్చినట్లయింది. ప్రైవేటు ఆక్రమణలను అరికట్టే పేరిట రాష్ట్ర ప్రభుత్వం 2006లో ఆపరేషన్ కొల్లేరు అమలు జరిపింది. ఇది కొల్లేరు జిరాయితీ భూములు, సొసైటీ చెరువులను సైతం కూల్చడంతో ప్రజల జీవితాల్లో అల్లకల్లోలం కలిగించింది. ఆ వెన్వెంటనే 2007లో దీనిని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించారు. దాదాపు 100 గ్రామాల ప్రజల భవిష్యత్తును అగమ్యగోచరం చేసే ఈ చర్యను అంతా ఖండించారు. ఇంత చేసినా కొల్లేరులోని సహజ సిద్ధమైన వృక్ష–జంతు జాలాన్ని రక్షించింది లేదు, మంచినీటికి పూర్వ కళ వచ్చింది లేదు. ఒకవైపు తీరం పొడవునా కోస్తా కారిడార్ పేరిట కాలుష్య కారక ఫార్మా కంపెనీలకు, గోప్యంగా అణు రియాక్టర్లకు అనుమతులతో లక్షలాది తీర ప్రాంత ప్రజల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారు. ఇలాంటి ఏలికలే కొల్లేరును పర్యావరణ సురక్షిత ప్రాంతంగా చేస్తామని ఎందుకు హడావిడి చేస్తున్నారు? కొల్లేరు భవిష్యత్తును నిర్ణయించుకునే కొల్లేరు డెవలప్‌మెంట్ బోర్డును ఎందుకు మూలకు పడేసినట్టు? 2014 పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ భీమవరం సభలో హామీ ఇచ్చినట్లు కొల్లేరును మూడవ కాంటూరు (+3 contour) లోనికి మారుస్తానన్న హామీ ఎందుకు అమలు జరగనట్లు? ఇవన్నీ ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. కొల్లేటి మంచినీటి సరస్సును వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్షులు సైతం అక్టోబర్ నుంచి మార్చి వరకు తమకు ఆవాస కేంద్రంగా ఎలా గుర్తించాయో, అలాగే టూరిజం పేరిట కొల్లేరును తనఖా వస్తువుగా గుర్తించి అంతర్జాతీయ మార్కెట్లో వేలకోట్ల రూపాయలను పాలకులు అప్పులుగా పొందుతున్నారు. కానీ టూరిజం కోసం కొల్లేరులో కట్టిన టూరిస్ట్ బంగ్లా పవన్ కళ్యాణ్, మా అరుణోదయ బృందాలు పర్యటించినప్పుడు పాడుబడ్డ పశువుల కొట్టంలా ఉన్నది. ఇటీవలనే దానికి రంగులు వేసి బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చారు. కానీ 7500 ఎకరాల భూమి కొల్లేరు ప్రజలకే అందించాలన్న హామీ మాత్రం నేటికి అమలు కాలేదు.

చిరంజీవి, జయప్రకాశ్ నారాయణ, జేడీ లక్ష్మీనారాయణ, పవన్ కళ్యాణ్ తదితరులెంతో మంది కొల్లేరు ప్రజల సమస్యలెన్నో లేవనెత్తారు. ఈ ప్రాంత సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ తదితరులు అధికారులకు, మంత్రులకు "కొల్లేటి జనశక్తి" పేరున అనేక విజ్ఞప్తులు చేయడమే కాకుండా కొల్లేటిపై మమకారంతో లెక్కకు మించి సాహిత్యం వెలువరించారు. ప్రపంచ చిత్తడి నేలలపై (wet lands) పనిచేస్తున్న రామ్‌సర్ కన్వెన్షన్ 2002 ఆగస్టులో కొల్లేటి పక్షులకు–వడ్డీల వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తించింది. వడ్డీల వారి సంప్రదాయ చేపల వేటను, సంస్కృతిని ఆమోదించింది. 2,22,000 ఎకరాల్లో జరిగే చేపల వేటను ఆమోదించింది. ఈ అంశం కొల్లేరు అంటే పక్షులు–మనుషులు అన్నదానికి బలం చేకూర్చింది. ఇప్పుడే కాదు, రామాయణ గాథల్లోనూ కొల్లేరు ప్రస్తావన ఉన్నదని చిలుకూరు వీరభద్రరావు ఆంధ్రుల చరిత్ర ప్రథమ భాగంలో పేర్కొన్నారు. దండి కవి రాసిన దశకుమార చరిత్రలోనూ, చైనా బౌద్ధ యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ పర్యటనలోను, కొల్లేటిలో దొరికిన 15వ శతాబ్దపు రాగి రేకుల్లోనూ, పెద్దింట్లమ్మ జాతరలోనూ, కొల్లేటి మానవ నివాసం గురించి చరిత్ర ఉంది.

అందుకే, ప్రభుత్వాల అసంబద్ధ విధానాల పైనా, కొల్లేరు ఆక్రమణదారులపైనా జరిగే స్థానిక ప్రజల పోరాటమే కొల్లేటి పక్షులను, మనుషులను, అనాదిగా వస్తున్న ప్రజల జీవనాధారాన్ని కాపాడగలదని భావిస్తూ మా అరుణోదయ బృందం స్థానికులతో కలిసి కొల్లేటి పాట రూపొందించింది. నేడు ఏలూరులోని YHMA హాలులో ఉ. 10 గం.లకు ఆవిష్కరణ సభ. కొల్లేటి పరిరక్షణ ఉద్యమ దిశగా కొల్లేటి వాసులతో కలిసి అరుణోదయ అదే పాటను బతుకు పోరాటంగా మలుచుకునే ఆచరణాత్మక సభ ఇది. కొల్లేరు డిక్లరేషన్‌తో ఆవిష్కరణ సభ పార్టీలకతీతంగా జరుగుతుంది.

■ అరుణోదయ విమలక్క

(నేడు ఏలూరులో కొల్లేరు పరిరక్షణ పాట ఆవిష్కరణ)

గోడ పత్రిక

తొంబై యేళ్ల గోడ
అదే ఒంటరి గోడ
అదే ఏకాకి ముఖం
మాటలు రాకున్నా
కొత్త కొత్త వాక్యాలని మోస్తూ
నినాదాలు నినాదాలుగా విస్తరిస్తూ...
ఎన్ని పిడికిళ్ళో
ఎన్ని వేల జిందాబాద్‌లో
ఆ గోడ ముందునించి వెళ్తుంటే
తొంబైయేళ్ల ఉద్యమాలు గుప్పుమంటాయి
గుండెల్లోని అగ్నికీలల్ని
శరీరం నిండా అంటించుకుంటూ
ఎన్ని రాత్రింబవళ్ళు
నిప్పుల కొలిమై మండిందో
ఒక ఉద్యమం కోసం
చైతన్యవాహికై ప్రవహిస్తూ
ఎన్ని లాఠీ దెబ్బలకి
నోరులేని మూగ సాక్షిగా నిలబడిందో
గోడంటే రాళ్లు ఇటుకలు కాదు కదా
గోడ ఒక సందేశ పత్రిక
గోడ ఒక విస్తృత చర్చా పత్రం
ఒక అభిప్రాయ వేదిక
ఎన్ని అమర్ రహేలు
ఎన్ని నిరసన కేకలు
ఎన్ని వోపన్ హార్ట్ మెసేజ్‌లు
ఎన్ని కళ్ళు పడ్డాయో యీ గోడ ప్రవక్త పైన
ఈ గోడ ముందు నించునే
ఉపన్యాస వరదలైన వాళ్ళు
నాయకులై ఏసీ శ్వాసలు పీల్చిన దాఖలాలు
నడుస్తున్న చరిత్రలో నిత్యసత్యాలు
ఈ గోడ ఒక ప్రేరణ
కార్మికుల ఉత్తేజం
దళితుల ఊపిరి
శ్రామికుల్ని పురిగొల్పింది
చౌరస్తాకే అయస్కాంతమైన గోడ
నాలుగు దిక్కుల్ని ఆకర్షించుకొనే
ఒక చరిత్ర పేజీ.. ఈ గోడ పత్రిక!

– ఈతకోట సుబ్బారావు

(నెల్లూరు గోడ పత్రికకు 90ఏళ్ళు)

వలంటీర్లకు వేతనంగా ప్రజాధనం!

వలంటీర్లు మా కార్యకర్తలే అని గతంలో వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, విజయసాయి రెడ్డిలతో పాటు ఎందరో నేతలు బహిరంగంగా అన్నారు. ఇప్పుడు సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నం జిల్లా సంగివలస బహిరంగ సభలో ఇటీవల వలంటీర్లు మా కార్యకర్తలే అని అంగీకరించారు. ప్రభుత్వ ఖజానా నుంచి ప్రజల సొమ్మును పార్టీ కార్యకర్తలైన వలంటీర్లకు ఏటా 1500 కోట్ల రూపాయలు వేతనంగా ఇచ్చి, పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు. ప్రజలకు సేవ చేయడానికి వలంటీర్లను నియమిస్తే 50 శాతానికి పైగా వారు స్వగ్రామాలలో లేరు. చదువుల నిమిత్తం పట్టణాలకు వెళ్లిపోయారు. ఏ సమస్య చెప్పుకుందామన్నా అందుబాటులో ఉండరు. ఏదో మొక్కుబడిగా ప్రతి నెల ఒకటో తారీఖున ఇచ్చే పింఛన్ల పంపిణీకి కనబడతారు. లేదా పార్టీ మీటింగులకు జనాన్ని కూడగట్టేందుకు దర్శనమిస్తారు. జగనన్న ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణ బిల్లులు, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, విద్యాదీవెన అన్నీ తమ పార్టీ వారికే ఇస్తారు. అర్హులైనవారు నిలదీస్తే పార్టీ పెద్దల అండదండలు చూసుకుని 'ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అని రెచ్చిపోతారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. ఇంటింటికీ వచ్చి పథకాల ప్రయోజనాల్ని అందించాల్సిన వలంటీర్లు... వృద్ధుల్ని, వికలాంగుల్ని కూడా తమ ఇళ్ల వద్దకే రప్పించుకుంటున్నారు. ఉత్తమ వలంటీర్ అవార్డుల పేరుతో ప్రభుత్వం ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తోంది.

– తూలుగు రమణారావు, శ్రీకాకుళం

గద్దర్‌కు ఏది నిజమైన నివాళి?

ఒక సందర్భంలో రాయలసీమ సీనియర్ రచయిత బండి నారాయణస్వామి కథలు రాయడం ఎలా? అనే క్లాస్ చెబుతూ... కథ రాయాలంటే ముందు గద్దర్ పాట వినండి, అందులో జీవితం ఎలా వర్ణించబడిందో చూడండి. ఆ ముగింపుల్లో ప్రజలను ఎట్లా ఆలోచింపజేశాడో గుర్తించండి అన్నారు. కథలు రాసే రచయితలకు మోడల్‌గా గద్దర్ పాటను చూపడం అంటే ఆ పాట ఎంతగా ప్రజల జీవితానికి అద్దం పట్టిందో అర్థం చేసుకోవచ్చు.



ప్రస్తుతం గద్దర్ లేని సమాజాన్ని చూస్తున్నాం. ఆయన పాడిన పాటల సవ్వడి తప్ప, ఆయన అలికిడి కానరాని సమయం ఇది. ముఖ్యంగా మా తరం ఆయనను చూడగలిగింది. ఆయనతో కలిసి నడవగలిగింది. ఈ అవకాశం రేపటి తరాలకు కలుగబోదు. తెలంగాణ ఉద్యమంలో 'శాంతియాత్ర' పేరుతో ఊరూరా పాదయాత్ర చేసిన గద్దర్ పాదముద్రలు ఇంకా చెరిగిపోలేదు. జననాట్యమండలి నుండి ధూంధాం వేదికల దాకా అంతెత్తున ఎగిరి దునికిన ఆ పాటల మత్తడి ఆగిపోయింది. ఆయన లేడనే నిజం ఇంకా జీర్ణించుకోలేకుండానే ఉంది. అకస్మాత్తుగా ఆయన లేడనే విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా గుండె బరువెక్కుతోంది. కనురెప్పల మీద కన్నీటి పొర ఒకటి కమ్ముకుంటున్నది.

అది 2022. డిసెంబర్ నెల. 'పోటెత్తిన పాట' పుస్తక ఆవిష్కరణ సభ. గద్దరన్న చేసిన భావోద్వేగ ప్రసంగం ఇంకా కళ్లముందే మెదులుతూనే ఉంది. "తెలంగాణలో సాంస్కృతిక విప్లవం రావాలి. కవులు, కళాకారులు ప్రశ్నించేవైపు నిలబడాలి" అని ఒక పిలుపు ఇచ్చాడు. ఈ పిలుపు ఇచ్చే సమయానికి ఆయన వయసు ఏడు పదులు దాటింది. అంత వయసు వచ్చినా ఆయనలో అలసట, అలుపు లేదు. మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలన్నంత చైతన్యం సిద్ధంగా ఉంది. సమాజ విముక్తి తప్ప, వ్యక్తిగత ఆశలు లేవు. బహుశా గద్దర్‌లో ఉండే ఈ పోరాటతత్వమే ఆయనను నిత్యచైతన్యశీలిగా మార్చింది. ఏ ప్రజాసమస్య వచ్చినా దాని మీద పాటలు అల్లిపాడడం, ప్రజలను ఆలోచింపజేయడం, దాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లడానికి గల్లీ నుండి ఢిల్లీ దాకైనా ఫైట్ చేయడం ఆయన నిత్య కార్యాచరణగా మారింది. అందుకే గద్దర్ అన్ని సమూహాలకు ఇష్టుడిగా మారాడు.

ఇక ఆయన పాటలు ప్రజల మీద వేసిన ప్రభావాన్ని అంచనా వేయడానికి పలువురు పలురకాల ప్రయత్నాలు చేశారు. వర్గదృక్పథంతో చూసిన వాళ్లు కొందరు, ప్రాంతీయ స్పృహతో లెక్కగట్టినవారు ఇంకొందరు. ఇక అంబేడ్కరైట్ సిద్ధాంత భూమికతో బహుజన విముక్తి కోణంలో గద్దర్ చేసిన కృషిని వీక్షించినవారు మరికొందరు. ఇందరు ఇన్ని రకాలుగా చూసినా ఇంకా కొన్ని కోణాలు గద్దర్ పాటల్లో మిగిలే ఉంటాయి. అందుకే అది గద్దర్ పాట. ముఖ్యంగా ప్రజల భాషలో పాటలు అల్లి, ప్రజాసాహిత్యానికి మరింత గౌరవాన్ని తెచ్చిన కలం గద్దర్. లోతైన విషయాలను కూడా సులభతరంగా అర్థం చేయించగలిగిన శిల్పం గద్దర్ పాటల్లో ఉంది. అందుకే అవి జనం నోళ్లల్లో ఇంకా సజీవంగా ఉన్నాయి. ఈ రకమైన ఒరవడే తరువాత వచ్చిన ఉద్యమపాటలకు ఒక దారిని వేయగలిగింది.

ఒక సందర్భంలో రాయలసీమ సీనియర్ రచయిత బండి నారాయణస్వామి కథలు రాయడం ఎలా? అనే క్లాస్ చెబుతూ... కథ రాయాలంటే ముందు గద్దర్ పాట వినండి. అందులో జీవితం ఎలా వర్ణించబడిందో చూడండి. ఆ ముగింపులో ప్రజలను ఎట్లా ఆలోచింపజేశాడో గుర్తించండి అన్నారు. కథలు రాసే రచయితలకు మోడల్‌గా గద్దర్ పాటను చూపడం అంటే ఆ పాట ఎంతగా ప్రజల జీవితానికి అద్దం పట్టిందో అర్థం చేసుకోవచ్చు. అట్లా ప్రజల జీవితానికి అంత దగ్గరగా పాటలు అల్లడం జననాట్యమండలి కాలాన కొనసాగిన ఒక ట్రెండ్ అనే చెప్పాలి.

గ్రామీణ భారతంలోని సమాజ స్థితిగతులను, ప్రజాసంస్కృతిని, ప్రజా సంబంధాలను లోతుగా అర్థం చేసుకున్న దృష్టికోణం గద్దర్ పాటకుంది. అందుకే అది చూపున్న పాటైంది. విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల మీద తల్లిదండ్రుల అంతరంగ కోణం నుండి రాసిన 'వందనాలు వందనాలమ్మో' పాట అట్లా ఇంకెవ్వరూ రాయలేనంత గొప్పగా గద్దర్ సృజించగలిగాడు. అందులో ప్రజలకు, పనికి, ప్రకృతికి, పరిసరాలకు, పశుపక్ష్యాదులకు, కుటుంబ సంబంధాలకు ఉండే ఆత్మీయతలను, అనురాగాలను గొప్పగా పాటలోకి ఒంపినతీరు ఎవ్వరినైనా కట్టిపడేస్తుంది. గద్దర్ పాటలను గురించి ఎవ్వరికి నచ్చినవి వారు ఉదహరించవచ్చుగాని, గద్దర్ పాటల్లోని లోతును అర్థం చేసుకోవడానికి ఇలాంటి పాట ఒక్కటి చాలు. కడుపు కాలిన తల్లుల దుఃఖం, నేలరాలిన బిడ్డల త్యాగం ఏక కాలం కండ్లముందుకొచ్చి తచ్చాడుతుంది. ఇలాంటి పాటలను అవలీలగా అల్లగలిగాడు గద్దర్. అందుకు కారణం ప్రజల పట్ల, ప్రజాజీవితం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండడమే. ముఖ్యంగా మన సమాజంలో ఏ వర్గపు ప్రజలు ఎలా నడుచుకుంటారో గద్దర్‌కు బాగా తెలుసు. అట్లాగే అట్టడుగున ఉండే ప్రజల జీవిత తాత్వికతను అర్థం చేసుకున్న ప్రజావాగ్గేయ సూఫీ గురువు గద్దర్.

గద్దర్ జీవితాన్ని రెండు భాగాలుగా అర్థం చేసుకోవచ్చు. బుల్లెట్ ద్వారానే ఈ దేశం విముక్తం అవుతుందని నమ్మిన దశ ఒకటైతే, బ్యాలెట్ ద్వారా, రాజ్యాంగ రక్షణ ద్వారా మాత్రమే ఈ పేదబీద జనాలకు స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయని భావించిన దశ రెండవది. బుల్లెట్, బ్యాలెట్ మార్గాలను ఎన్నుకునే సమయాల్లో ఎంతటి సంఘర్షణకు గురయ్యాడో ఇప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. గుంపులో గోవిందలాగే ఎవరో ప్రేరేపిస్తే, ఏమీ తెలియకుండా ఒక బాట వెంట నడుచుకుంటూ పోవడం ఎవరైనా చేయగలరు. కానీ, తనను నమ్ముకొని లక్షలాదిమంది ప్రజలు ఉన్నప్పుడు తను తీసుకునే ఒక స్టెప్ ఎందరినో ప్రభావితం చేస్తుంది. అనేక ప్రశ్నలు, సందేహాలను రేపుతుందని అనుకున్నప్పుడు, గద్దర్ తన స్థానం నుండి ఆలోచించినప్పుడు ఎంత సంఘర్షణను అనుభవించి ఉంటాడో ఊహించలేం. ఎన్నో సందిగ్ధతలు చుట్టుముట్టి ఉంటాయి. దగ్గరి స్నేహితులతో ఎన్నో చర్చలు చేయాల్సి వచ్చి ఉంటుంది. ఇంతకాలం నడిచిన దారిని కాదని సామాజిక అవసరాలు ముందుకు తెచ్చిన మార్గాలను అనుసరించాలనుకున్నప్పుడు గద్దర్ సాహసం చేశాడనే చెప్పొచ్చు.

సాధారణంగా ఏ ఐడియాలజీతో పరిచయం లేని దళితులు అంబేడ్కరీయ ఉద్యమంలోకి వెళ్లడం చాలా సహజం. మరి అదే నాలుగైదు దశాబ్దాలు విప్లవోద్యమంలో జీవించి, అనేక నిర్బంధాలను ఎదుర్కొని, చావో రేవో ఈ జెండాకిందే అని బతికిన ఒక వారియర్, తను ఆ మార్గాన్ని కాదనుకోవడానికి ఎంతో ధైర్యం కావాలి. ముఖ్యంగా కొత్తగా ఎత్తుకోబోతున్న మార్గం మీద అచంచల విశ్వాసం ఉండాలి. అట్లా గద్దర్‌కు ఓటు రాజకీయాల మీద, బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పిన రాజ్యాధికార 'మాస్టర్ కీ' మీద గురి కుదిరింది కాబట్టే ఆయనలో ఒక మార్పు మొదలైంది. అది ఆయన వేషంలోను వ్యక్తమైంది. సూటు, బూటు వేసిన తీరుగానే, పాటలో కూడా వస్తుమార్పును తెచ్చింది. 'బానిసలారా లెండిరా, ఈ బాంచెన్ బతుకులు వద్దురా...' అని పాడేలా చేసింది.

ఇవాళ గద్దర్ లేకపోవచ్చుగాని, అతని పాటలు నిరంతరం జనం గుండెల్లో సజీవంగానే ఉంటాయి. మరి పాటకోసం జీవితాన్ని ధారపోసిన గద్దర్‌ను గత పాలకులు దారుణంగా అవమానించారు. కొత్త పాలకులైనా తెలంగాణ పాటకు పట్టంకట్టాలి. పట్టం కట్టడమంటే ఒకరిద్దరికి ఎమ్మెల్సీలు ఇచ్చి, లేదా ఒక ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. తెలంగాణ వ్యాప్తంగా 70 వేల మంది జానపద కళాకారులున్నారు. అలాగే ఐదువేల మంది ఉద్యమ కళాకారులున్నారు. వీరందరిని ప్రభుత్వం పట్టించుకోవాలి. వారిని ఆదుకునే పేరుతో ఆంక్షలు పెట్టొద్దు. ఇప్పటికే సారథి కళాకారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రెండు మూడు నెలలకోసారి వస్తున్న జీతాలతో అతలాకుతలం అవుతున్నారు. మరి వారికి ఒక భరోసాను ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్ ముందు ఉంది. ఉద్యమంలో క్రియాశీలమైన పాత్రపోషించిన పాటలను రేపటి తరాల కోసం పదిలం చేయాలి. అందుకోసం ఒక 'ప్రజా సాంస్కృతిక విధానం' (కల్చరల్ పాలసీ) కావాలి. తెలంగాణ భాషా సంస్కృతులకు కొత్త జవజీవాలను అద్దాలి. అందులో భాగంగా ప్రజా కవులు, కళాకారులకు సముచిత గౌరవం కలిగించాలి. ముఖ్యంగా ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరు మీద ఒక కల్చరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. ఆయన అముద్రిత పాటల్ని పుస్తకాలుగా ముద్రించే బాధ్యతను స్వీకరించాలి. ఆయన పుట్టిన మెదక్ జిల్లాకు గద్దర్ పేరును పెట్టాలి. ఇవేవి చేయకుండా కేవలం ఆయన జయంతులు, వర్ధంతులు నిర్వహించి హడావుడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అలాగే ఆ మహాకళాకారుని స్ఫూర్తితో నేటి కళాకారులు ప్రజాచైతన్యమే పరమావధిగా బహుజనుల విముక్తికి పునరంకితం కావాలి.

● డా. పసునూరి రవీందర్

(నేడు గద్దర్ జయంతి. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో పదిహేను అడుగుల గద్దర్ విగ్రహ ఆవిష్కరణ)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

బుధవారం 31 జనవరి 2024

వదిన గొంతు కోసి హత్య

తనూ పీక కోసుకున్న మరిది



బంగారు దుర్గ (ఫైల్)



హత్యకు పాల్పడిన హరికృష్ణ (ఫైల్)

- కొన ఊపిరితో ఉన్న బాధితుడు
- వివాహేతర బంధంలో విభేదాలే కారణం

గుణదల, జనవరి 30 : వివాహేతర బంధం బెడిసికొట్టింది. ఒకరి ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. మరొకరు కొన ఊపిరితో కొట్టుకునే స్థితికి తీసుకెళ్లింది. చనిపోయింది వదిన అయితే చావు బతుకుల్లో ఉంది మరిది. ఇందుకు కారకుడూ మరిదే. ఈ దారుణం పటమట డొంకరోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటమట డొంక రోడ్డుకు చెందిన బంగారు దుర్గ (36) వివాహం చేసుకున్న తర్వాత భార్యభర్తల మధ్య మనస్పర్ధలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె ఏడేళ్ల నుంచి భర్తకు దూరంగా ఉంటుంది. దుర్గకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. కుమారుడు నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. రెండో కుమార్తె గన్నవరంలోని రీచ్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. దుర్గ పటమట రైతుబజార్ రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఈమె పటమట డొంక రోడ్డులోని పద్మజా నగర్లో నివాసం ఉంటుంది. గురునానక్ నగర్లో నివాసముంటున్న దుర్గ మరిది బంగారు హరికృష్ణ అలియాస్ హరి భార్యను వదిలేసి నాలుగేళ్ల నుంచి ఒంటరిగానే నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు. వారు ఇరువురూ గన్నవరం రీచ్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. హరికృష్ణ గురునానక్ నగర్‌లోని న్యాక్ కల్యాణ మండపంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు.

బంగారు దుర్గ... హరికృష్ణలకు గడచిన కొద్ది కాలం నుంచి వివాహేతర సంబంధం ఉన్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. వీరి మధ్య కూడా కొద్దిరోజుల నుంచి మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో దుర్గ మరిదిని దూరం పెట్టడం మొదలు పెట్టింది. దీన్ని జీర్ణించుకోలేక మరిది హరి మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పద్మజా నగర్లోని దుర్గ ఇంటికి వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటమాటా పెరిగింది. ఒక్కసారిగా హరి ఉద్రేకంతో చాకుతో దుర్గ పీకను బలంగా కోసేశాడు. ఆమె బిగ్గరగా కేకవేసింది. చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకున్నారు. తానూ చనువు చాలించాలని నిర్ణయించుకున్న హరి చాకుతో తన పీక కూడా కోసుకున్నాడు. సమాచారం అందుకున్న పటమట సీఐ మోహన్ రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న హరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. ఘటనా స్థలంలో విగతజీవిగా పడి ఉన్న దుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. హత్యకు కారకుడైన హరి మృత్యువుతో పోరాడుతున్నాడు. వివాహేతర సంబంధమే ఘటనకు ప్రధాన కారణంగా భావిస్తూ ఇరుపక్షాల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ తెలిపారు.


నేటినుంచి గుణదల మేరీమాత నవదిన ప్రార్థనలు

- శత వసంతాల మహోత్సవాలు

పురుగు మందు తాగి కౌలు రైతు బలవన్మరణం

- 6లో..

బాలశౌరి వెంట భారీగా..



మెజార్టీ వైసీపీ కార్పొరేటర్లు ఎంపీతో నడిచేందుకు సిద్ధం

- గుట్టుచప్పుడు కాకుండా మంతనాలు
- వర్గాన్ని కూడగడుతున్న బాలశౌరి
- చిరంజీవిని కలిసిన ఎంపీ, ఆయన కుమారుడు అనుదీప్

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వైసీపీకి ఇటీవల రాజీనామా చేశారు. ఫిబ్రవరి 4వ తేదీ 4.30 గంటలకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో బాలశౌరి చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ నేపథ్యంలో మచిలీపట్నం నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు సగం మందికిపైగా ఎంపీ బాలశౌరి వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు వైఖరితో నాలుగున్నర సంవత్సరాలకుపైగా విసిగిపోయిన వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు బాలశౌరితో పాటే పార్టీ మారేందుకు ప్లాట్‌ఫాం సిద్ధం చేసుకుంటున్నారు. ఇదే జరిగితే మచిలీపట్నం వైసీపీ నాయకత్వం సగానికిపైగా ఖాళీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం : మచిలీపట్నం ఎంపీ బాలశౌరిని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఎమ్మెల్యే పేర్ని నాని అడ్డుకున్నారు. 2022 జూన్‌లో ముస్లింలు నివసించే ప్రాంతంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపీ వల్లభనేని బాలశౌరి వెళ్లారు. ఆయన్ను నియోజకవర్గంలో తిరగనీయకూడదనే ఉద్దేశంతో స్థానిక కార్పొరేటర్, పేర్ని కిట్టు అనుచరుడైన అజ్గర్ అలీ ఎంపీని అడ్డుకున్నారు. ఎంపీ అనుచరులను కార్పొరేటర్ దుర్భషలాడారు. అప్పటినుంచి ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. సొంత పార్టీ ఎంపీని నియోజకవర్గంలో తిరగనీయకపోవడం ఏమిటనే అంశంపై వైసీపీలోని అధికశాతం మంది నాయకులు, కార్యకర్తలు అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాలశౌరి అనూహ్యంగా వైసీపీకి రాజీనామా చేయడంతో మచిలీపట్నం రాజకీయం రసకందాయకంలో పడింది. ఎంపీ వర్గీయులంతా వైసీపీని వీడేందుకు సంసిద్ధులవుతున్నారు. ఇప్పటికే 42వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు నాలి మాధవ పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్ ఎంపీ వెంట నడుస్తానని ఇప్పటికే స్పష్టం చేశారు. ఇటీవల ఎంపీ బాలశౌరిని యాదవ సంఘాల నాయకులు తమ ప్రాంతానికి భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి 'మేమంతా మీవెంట నడుస్తాం' అనే సంకేతాలు పంపారు. గతంలో వైసీపీకి అనుకూలంగా పనిచేసిన యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఎంపీ బాలశౌరి వెంట నడుస్తుండటంతోపాటు పార్టీలో అసంతృప్తి పెరిగిపోవడంతో ఎమ్మెల్యే పేర్ని నాని తన అనుచరులను వారి వద్దకు రాయభారం పంపారు. పేర్ని నానితో కలిసి వచ్చే ఎన్నికల్లో పనిచేసేది లేదని వారు తేల్చి చెప్పేశారు.

వర్గాన్ని కూడగట్టే పనిలో బాలిశౌరి

ఇదిలా ఉంటే ఎంపీ బాలశౌరి మచిలీపట్నం నియోజకవర్గంలో తనదైన శైలిలో తన వర్గీయులను కూడగట్టుకునే ప్రయత్నాలు గుట్టుచప్పుడు కాకుండా చేస్తుండటంతో నియోజకవర్గంలో వైసీపీ నాయకత్వం సగం ఖాళీ అవుతుందని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు. మండలంలోని కరగ్రహారం, తాళ్లపాలెం పంచాయతీల్లో వైసీపీకి అనుకూలంగా ఉన్న కుటుంబాలు ఇటీవల టీడీపీలో చేరారు. భవిష్యత్తులో టీడీపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో వైసీపీలోని సగం మందికిపైగా నాయకులు ఎంపీ బాలశౌరి వెంట నడిస్తే మచిలీపట్నం నియోజకవర్గంలో రాజకీయాల్లో కీలక పరిణామాలు భవిష్యత్తులో చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు.

బాలశౌరితో 25 మందికిపైగా కార్పొరేటర్లు

మచిలీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేర్ని నాని అయినా, ఆయన కుమారుడు కిట్టు పెత్తనమంతా తన చేతుల్లోకి తీసుకున్నారు. నియోజకవర్గంలోని మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా 45 మంది వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో అధికశాతం మందిని ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. నగరంతోపాటు మండలంలోని 34 పంచాయతీల్లో కిట్టు హవానే కొనసాగింది. వైసీపీ నాయకులు ప్రజా అవసరాలకోసం వివిధ పనులపై ప్రజలను ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకువస్తే ఎమ్మెల్యేకు బదులుగా ఆయన కుమారుడిని కలవమని చెప్పడం జరుగుతూ వచ్చింది. పార్టీ నాయకుల పట్ల కిట్టు వ్యవహారశైలి కారణంగా కార్పొరేటర్లతో పాటు, సర్పంచ్‌లు విముఖతను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఎంపీ బాలశౌరి వైసీపీకి రాజీనామా చేసిన తరువాత మునిసిపల్ కార్పొరేషన్‌లో 25 మందికిపైగా కార్పొరేటర్లు ఎంపీ వెంట నడవాలనే అంశంపై రహస్య సమావేశం ఇటీవల ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కార్పొరేషన్‌లో కీలక ప్రజాప్రతినిధి భర్త ఇప్పటికిపుడు పార్టీ మారితే పరిస్థితులు తారుమారవుతాయని, కొద్దికాలం వేచి ఉండాలని సర్ది చెప్పారు. మరో ద్వితీయశ్రేణి నాయకుడైతే ఎంపీ వెంట వెళ్లేందుకు, పార్టీ మారేందుకు ఎందుకంత తొందర, ఎన్నికల సమయంలో మీ పని మీరు చేసుకోండని చెప్పడం గమనించదగ్గ అంశం.



- చిరంజీవిని కలిసిన బాలశౌరి

ఎంపీ బాలశౌరి జనసేనలో చేరడం ఖాయమైన తరుణంలో పద్మవిభూషణ్ అవార్డును దక్కించుకున్న సినీనటుడు చిరంజీవిని మంగళవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా ఎంపీ, ఆయన కుమారుడు అనుదీప్ కలవడం మచిలీపట్నం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.



బస్తీలో.. బస్సుల కొరత!

పీఎన్‌బీఎస్‌లో ప్లాట్‌ఫామ్ మీదకు దూసుకెళ్లిన బస్సు దుర్ఘటన తర్వాత నుంచి జిల్లావ్యాప్తంగా పలు ఆర్టీసీ డిపోల్లో బస్సులు ఆగిపోతున్నాయి. ఈ బస్సులు ప్రమాదాన్ని కొనితెచ్చేవి కావటంతో.. ఆర్టీసీ డ్రైవర్లు చేతులెత్తేస్తున్నారు. లాగ్‌షీట్‌లో బస్సుల బ్యాడ్ కండీషన్ నమోదు చేస్తుంటే.. డిపో మేనేజర్లు మరో ఆలోచన లేకుండా వాటిని పక్కన పెట్టేస్తున్నారు. ఇలా ఎన్టీఆర్ జిల్లాలో డిపోకు సగటున 10 నుంచి 20 బస్సుల వరకు ఇప్పటికే పక్కన పెట్టేశారు. ఇలా పక్కన పెట్టినవన్నీ కాలం తీరినవే కావటం గమనార్హం. ఇవన్నీ దాదాపుగా సిటీ ఆర్డినరీ బస్సులే.

కండిషన్‌లేని 100 బస్సులను పక్కన పెట్టిన డిపో మేనేజర్లు

- రానున్న రోజుల్లో మరో 100 బస్సులకుపైగా పక్కన పెట్టే అవకాశం
- లాగ్‌షీట్‌లో బస్సుల కండిషన్‌పై డ్రైవర్లు రాయటమే తరువాయి..
- ఆ బస్సులను ఆపేస్తున్న డిపో మేనేజర్లు..
- దుర్ఘటనలు జరిగితే మూల్యం చెల్లించుకోవడం కంటే ఇదే మేలని భావన
- కొత్త బస్సుల కొనుగోలు లేకపోవటంతో తలెత్తిన కొరత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా సిటీ డివిజన్ పరిధిలోని గవర్నర్‌పేట - 1, గవర్నర్ పేట - 2, ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం డిపోల పరిధిలో ఎక్కువగా బస్సులు ఆపేస్తున్నారు. ఈ నాలుగు డిపోల పరిధిలోనే దాదాపుగా 100 బస్సుల వరకు ఆపేసినట్టు తెలుస్తోంది. వాస్తవానికి నగరంలో కాలం తీరిన బస్సులు 300 వరకు ఉన్నాయి. దాదాపుగా 200 బస్సుల వరకు ఏదో ఒక విధంగా మెయింటెనెన్స్ చేస్తూ వస్తున్నారు. ఈ బస్సులను తాత్కాలికంగా మెయింటెనెన్స్ చేస్తూ నడుపుతున్నా.. ఇవి కూడా ఎక్కువ రోజులపాటు వినియోగించే పరిస్థితి కూడా లేదు. ఇప్పటికీ కాలం తీరిన ఈ బస్సులు నడిరోడ్లపై తరచూ ఆగిపోతున్నాయి. దీనివల్ల కూడా ప్రమాదాలు సంభవించే అవకాశాలుంటాయి. ఈ బస్సులను కూడా త్వరలో ఆపేసే పరిస్థితి వస్తే.. పద్నాలుగు లక్షల జనాభా కలిగిన విజయవాడ నగరంతో పాటు ఆర్టీసీ సిటీ సబర్బన్ పరిధిలోకి వచ్చే నందిగామ, మైలవరం, గుడివాడ, నూజివీడుల వరకు కూడా మరో ఆరు లక్షల జనాభా వెరసి 20 లక్షల జనాభాకు సిటీ బస్సుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 100 బస్సుల వరకు ఆపేయటం వల్ల సిటీ బస్సులకు ఇబ్బంది ఏర్పడింది. ఈ ఇబ్బంది కనిపించకుండా ఆర్టీసీ అధికారులు మేనేజ్ చేస్తున్నారు. గతంలో రూట్ షెడ్యూల్ ప్రకారం డిమాండ్ లేకపోతే కొన్ని ట్రిప్‌లను రద్దు చేస్తుంటారు. ఇలా దాదాపుగా ప్రతిరోజూ పలు బస్సుల ట్రిప్పులు రద్దు అవుతుంటాయి. ఇలా రద్దయిన ట్రిప్పులతో చూసుకుంటే.. 100 బస్సులు పక్కన పెట్టిన ప్రభావాన్ని కనిపించకుండా మేనేజ్ చేస్తున్నారు. అయినా రద్దీ సమయాల్లో బస్సులు లేని ప్రభావం కనిపిస్తోంది. ఆర్టీసీ డిపో మేనేజర్లు కూడా కాలం తీరిన బస్సుల విషయంలో రిస్క్ తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

తప్పుచేసి ఇరుక్కోకూడదని..

ప్రమాదాలు జరిగినపుడు ఆర్టీసీ స్థాయిలో విచారణ జరిగితే అధికారులు బయట పడే అవకాశం ఉంటుంది. అదే ఘోర దుర్ఘటన జరిగితే.. ప్రభుత్వ స్థాయిలో విచారణలు జరిగితే మాత్రం మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని డిపో మేనేజర్లు లాగ్‌షీట్ డేటాను పరిగణనలోకి తీసుకుని బస్సులను డిపోల్లోనే ఆపేస్తున్నారు. దాదాపుగా నెల రోజులుగా ఉధృతంగా బస్సులను ఆపేస్తున్నారు. ఇప్పటికి 100 బస్సులు వరకు ఆగిపోయాయి. ఈ పరిణామాలను గమనిస్తుంటే.. రానున్న రోజుల్లో సిటీ బస్సుల కొరత ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆటోనగర్ డిపోలో విజిలెన్స్ నివేదిక ఏమైంది?

ఆర్టీసీ బస్సు ప్రమాదం నేపథ్యంలో, ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో ఏం జరుగుతుందన్నదానిపై విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇచ్చి చాలాకాలం అవుతున్నా ఇప్పటి వరకు బాధ్యులపై చర్యలు తీసుకోవటంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డిపో మేనేజర్‌ను బాధ్యుడిని చేస్తూ నివేదిక ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆర్టీసీ విజిలెన్స్ విచారణలో కూడా డిపో అధికారినే బాధ్యుడిని చేయగా.. ఇప్పటి వరకు చర్యలు లేకపోవటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధర్మసింగ్ ఎక్కడ..?

రెండు నెలలుగా పరారీలో సబ్‌రిజిస్ట్రార్

- గత ఏడాది సింగ్ ఇంట్లో ఏసీబీ సోదాలు
- రూ.10 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు
- ఇప్పటికీ దొరకని ఆచూకీ

పరారీ వెనుక సీఎం ఆప్తుడి హస్తం?

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) లాలా బాలనాగ ధర్మసింగ్.. ఇబ్రహీంపట్నంలో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఈయన రెండు నెలలుగా కనిపించడం లేదు. గత ఏడాది నవంబరు 17వ తేదీన ఏసీబీ సీఐయూ అధి కారులు ధర్మసింగ్ కార్యాలయం, ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు గొల్లపూడిలోని ఇంట్లోకి అడుగుపెట్టగానే ధర్మసింగ్ వెనుకవైపు నుంచి పారిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏసీబీ అధికారులకు చిక్కకుండా అజ్ఞాతంలో ఉండడం గమనార్హం. కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చలేదు.

పరారీ సలహా ఎవరిది?

ఏసీబీ అధికారుల జాడ తెలియగానే ధర్మసింగ్ గొల్లపూడిలో ఉంటున్న ఓ ప్రముఖ వ్యక్తికి ఫోన్ చేసినట్టు సమాచారం. ఈ ప్రముఖుడు సీఎంకు అత్యంత ఆప్తుడని ప్రచారం నడుస్తోంది. అప్పటికే ఏసీబీ అధికారులు కార్యాలయం, ఇంట్లోకి దిగిపోవడంతో తాను ఏమీ చేయలేనని, ముందుగా అక్కడి నుంచి తప్పించుకోవాలని ఆ ప్రముఖ వ్యక్తి సలహా ఇచ్చినట్టు తెలిసింది. ధర్మసింగ్ ఇంటి వెనుక వైపు నుంచి తప్పించుకున్నాడు. ఈ పరారీ వెనుక చాలా లాజిక్ ఉన్నట్టు తెలుస్తోంది. అతడి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి రెండు నెలలు పూర్తయింది. మరో నెల రోజుల తర్వాత ఏసీబీ అధికారులు చార్జిషీటు దాఖలు చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత అజ్ఞాత వాసాన్ని వీడాలని ధర్మసింగ్ నిర్ణయించుకున్నట్టు సమాచారం.

అక్రమాస్తులు రూ.10కోట్లు

బినామీలను ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి నుంచి వసూలు చేసిన అవినీతి సొమ్ముతో ఎక్కడా లేని ఆనందాన్ని పొందిన ధర్మసింగ్ వద్ద రూ.10 కోట్ల అక్రమాస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. రెండు రోజులపాటు సోదాలు నిర్వహించి ఈ లెక్కలను తేల్చారు. ధర్మసింగ్, అతని భార్య, పిల్లల పేర్ల మీద ఈ ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. కొన్ని ఆస్తులు బినామీల పేర్ల మీద ఉన్నట్టు తేల్చారు.

వాగులో.. డొంకలో..

జగనన్న కాలనీ లే అవుట్లు

ముంపు ప్రాంతాల నుంచి కాపాడాల్సిన వారే ముంపులోకి నెట్టేస్తున్నారు. చట్టాలను నిలువునా తుంగలో తొక్కేస్తున్నారు. సహజసిద్ధ వాగులను పరిరక్షించాల్సిన బాధ్యతలను మరిచి వాటిని కూడా జగనన్న కాలనీల పేరుతో పందేరం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఆదేశాలతో అధికారులు చట్టాలను తుంగలో తొక్కేస్తున్నారు. మరోపక్క అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదు.

- బాపులపాడు మండలం కోడూరుపాడు శివారు శోభనాద్రిపురంలో అధికారుల నిర్వాకం
- అధికార పార్టీ నేతల ఆదేశాలతో వాగు భూమి జగనన్న కాలనీ కోసం కేటాయింపు



కోడూరుపాడులో జగనన్న లే అవుట్ కోసం ఎంపిక చేసిన వాగు, డొంక స్థలం ఇదే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ / జంక్షన్ రూరల్) : గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం కోడూరుపాడు శివారు శోభనాద్రిపురం హరిజనవాడలో రెవెన్యూ సర్వే నెంబర్ 77, 78లలో జగనన్న కాలనీ ఏర్పాటుకు ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన మేరకు రెవెన్యూ యంత్రాంగం జగనన్న లే అవుట్ వేసేందుకు సిద్ధమైంది. ఇవి వాగు, డొంక కలిగిన స్థలాలు. వీటిలో జగనన్న కాలనీలు ఎలా నిర్మిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నేతలు ఈ ప్రాంతంలోని పేదలకు ఇళ్ల స్థలాలకు సిఫార్సు చేయగా దాదాపుగా 24 మందిని ఎంపిక చేశారు. వీరికి జగనన్న కాలనీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం హడావిడిగా వాగు, డొంక భూములను చూశారు. గన్నవరం పంచాయతీ పరిధిలో పోగు పడిన చెత్తను గన్నవరం - నూజివీడు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మార్గంలో గతంలో వేశారు. ఇప్పుడు ఈ చెత్తను జగనన్న కాలనీ పేరుతో గొల్లనపల్లి కొండ తవ్విన ప్రదేశంలో వేస్తున్న లే అవుట్‌లో పోసి దాని మీద గ్రావెల్ పోసి చదును చేస్తున్నారు. ఇలా చెత్తపోసి దాని మీద గ్రావెల్ వేసి నిర్మించే ఇళ్లకు భద్రత ఉంటుందా అన్నది కూడా ఆలోచించటం లేదు.

ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతల కన్ను

- నియోజకవర్గంలో అనేక ప్రభుత్వ భూములు అధికార పార్టీ నేతల ఆక్రమణలో ఉన్నాయి. ఇటీవల ఇదే బాపులపాడు మండలంలోని అంపాపురంలో సర్వే నెంబరు 109లో ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమిత భూములతో పాటుగా అవుట్ రేట్‌సేల్ (ఓఆర్ఎస్) పెట్టే ప్రయత్నం చేశారు.
- గన్నవరం మండలం వెదురుపావులూరులో సర్వే నెంబరు 765లో కాముడు చెరువు 5.5 ఎకరాల భూమి కూడా అన్యాక్రాంతం అయింది. అధికార పార్టీ నాయకుడి ఆధీనంలో సాగుబడిలో ఉంది.
- గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం మండలం పరిధిలో గొల్లనపల్లిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ జగనన్న కాలనీ పేరుతో కొండగట్టు ప్రాంతంలో తవ్వకాలు ప్రారంభించారు. జగనన్న కాలనీ పేరుతో భారీగా మట్టిని కూడా తరలించుకుపోయారు. కొండ ప్రాంతంలో లే అవుట్ వేసేందుకు సిద్ధమౌతున్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 30 : బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలులో జిల్లాను ఆదర్శవంతంగా నిలిపి బాలలకు ఎదురయ్యే సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం వుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధ్వర్యంలో స్థానిక హోటల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలలపై లైంగిక, సామాజిక హింసను నిరోధించేందుకు చట్టాలపై సంబంధిత శాఖల అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోక్సో చట్టం నిబంధనలను అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. నేరానికి పాల్పడినా, ప్రయత్నించినా ఈ చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసేలా కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. బాలల్లో చైతన్యం తెచ్చి నిర్భయంగా వారిపై జరిగే వేధింపులను తెలియజేసే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ, పోలీసు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, విద్యా, సమగ్రశిక్ష, కార్మిక శాఖ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ చర్యలు తీసుకొనేందుకు ఈ సమావేశం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ కె.అప్పారావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ జి.ఉమాదేవి, ఏసీపీ కె.స్రవంతీరాయ్, ఎస్‌సీపీసీఆర్ మెంబర్ జి.సీతారాం, సీడీపీవో జి.మంగమ్మ, సీఆర్ఎఫ్ ప్రోగ్రాం డైరక్టర్ ఫ్రాన్సిస్ తంబీ, ఉప విద్యాశాఖ అధికారి వెంకటప్పయ్య పోలీసు, రెవెన్యూ, విద్య, సాంఘిక సంక్షేమ తదితర శాఖల అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

మహిళల హక్కులపై అవగాహన పెరగాలి

» న్యాయాధికారి రామకృష్ణయ్య

మచిలీపట్నం టౌన్ : లింగ వివక్షత నిర్మూలన, మహిళల హక్కుల రక్షణపై అవగాహన పెరగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బలహీనవర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తున్నామన్నారు. డీఎంహెచ్ డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ, స్కానింగ్, నర్సింగ్ కేంద్రాలు, లేబరేటరీ యాజమాన్యాలు లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్లు వెంకట్రావు, సీతాకుమారి, విజయ భారతి, హిమబిందు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి : ఢిల్లీరావు

కృష్ణలంక : రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేలా ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి వుండాలని జిల్లా ఎన్నికల అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలు, రాష్ట్ర ప్రధాన అధికారి సూచనల మేరకు ఈనెల 24వ తేదీ నుంచి నేటివరకు ఎన్నికల ప్రక్రియలో భాగాలైన పోలింగ్, ఎంసీసీ, ఐటీ అప్లికేషన్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై నాలుగు రోజుల పాటు నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లకు జిల్లాస్థాయి శిక్షకులతో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఆయా బృందాలు సంసిద్ధంగా వుండాలన్నారు. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అందచేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావు, ఆర్డీవో కె.మాధవి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ చక్రపాణి, జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఈఆర్వోలు, ఎలక్షన్ డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యాధరపురం, జనవరి 30: ఇన్నర్‌రింగ్ రోడ్డు అంశంలో చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులో సుప్రీం కోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టువంటిదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ మంగళవారం ఒక ప్రకటన అన్నారు. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని జగన్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన తప్పుడు కేసు అన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు సిగ్గుపడాలన్నారు.

కేశినేని నాని కారుకూతలు ఆపాలి: బేగ్

కేశినేని శ్రీనివాస్ (నాని) వచ్చే ఎన్నికల్లో తాను 3లక్షల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని కారుకూతలు కూస్తున్నాడని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముజఫర్ బేగ్ విమర్శించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేశినేని నాని స్థాయిని మరచి చంద్రబాబుపై అవాకులు, చవాకులు పేలుతున్నాడన్నారు. తొందర్లోనే కేశినేని నానీని జగన్‌రెడ్డి పార్టీ నుంచి గెంటేస్తాడన్నారు.


జగన్‌రెడ్డికి సుప్రీంలో ఎదురు దెబ్బ

వన్‌టౌన్: చంద్రబాబుపై జగన్‌రెడ్డి పెట్టిన అక్రమ కేసులకు సుప్రీంలో ఎదురు దెబ్బ తగిలిందని, జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు సిగ్గుపడాలని టీడీపీ సీనియర్ పశ్చిమ నేత ఎంఎస్ బేగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో చోటు చేసుకున్న అనేక అరాచకాలను ప్రస్తావించి రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఇంటికి పోవడం ఖాయమని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆదర్శం

● డైరీ ఆవిష్కరణలో ఎండీ ద్వారకా తిరుమలరావు

బస్‌స్టేషన్, జనవరి 30: ఆర్టీసీ సూపర్‌వైజర్ల నిరంతర కృషి, అంకితభావంతోనే ఇతర రోడ్డు రవాణా సంస్థల కన్న ఏపీ రోడ్డు రవాణాసంస్థ ఆదర్శప్రాయంగా ఉందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం ఎండీ చాంబర్‌లో క్లాష్ టూ సూపర్‌వైజర్‌ల 2024 డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఇతర రోడ్డు రవాణా సంస్థల కన్నా ఏపీ రోడ్డు రవాణా సంస్థలో సూపర్‌వైజర్ల అంకితభావం మెండుగా ఉందని దీంతో అగ్రభాగంలో నిలుస్తుందన్నారు. ఆర్టీసీ క్లాష్ టూ సూపర్‌వైజర్ల సంఘం జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ ఏ విష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సతీష్‌కుమార్ రెడ్డి, కోశాధికారి వి.పూర్ణచంద్రారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


మోనోగ్రాఫ్‌ను విడుదల చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి.రాములు

అంబేడ్కర్ పేరుతో మోనోగ్రాఫ్ విడుదల

రామలింగేశ్వరనగర్, జనవరి 30: డా.బి.ఆర్ అంబేడ్కర్ 1944లో కోస్తాంధ్రలో సందర్శించిన అనేక ప్రాంతాల జ్ఞాపకాలతో పోస్టల్ శాఖ పది ప్రత్యేక కవర్లతో పాటు మోనోగ్రాఫ్‌ను విడుదల చేయడం హర్షణీయమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. ట్రైల్ ఆఫ్ విజిట్ ఆఫ్ బాబా సాహెబ్ డా.బీఆర్ అంబేడ్కర్ టూ ఏపీ-1944 పేరుతో ఒక మోనోగ్రాఫ్‌ను మంగళవారం కృష్ణలంకలోని పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుడిత రాజశేఖర్, చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములుతో కలిసి ఆవిష్కరించారు. చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.రాములు మాట్లాడుతూ 1944 సెప్టెంబర్‌లో అంబేడ్కర్ రాష్ట్రంలోని కోస్తాంధ్రలోని పలు ప్రాంతాలను సందర్శించారని, ఆనాటి ఘటనలను గుర్తుచేస్తూ పోస్టల్ శాఖ కొన్నిరోజుల నుంచి 10 ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేసిందని ఇందులో భాగంగా మోనోగ్రాఫ్‌ను విడుదల చేశారన్నారు. డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ సందేశ్ మహదేవప్ప, జి.శివ నాగరాజు పాల్గొన్నారు.

హోదా కోసం గళమెత్తిన వారిపై

ఐటీ, ఈడీ దాడులా!

» ప్రత్యేక హోదా సాధన సమితి నేతల ధ్వజం

» హోదా కోసం విజయవాడలో నిరసన దీక్షలు


ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం లెనిన్ సెంటర్‌లో దీక్ష చేస్తున్న వివిధ పార్టీల నేతలు

గవర్నర్‌పేట జనవరి 30 : పార్లమెంటు సభ్యుడు గల్లా జయదేవ్ ప్రత్యేక హోదా కోసం పార్లమెంటులో గళమెత్తితే ఐటీ, ఈడీ దాడులు చేసిందని, దీంతో, ఇకపై రాజకీయాలే వదిలేసుకుంటున్నానని జయదేవ్ పేర్కొనడం మోదీ కక్ష సాధింపు ధోరణి ఎంత స్థాయిలో ఉంటుందో అర్థమౌతోందని ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విభజన హామీలు, ప్రత్యేక హోదా నినాదం మారుమ్రోగింది. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ సెంటర్‌లో ఏపీ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం పేరుతో దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఏపీకి మోదీ అన్ని విధాలా అన్యాయం చేశారని అన్నారు. ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో హోదా కోసం ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని అన్నారు. మోదీకి కొమ్ముకాస్తున్న జగన్, బాబు, పవన్‌లు కూడా హోదాకోసం పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశంలో బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తేవాలని ఎంపీలను కోరారు. హోదా సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ, మోదీ హోదా ఇవ్వకుంటే యువతకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఏపీకి చెందిన ఎంపీలు సిగ్గుంటే పార్లమెంటులో హోదా కోసం పోరాటం చేయాలని అన్నారు. ఏపీ ప్రజల కోసం ఎంపీలు మారాలని, లేకుంటే ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, హోదా గురించి మాట్లాడితే తనపై ఐటీ దాడులు చేయించారని ఎంపీ గల్లా జయదేవ్ స్వయంగా చెప్పారని అన్నారు. మోదీ అహంకారం, నియంతృత్వం ఎలా ఉందో అర్థమౌతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటం చేయాలని కోరారు. అన్ని పార్టీలు ప్రత్యేక హోదా పోరాటంలో భాగస్వాములు కావాలని, ఇప్పుడు సాధించకుంటే ఎన్నికల తరువాత హోదా ఊసే ఉండదని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు ఇస్తుందని, రాహుల్‌గాంధీ కూడా ఈ విషయంలో కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. దీక్షలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి.

జగన్ ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టగలరా!

» ముఖ్యమంత్రికి దేవినేని ఉమా సవాల్

ఇబ్రహింపట్నం, జనవరి 30 : ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం ఉంటే ఢిల్లీ ఏపీ భవన్‌లో మీడియాతో పోలవరం, ప్రత్యేకహోదా, రైల్వేజోన్‌పై మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు సవాల్ విసిరారు. మీడియా ఎదుట మాట్లాడలేని అసమర్థ ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఇబ్రహింపట్నం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఉమా మాట్లాడుతూ, జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, ప్రజా వ్యతిరేకతకు భయపడి పరదాలు కట్టుకొని సభలకు వెళుతున్నాడని ఎద్దేవా చేశారు. కోర్టుల్లో చెంపపెట్టు లాంటి తీర్పులు వస్తున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పులేదని అన్నారు. కేశినేని నాని పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలన్నారు. తెలుగుదేశం భవిష్యత్‌కు గ్యారెంటీ, ఆరు హామీలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, ఎమ్మెల్యే, ఎంపీలను మార్చినంత మాత్రాన, ప్రజావ్యతిరేకతనుంచి బయటపడలేరని ఆయన పేర్కొన్నారు. వైసీపీకి, జగన్‌రెడ్డికి ఇవి చివరిఎన్నికలని, రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ఆయన చెప్పారు.

జగన్ బొమ్మతో ఇంటి పత్రం!

» భూ బదలాయింపు దరఖాస్తులలోనూ ఫొటో



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం సిద్ధం చేసిన ఇంటి స్థల బదలాయింపు దస్తావేజులలో కూడా ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే ఇంటి పట్టాలలో కూడా పెద్ద పెద్ద ఫొటోలను బ్యాక్ గ్రౌండ్‌లో కనిపించేలా ముద్రించారు. దీనికి తోడు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన దస్తావేజుల్లో కూడా ఆదే విధంగా జగన్ ఫొటోలను ముద్రిస్తున్నారు. భూ బదలాయింపు దరఖాస్తులు మూడు పేజీలు ఉండగా.. మూడు పేజీలలోనూ జగన్ ఫొటోలను పెద్ద గా ముద్రించటం గమనార్హం.

సునీత, కాల్వ శ్రీనివాసులుపై కేసు కొట్టివేత

విజయవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులుపై అనంతపురం జిల్లాలో నమోదైన కేసులను విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు మంగళవారం కొట్టేసింది. సమైక్యాంధ్ర ఉద్యమంలో అనంతపురంలో నిరసనలు నిర్వహించారు. ఈ నిరసనలో విధ్వంసాలు సృష్టించారని సునీత, శ్రీనివాసులు, టీకే పార్థసారథితోపాటు 18 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు ఇచ్చింది. అనంతరం వారు విజయవాడ పటమటలోని న్యూఆర్టీసీ కాలనీలో ఉన్న టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.


కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో, చైర్మన్

దుర్గమ్మ హుండీల కానుకలు రూ.2.99కోట్లు

వన్‌టౌన్, జనవరి 30 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన హుండీల కానుకల లెక్కింపు కార్యక్రమంలో 20 రోజులకుగాను రూ.2,99,68,935లు నగదు రూపేణా సమకూరాయి. 640 గ్రాముల బంగారం, 5 కిలోల 610 గ్రాముల వెండి వచ్చాయి. యూఎస్ఏ డాలర్లు 542, 1.5 ఓమన్ రియాల్స్, 20 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 కెనడా డాలర్లు, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూరోలు, 35 సింగపూర్ డాలర్లు, 1మలేషియా రింగెట్, 105 యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్, 0.5 కువైట్ దినార్, 11 సౌదీ రియాల్స్, 20 న్యూజిలాండ్ డాలర్లు, 100 సౌతాఫ్రికా ర్యాండ్‌లు, 55 ఖతార్ రియాల్స్‌తో పాటు హాంగ్‌కాంగ్ డాలర్లు కూడా లభించాయి. దీంతో ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ.67,230 కానుకలు వచ్చాయి. హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

రాష్ట్ర దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, సంస్కృత, తెలుగు ద్వి సహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మలు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు సాదరస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.


హుండీ కానుకల లెక్కింపులో స్వల్ప అపశృతి

హుండీ కానుకల లెక్కింపులో స్వల్ప అపశృతి చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన సేవా బృందం నుంచి ఓ భక్తురాలు కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కానుకల లెక్కింపు ముగియకుండానే మధ్యలో ఇంటికి వెళ్లిపోతుండగా మహిళా సెక్యూరిటీ ఆమెను తనిఖీ చేశారు. ఈ సందర్భంలో 4 బంగారు గాజులు, ఒక ముత్యాలదండ, రెండు బంగారు ఉంగరాలు, 200 నగదు ఆమె వద్ద దొరికాయి. వీటిని అనుమానించి తొలుత ఈవోకు అప్పగించగా ఆయన నిజనిర్ధారణ కోసం అవుట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ స్వయంగా ఆ మహిళా భక్తురాలిని పరివిధాల ప్రశ్నించారు. చివరకు ఆ ఆభరణాలు ఆమె సొంతమేనని తేలడంతో ఆమెను విడిచిపెట్టారు. కాగా హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే సిబ్బందిని తొలుత సెక్యూరిటీ తనిఖీ చేస్తుంది. కానీ ఈ మహిళా తొలిసారిగా లెక్కింపులో పాల్గొనడం, మహిళను సెక్యూరిటీ తనిఖీ చేయకపోవడం వల్ల ఆమె తన వెంటే ఆభరణాలు తీసుకుని వెళ్లారు. విచారణ సమయంలో సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిజనిర్ధారణ కోసం ఆమె ఇంటి నుంచి సంబంధిత బంగారు ఆభరణాల రశీదులను భర్త తీసుకువచ్చి పోలీసులకు చూపడంతో కథ సుఖాంతమైంది.

ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా ఎన్నికల్లో పోటీ

» యునైటెడ్ ఫ్రంట్

ధర్నాచౌక్, జనవరి 30 : రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమైన ప్రత్యేక హోదా సాధనలో రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలం చెందాయని యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు నాగిరెడ్డి దశరథ రామిరెడ్డి విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఫ్రంట్ అధ్యక్షుడిగా దశరథ రామిరెడ్డిని ఎన్నికున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 71 రిజిష్టర్ పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో ఫ్రంట్ తరపున అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ప్రత్యేక హోదా సాధన, రాజధానిగా అమరావతి అభివృద్ధే ఫ్రంట్ లక్ష్యమన్నారు. ఉద్యమనేత పోతుల బాలకోటయ్య, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, కందుల పరమేష్, శిరంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాలో మృతుల ఓట్లు పదిలం!

» తెలంగాణకు చెందిన వారికీ ఓటు

తిరువూరు, జనవరి 30: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమగ్రంగా రూపొందించినట్టు అధికారులు ప్రకటిస్తున్న జాబితాల్లో తప్పులు బయటపడుతున్నాయి. పట్టణంలోని రాజుపేట బూత్ నెంబరు 84లో జాబితాలో పలు తప్పులు వెలుగుచూశాయి. వరుస నెంబరు 563లో చేపలమడుగు వెంకటేశ్వరరావుకు, దానితోపాటు 82వ బూత్‌లోనూ 622తో ఓటు కలిగి ఉన్నాడు. తెలంగాణకు చెందిన మోదుగు దీప్తి(వరుస నెంబరు 745), అలాగు కాకర్ల గ్రామంలోని బూత్ నెంబరు 132లో గొరింట శ్రీనివాసరావు(వరుస నెంబరు60), శిరోమణి(వరుస నెంబరు 57)లో ఓటుహక్కు కల్పించారు. బూత్‌నెంబరు 84లో మృతులకు ఓటు హక్కు కల్పించారు. వారిలో కొలికపోగు నారాయణరావు(వరుస నెంబరు 744), ఇందుపల్లి సత్యవర్ధన్(వరుస నెంబరు768), చేపలమడుగు వెంకటేశ్వరరావు(వరుస నెంబరు 563), వెంకమ్మ పరిగడుపు(వరుస నెంబరు778), షేక్ ఉస్మాన్(వరుస నెంబరు 935)పేర్లు జాబితాలో ఉన్నాయి. ఈ బూత్‌లో కొందరి ఫొటోలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. అధికారుల తీరును స్థానిక ప్రజలు విమర్శిస్తూ పోయిన వారికి ఓటు హక్కు కల్పించి, ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమగ్రంగా ఓటర్ల జాబితా రూపొందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేటినుంచి గుణదల మాత నవదిన ప్రార్థనలు


గుణదల, జనవరి 30 : దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద కతోలిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం నూరువసంతాల మహోత్సవాలు ఫిబ్రవరి 9, 10, 11 మూడురోజులు జరగనున్నట్టు రెక్టర్ ఏలేటి విలియం జయరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం 5 గంటలకు నవదిన ప్రార్థనలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న నవదిన ప్రార్థనల కార్యక్రమాన్ని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. తొలుత శతాబ్ది ఉత్సవాల లూర్దుమాత పతాకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. అనంతరం కొండపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పుణ్యక్షేత్రం పూర్వపు పీఠాధిపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తారన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



వత్సవాయి : ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన కౌలు రైతు పిట్టంపల్లి కోటయ్య (45) అప్పుల బాధ తాళ లేక పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. కోటయ్య గత మూడు సంవత్సరాలుగా ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేస్తున్నాడు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చే మార్గంలేక, రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు రూ.10 లక్షలు అప్పు తేలినట్టు చెబుతున్నారు. కోటయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆశ, నిరాశల మామిడి!


మామిడి చెట్లకు అరకొరగా వచ్చిన పూత

» పూత ఆలస్యం.. దిగుబడిపై దిగులు

» పూత తొలిచేస్తున్న నల్లి, ఇతర పురుగులు

» కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న రైతులు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్)

ఉమ్మడి కృష్ణా జిల్లాలో బాపులపాడు, గన్నవరం, అవనిగడ్డ, నూజివీడు, మైలవరం తదితర మండలాల్లో సుమారు 15వేల ఎకరాలకు పైగా మామిడి సాగులో ఉన్నాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు అధికంగా పడటంతో ఈసారి పూత ఆలస్యమైంది. అధికారిక గణాంకాల ప్రకారం గన్నవరం, మైలవరం, నూజివీడు మండలాల్లో 80శాతం, బాపులపాడులో 65శాతం, అవనిగడ్డలో 35 శాతం మాత్రమే మామిడి పూతలు నమోదయ్యాయి. అయితే తేనెమంచు పురుగు, నల్లి తదితర తెగుళ్ల ఉధృతితో పూతదశలోనే చాలావరకూ రాలిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మామిడి రైతుకు ఈ ఏడాది పూత దశలోనే కష్టకాలం మొదలైంది. సాధారణంగా డిసెంబరు తొలి వారంలోనే పూతతో నిండుగా కనిపించే మామిడితోటలు ఈసారి జనవరి పూర్తయినా సగానికి పైగా చెట్లు మొగ్గకూడా కట్టకపోవడంతో దిగుబడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అంతంత మాత్రం వచ్చిన పూత కూడా రాలిపోవడం, వాతావరణ మార్పులతో నల్లి, తదితర పురుగు సోకి రైతుకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వాతావరణ మార్పుల వల్లే పూత ఆలస్యమవుతోందని ఉద్యాన అధికారులు చెపుతున్నా.. ఈసారీ తిప్పలు తప్పేట్టు లేవని మామిడి రైతులు నిరాశలో మునిగిపోతున్నారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావం..

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగానే మామిడి పూత, కాపు ఆధారపడి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. తక్కువ ఉష్ణోగ్రతలో కాడల్లో పూత కట్టదు, పూతకట్టినవి సరిగా విచ్చుకోక రాలిపోతాయని రైతులు చెబుతున్నారు. అటు పూత ఆలస్యం, ఉష్ణోగ్రతతో పూత రాలిపోవడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సాధారణంగా పూతను బట్టి, లేదా పిందె దశలోనే దిగుబడిపై అంచనాలుంటాయని, ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి కూడా చెప్పలేని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అనిశ్చితిలో వ్యాపారులు ..

గతంలో పిందె దశలోనే తోటలు కొనేందుకు ఆసక్తి చూపే వ్యాపారులు.. ఈసారి పూత లేటవడం, కాపు ఎంతవరకూ నిలబడుతుందో తెలియని అనిశ్చితిలో ముందుకు రావడంలేదని రైతులు వాపోతున్నారు. పూత ఆలస్యమవడంతో దిగుబడి, కాయ నాణ్యత అంచనా వేయలేమని రైతులు చెబుతున్నారు. ఇదే కొనసాగితే పూర్తిగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెగుళ్లతో తీవ్ర నష్టం ..

- కృష్ణాజీ, రైతు

జనవరి, ఫిబ్రవరి నెలల్లో చలి తీవ్రతతో పాటు మంచు వల్ల తోటల్లో తెగుళ్లు చీడపీడల ఉధృతి పెరుగుతుంది. తేనెమంచు పురుగు, బూడిద తెగులు వల్ల పూత, పిందె దశలోనే దిగుబడి ప్రభావం చూపుతాయి. పూత ఆలస్యంతో పాటు ఈసారి తెగుళ్లు కూడా అధికంగా సోకుతున్నాయి. పురుగుమందులు అధికంగా వాడితే కాయ నాణ్యత దెబ్బతింటుంది. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

ఈసారి అన్నీ సమస్యలే..

- కట్టుబోయిన శ్రీనివాసరావు



మల్లవల్లిలో సుమారు 15 ఎకరాల్లో మామిడి సాగు చేశాం. పూత ఆలస్యంగా రావడం, కొన్ని చెట్లకు అసలు పూతే రాలేదు. పూత వచ్చిన వాటికి నల్లి పురుగు సోకడంతో ఎకరానికి రూ.15వేల నుంచి రూ.22వేల వరకూ మందులకు ఖర్చు చేశా. గతంలో ఎకరానికి 3 టన్నుల దిగుబడితో ఖర్చులు పోను ఆదాయం మిగిలేది. ఈసారి ఎకరానికి టన్ను దిగుబడి వస్తుందనుకున్నా, రేటు బాగుంటే ఖర్చులు వస్తాయి. లేదంటే అప్పులు మిగిలేలా ఉన్నాయి.


సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులివ్వాలి

- థామస్

ఎకరానికి రూ.50వేలకు పైగా పెట్టుబడి అవుతోంది. 2 టన్నుల దిగుబడి వస్తే టన్ను రూ.30వేల ధర పలికితే పెట్టుబడి మాత్రమే వస్తుంది. మంచు, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గడంతో పాటు కాయలు చిన్నవిగా రావడంతో ఈసారి ధరకూడా చెప్పలేం. మామిడి రైతుకు కూడా సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

అప్రమత్తత అవసరం

- జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి



మామిడికి ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన దశ.. అప్రమత్తంగా లేకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నేల పరిస్థితిని బట్టి పూతలు వస్తాయి. పూత, పిందె రాలకుండా సస్యరక్షణ చర్యలతో పాటు సూక్ష్మపోషకాలను ఎప్పటికప్పుడు అందించాలి. అవసరాన్ని బట్టి మాత్రమే పురుగుమందులు వాడాలి. తేనెమంచు పురుగు అధికంగా ఉంటే లీటరు నీటిలో 0.3మిలీ ఇముడాక్లోప్రిడ్ లేదా 0.5మిలీ థైయమిథాక్సిం కలిపి పూత మొదలయ్యే సమయంలో, పిందె కట్టే సమయంలో పూత ఆకులతోపాటు పురుగు నివాసముండే మొదళ్లు, కొమ్మలపై జాగ్రత్తగా పిచికారి చేయాలి. ఒకసారి పిచికారి చేసిన తరువాత 3 రోజుల తర్వాత మాత్రమే వేపనూనె(పచ్చిపూతకు), వేపకషాయం(తెల్లపూతకు)పిచికారి చేయాలి. పిందె దశలో ఉన్న తోటలకు తేలికపాటి ఆరుతడిగా నీటి యాజమాన్యం చేయాలి. ఎండుపుల్లలు విరిచేయడం, కలుపు నివారణ, తదితర సస్యరక్షణ చర్యలతో తగు జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన దిగుబడితో మంచి ధర పలుకుతుంది.



కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలి

మాచవరం, జనవరి 30 : కుష్టు వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్త ప్రభుత్వాసుపత్రి చర్మవ్యాధుల విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినంను పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం వ్యాధిగ్రస్తులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన 30 మంది రోగులకు బియ్యం, నిత్యావసర సరుకులు, ఎంసీఆర్ చెప్పులను అందజేశారు. జిల్లా చర్మవ్యాధుల డాక్టర్స్ అసోషియేషన్ సభ్యులు దీక్ష, బుచ్చిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడండి: కమిషనర్

సత్యనారాయణపురం, జనవరి 30: పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరించారు. 28వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో మంగళవారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ పట్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఆ డివిజన్‌కు చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, 201వ సచివాలయం శానిటరీ సెక్రటరి వీరేష్‌ను సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బంది పై చర్యలు తప్పవని సోమవారం 30వ డివిజన్‌లో పర్యటించిన కమిషనర్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినా సిబ్బంది తీరు మారక పోవడంతో 28వ డివిజన్‌లో మంగళవారం ఇరువురిని సస్పెండ్ చేయడంతో సిబ్బందిలో ఆందోళన మొదలైంది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. మ్యాన్ హోల్స్ ఎత్తుపెంచి రోడ్డుతో సమానంగా ఉండేలా చూడాలన్నారు. రోడ్డు మీద అడ్డంగా ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. రోడ్డుతో పాటు మార్జిన్లు సమానంగా ఉండాలని పేవర్ బ్లాక్స్ సరిచేసి సమానంగా ఉంచాలన్నారు. నగరపాలక సంస్థ, మలేరియా, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 30 : టీడీపీ ద్వారానే ముస్లిం, మైనార్టీల సంక్షేమం సాధ్యం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 19వ డివిజన్‌కు చెందిన ఎండీ హుస్సేన్‌ను టీడీపీ జిల్లా పార్లమెంట్ మైనారిటీ కమిటీ అధికార ప్రతినిధిగా నియమించారు. వైసీపీ అర్బన్ జిల్లా మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన హుస్సేన్ ఇటీవల ఆ పార్టీని వీడి టీడీపీలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. హుస్సేన్‌కు నియామకపత్రాన్ని గద్దె అందజేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ముస్లిం సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారని చెప్పారు. రంజాన్‌కు ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేశారని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ముస్లింలకు సంక్షేమమే లేదన్నారు. చంద్రబాబుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని ముస్లిం సంక్షేమంతో పాటుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని గద్దె పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటరీ మైనారిటీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు పార్టీ పెద్దలకు ఎండీ హుస్సేన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు భాగం సాయి ప్రసాద్ తదితర ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.


ఎండీ హుస్సేన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న గద్దె రామ్మోహన్

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, జనవరి 30: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ ఈనెల 27న ఉత్తర్వులు జారీ చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి (గ్రేడ్-1) నూతక్కి వెంకట సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాఖ ఉపకమిషనర్ (కాకినాడ) ఉత్తర్వుల ననుసరించి ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి 20 రోజులు లోగా ఆసక్తి గల అభ్యర్థులు ఫారం నెంబరు 11 ప్రకారం కాకినాడ వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలు ఆలయం కార్యాలయంలో గానీ, 70937 28892 నెంబరుకు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

గవర్నర్‌పేట, జనవరి 30: ఎంబీవీకే, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 86 మంది మహిళలకు సర్టిఫికెట్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో జరిగింది. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జి. శ్రీదేవి, ఎంబీవీకే కమిటీ సభ్యురాలు కె. స్వరూపరాణి, క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ వై. స్వరూప, సెక్రటరీ ఎన్. శ్రీశిల్ప, బాస్టర్ ప్రెసిడెంట్ కవిత పాల్గొన్నారు.

బుద్దాను కలిసిన బేగ్

వన్‌టౌన్, జనవరి 30: టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నను ఆయన కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఇరువురు చర్చించుకున్నారు.

బాలిక ఆత్మహత్య

పాయకాపురం, జనవరి 30 : కొత్త రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక(15) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల ప్రకారం బాలిక ప్రకాష్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ పదవ తరగతి చదువుతుంది. బాలిక తల్లిదండ్రులు మనస్పర్థల కారణంగా దూరంగా ఉంటున్నారు. వీరిద్దరి సంతానం తల్లి దగ్గర ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాలిక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. బాలిక గత మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని పోలీసు విచారణలో తేలింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజకీయ పార్టీల నాయకులు వారి వారి కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్, టీం టీడీపీ సభ్యులు గాంధీ చిత్రపటానికి నివాళి సమర్పించారు. ● పశ్చిమ జనసేన కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్ర పటానికి జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు.

పాయకాపురం: పైపులరోడ్డు వద్ద బుధవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యునైటెడ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు పాల్గొని ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైసీపీ నేత అలంపూరు విజయ్,పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న పోతిన మహేశ్

మద్యపాన నిషేధం అమలు చేయాలి

భవానీపురం, జనవరి 30 : దశల వారీగా మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్‌రెడ్డి హామీలు అమలుకాకపోవడం దారుణమని, మహిళల రక్షణకు మద్యపాన నిషేధమే శరణ్యమని గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు ఆర్.గాంధీనాగరాజన్ అన్నారు. ట్రస్ట్ కార్యాలయంలో ప్రతి నెలా 30న సామాజిక సమస్యలపై ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆయన మద్యపాన నిషేధం కోరుతూ ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. బంగారు భారతి పాల్గొన్నారు.

ఘనంగా బొండా ఉమా జన్మదిన వేడుకలు

పాయకాపురం, జనవరి 30 : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. టీడీపీ, జనసేన నేతలు పలువురు మొగల్రాజపురంలోని ఆయన నివాసం వద్దకు వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల నేతలు, బొండా ఉమాను కలిసి కేక్‌లు కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తన పుట్టిన రోజున శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మళ్లీ తన పుట్టిన రోజు నాటికి తమ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. బొండా ఉమా కుమారులు బొండా సిద్ధార్థ, బొండా రవి తేజ, నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, దాసరి కనకారావు, గాజుల రవి, గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్, పైడి శ్రీను, వైకుంఠం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి మంగళవారం బొండా ఉమా నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో 23వ డివిజన్ టిడీపీ అధ్యక్షుడు చింతా దుర్గారావు, నేతలు రత్న, బొండా కుమారులు పాల్గొన్నారు.

గుణదల: బొండా ఉమా పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన నివాసంలో మంగళవారం నిర్వహించిన వేడుకలకు 26వ డివిజన్ నుంచి భారీ స్థాయిలో నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. బొండా ఉమాను నాయకులు గజమాలతో సత్కరించారు. 26వ డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు తదితరులు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరి పేట: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వర రావు పుట్టినరోజు వేడుకలు బొండా ఉమా యువసేన నగర అధ్యక్షుడు చల్లగాలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక 59వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేపట్టారు. నాయకురాలు ఎస్‌కె. పర్వీన్, నాయకులు ఎ. వినయ్, ఈ. ప్రభాకర్ పాల్గొన్నారు.

ధర్నాచౌక్: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావును బొందిలి సాధికారిక సంఘం నేతలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంసీ భానుసింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన నివాసంలో బొండాకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. లక్ష్మణ్‌సింగ్, వేణు గోపాల్‌సింగ్, బాలాజీసింగ్, శ్రీనివాస్ సింగ్, మహేంద్ర, కోడి ప్రభాకర్, 36వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రాంప్రసాద్ బొండాకు శుభాకాంక్షలు తెలిపారు.


బొండా ఉమాను గజమాలతో సత్కరిస్తున్న 26వ డివిజన్ నాయకులు


కచేరీ చేస్తున్న కె.శశిధర్, మల్లాది బ్రదర్స్

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో కచేరీల వీనులవిందు

విజయవాడ కల్చరల్, జనవరి 30: త్యాగరాజ స్వామి వారి రామనామ కృతు లతో సంగీత సన్మండలి మంగళవారం నగర సంకీర్తన నిర్వహించారు. సత్యనారా యణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనా సంగీత ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు 18 బృందాలు కచేరీలు చేశారు. తొలుత ఆంజనేయస్వామి వార్ల విగ్రహమూర్తులతో ఊరేగింపుగా పురవీధుల్లో సాగింది. సంగీత విద్వాంసులు సామూహికంగా గానం చేస్తూ మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. మోదుమూడి సుధాకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జొన్నవిత్తుల ప్రభాకర్ శాస్త్రి, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, గండూరి రమా సత్యనారాయణ, అంజనా సుధాకర్, వేమూరు వెంకట విశ్వనాథ్, గండూరి శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు. అనంతరం కళాశాల వేదికపై కచేరీలు నిర్వహించారు. ఎస్వీ ఆదిసుందరి, ఆకురాతి కోదండరామయ్య, పి.ఆదిత్య, బీవీఎస్ కృష్ణ, టి.సీతామహాలక్ష్మి, కె.ఉమాదేవి గాత్ర యుగళం, ఒంగోలుకు చెందిన డాక్టర్ నాగమాధురి, రాగంపూడి అమూల్య, నాగపూర్‌కు చెందిన డాక్టర్ ఏవీవీఎస్ అన్నపూర్ణ, ఎం.అన్వైతయమని, ఎ.అన్విక, పి.యుక్తశ్రీ మేధాల బృందగానం, రావినూతల శ్రీవైష్ణవి, గండూరి లక్ష్మీ హర్షిత, నిడమర్తి లోహిత దత్త, భమిడిపాటి శ్రీలలిత, మల్లాది నాగలక్ష్మి, మల్లాది సింధు రాజేశ్వరి, రాత్రియుగళం, కె.శశిధర్, తాడేపల్లిగూడెంకు చెందిన సిస్టి గౌరీ శంకర్ శాస్త్రిల వీణా కచేరీలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

ఘనంగా ఎన్ఎస్ఎం కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవం

పటమట, జనవరి 30 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాకారం చేసుకునే విధంగా కేవలం విద్య మాత్రమే కాకుండా ఎన్ఎస్ఎం పాఠశాల క్రీడలు, సాంస్కృతిక రంగాలలో కూడా చక్కని తర్ఫీదునిస్తుందని ఎన్ఎస్ఎం స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్పరెడ్డి పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయప్పరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధిని పెంపొందించటంలో ఎన్ఎస్ఎం పాఠశాల విజయవాడ నగరానికే తలమానికంగా నిలిచిందని అన్నారు. ముఖ్య అతిథి ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ ఇండ్ల మాట్లాడుతూ చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని తద్వారా జీవితంలో ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్‌ఫోర్ట్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న మోతీ మసీద్ కమిటీ ఎన్నిక

పోటీలో మూడు ప్యానల్స్

చిట్టినగర్, జనవరి 30 : చిట్టినగర్ మోతీ మసీద్(షాదీఖానా) కమిటీ ఎన్నికలు ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎండీ ఫతావుల్లా పేర్కొన్నారు. మంగళవారం చిట్టినగర్ మోతీ మసీద్‌లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న ప్యానల్స్‌కు గుర్తులు కేటాయించి అందజేశారు. పోటీలో సయ్యద్ ఖాజా ప్యానల్ ఎన్నికల గుర్తు(ఇల్లు), ఎండీ బాషా ప్యానల్ ఎన్నికల గుర్తు (చాంద్‌తారా), షేక్ బాజి ప్యానల్ ఎన్నికల గుర్తు (తల్వార్)లు కేటాయించారు. మసీద్ కమిటీకి సంబంధించి మొత్తం 594 మంది సభ్యులు ఉన్నారు. వీరు మాత్రమే కమిటీని ఓటు వేసి ఎన్నుకుంటారు. ఫిబ్రవరి 4న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

సోనికాకు అభినందన

చిట్టినగర్, జవనరి 30: విద్యార్థులు విద్యతోపాటు అన్నింటా రాణించాలని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీరావు అన్నారు. చెస్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించిన డి.సోనికాకు మంగళవారం కె.ఎల్.రావునగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్ అభినందన సభ నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సురేఖ, కరుణ, షకీలా, మల్లేశ్వరి, సాధికా, ఆర్. మల్లేశ్వరి, ఝాన్సీ పాల్గొన్నారు.

వెలంపల్లి సీటు మార్పుతో దరిద్రం వదిలింది

జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్

వన్‌టౌన్, జనవరి 30: వెలంపల్లి సెంట్రల్ నియోజకవర్గానికి వెళ్లడంతో దరిద్రం వదిలి పోయిందని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేశ్ వ్యాఖ్యానించారు. మంగళవారం వన్‌టౌన్‌లోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలంపల్లి వెళ్లిపోవడంతో స్థానిక వైసీపీ నాయకులు ఆనందపడ్డారని, ఆయన వెంట ఎవరూ వెళ్లలేదని తెలిపారు. నాదెండ్ల మనోహర్ సవాల్‌ను స్వీకరించే దమ్ము సీఎం జగన్‌కు, వైసీపీ నాయకులకు లేదన్నారు. తాము పలు అంశాలపై కళాక్షేత్రం వద్ద బహిరంగ చర్చకు వస్తారా.. రారా అన్నా చెప్పకుండా వెలంపల్లి ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. నాదెండ్ల మనోహర్ లేవనెత్తిన అంశాలపై, విజయవాడ అభివృద్ధిపై ఎక్కడ చర్చకు రమ్మన్నా వస్తామని కానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే వెలంపల్లి భవిష్యత్తు బుడమేరులో కలిపేస్తామని తెలిపారు. ● ఇంటింటికి రాబోయే మన జనసేన-టీడీపీ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 53వ డివిజన్ పరిధిలోని హనుమంతరాయ చేపలమార్కెట్ సముదాయం తదితర ప్రాంతాల్లో పోతిన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతరాయ చేపలమార్కెట్‌లో బాత్‌రూమ్‌లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చిరువ్యాపారస్తులకు వైసీపీ ప్రభుత్వం రుణాలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఈ పర్యటనలో అనేక సమస్యలను గుర్తించామని ఆయన పేర్కొన్నారు. పాలేటి మోహనరావు, విఠల్, భక్తి ప్రసన్న, రేఖపల్లి శ్రీను, యుగంధర్, నాగూర్‌ఖాన్, కొరగంజి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డ్ విజేతలకు చిరు సత్కారం

పద్మశ్రీ పురస్కారం పొందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి ఎ.వేలు ఆనందాచారిలను పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత మెగాస్టార్ చిరంజీవి సోమవారం తన ఇంట్లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న యక్షగాన కళారూపానికి జీవం పోస్తున్న సమ్మయ్యకు పద్మశ్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిత్తూరు జిల్లా వెన్నంపల్లికి చెందిన ఆనందాచారి స్థపతిగా దేవాదాయశాఖలో పనిచేశారు. అనేక ఆలయ నిర్మాణాలకు శిల్పకళా నైపుణ్యాన్ని అందించారు. శిల్పశాస్త్ర విషయాలను శిల్పకళాకారులకు నేర్పిస్తూ ఆయన చేస్తున్న సేవలను చిరంజీవి కొనియాడారు. ఇలాంటి కళారూపాలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిరంజీవిని సమ్మయ్య, ఆనందాచారి కూడా సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను కాపాడాలని ఇరువురూ కోరారు.

'సంఘీ' తప్పుడు పదమని నా కూతురు అనలేదు

ఐశ్వర్య వ్యాఖ్యలపై స్పందించిన రజనీకాంత్



"సంఘీ' అనేది ఎవరి వ్యక్తిత్వాన్నీ కించపరిచే పదం కాదు, ఎవరినో అవమానించాలనే ఆలోచన నా కూతురు ఐశ్వర్యకు లేదు" అని రజనీకాంత్ అన్నారు. ఇటీవలే జరిగిన 'లాల్‌సలామ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో ఐశ్వర్య 'నా తండ్రి సంఘీ కాదు' అంటూ ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలను రజనీకాంత్ సమర్థించుకున్నారు. ఆ చిత్రం ఆడియో ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ వి మర్శిస్తున్నారు. నా తండ్రి సంఘీ అయి ఉంటే 'లాల్‌సలామ్' లాంటి సినిమా చేసుండేవారు కాదు. ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు' అని ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. హిందుత్వ వాదాన్ని బలపరచడం తప్పు ఎలా అవుతుంది అని నెటిజన్లు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న 'వేట్టియాన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న రజనీకాంత్ ఈ వి వాదంపై మీడియా ముందు స్పందించారు. 'నా కూతురు ఎక్కడా తప్పుగా మాట్లాడలేదు. 'సంఘీ' అనేది తప్పుడు పదం అని తను చెప్పలేదు. తన తండ్రిని ఆ ఉద్దేశంతో చూడొద్దు అని మాత్రమే చెప్పింది. 'ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తిని అలాంటి దృష్టితో ఎందుకు చూస్తున్నారు' అని ప్రశ్నించడం ఆమె ఉద్దేశం'అని చెప్పారు. 'లాల్‌సలామ్' సినిమాకు ఐశ్వర్య దర్శకురాలు కావడం వల్ల ఆ సినిమాకు ప్రచారం కల్పించేందుకే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారా అని విలేకరులు అడగ్గా అలాంటి అవసరం తమకు లేదని కొట్టిపారేశారు. ఫిబ్రవరి 9న 'లాల్ సలామ్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

మహారాష్ట్ర మహారాణిగా..



కెరీర్ బిగినింగ్‌లో యువతరాన్ని మాత్రమే టార్గెట్ చేశారు నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. నటిగా మెప్పిస్తే ఉండే కిక్కేంటో 'యానిమల్' సినిమా తర్వాత అర్థమైనట్టుంది. ఇప్పుడు అన్ని జనరేషన్స్‌నూ ఆకట్టుకునే పనిలోవున్నారామె. అందులో భాగంగా తాను చేస్తున్న సినిమానే 'ఛావా'. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత గాథ ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. శంభాజీ భార్య, మహారాష్ట్ర ఎంపైర్ మహారాణి యేసుబాయ్ భోస్లే పాత్రను ఇందులో రష్మిక పోషిస్తున్నారు. ఆమె నటిస్తున్న తొలి హిస్టారికల్ మూవీ ఇది. మహారాష్ట్ర చరిత్రలో యేసుబాయ్ భోస్లే పాత్ర విశిష్టమైనది. ఆ పాత్ర చేయడం సామాన్యమైన విషయం కాదు. అలాంటి గొప్ప పాత్రను పోషించనున్నారు రష్మిక మందన్నా. ఇందులో శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్ నటిస్తుండగా, అశుతోష్ రాణా, అక్షయ్‌ఖన్నా ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాత్ర చేస్తుండటం పట్ల రష్మిక ఆనందం వెలిబుచ్చారు. 'అరుదుగా దొరికే అదృష్టం ఇది. ఇంత మంచి పాత్ర ఇచ్చినందుకు దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను' అన్నారామె.

సెప్టెంబర్‌లో ఓజీ రాక



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'సెప్టెంబర్ 27న 'ఓజీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది. 1950ల నాటి ముంబై మాఫియా బ్యాక్ డ్రాప్‌లో సుజీత్ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గతంలో పవన్ కల్యాణ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'అత్తారింటికి దారేది' చిత్రం కూడా సెప్టెంబర్ 27న విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.

ముహూర్తం కుదిరింది



'అంటే సుందరానికి' లాంటి హిట్ చిత్రం తర్వాత నాని - దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో వస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నానికి జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

మనసుల్ని కదిలించే సినిమా ఇది



'ఈ సినిమాకోసం ఎక్కువరోజులు ప్రిపేర్ అయ్యాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. కథతో కనెక్ట్ అవ్వడానికి సీన్స్ మళ్లీ మళ్లీ ప్రాక్టీస్ చేశాను. పాత్ర కోసం రెండు సార్లు గుండు గీయించుకున్నాను. నా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మంచి ఫలితం వస్తుందని ఆశగా ఉన్నాను. అన్నారు హీరో సుహాస్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు'. శివాని నాగారం కథానాయిక. దుష్యంత్ కటినేని దర్శకుడు. వెంకటేశ్ మహా, ధీరజ్ మొగిలినేని కలిసి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో ముచ్చటించారు. 'దుష్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. రియల్‌లైఫ్‌లో తను చూసిన కొన్ని సంఘటనల స్ఫూర్తి ఈ కథలో ఉంది. లాక్‌డౌన్ టైమ్ కాబట్టి స్క్రిప్ట్‌ను బాగా స్టడీ చేసే అవకాశం దొరికింది. కథ మీద నమ్మకంతోనే గుండు గీయించుకున్నా. 2007లో జరిగే కథ ఇది. ఇంటర్వెల్ ఇరవై నిమిషాల ముందు వరకు సరదాగా సాగుతుంది. అక్కడ్నుంచి వేరే లెవల్‌కు వెళుతుంది. సెకండాఫ్ మొత్తం ఎమోషనల్ ఫీల్. 'కలర్ ఫొటో'ను మించిన హై ఎమోషన్ ఈ కథలో ఉంటుంది' అని చెప్పారు సుహాస్. ఇంకా మాట్లాడుతూ 'మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ. నేను, శరణ్య కవలలం. మాఇద్దరి పుట్టినరోజున జరిగిన సంఘటనలు మీ జీవితాలను ఎలాంటి మలుపు తిప్పాయి అనేది ఈ మూవీలో కీలకంగా ఉండే అంశం. కథలోని చాలా సీన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి. వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఫైనల్ కాపీ చూశాక సినిమాపై నమ్మకం కుదిరింది. ముఖ్యంగా శేఖర్‌చంద్ర నేపథ్య సంగీతం సినిమాను మరో రేంజ్‌కి తీసుకెళ్లింది. ఇందులో కథానాయికగా పరిచయం అవుతున్న శివానికి మంచి ఫ్యూచర్ ఉంది. మంచి నటి తను. సినిమా విషయంలో మేమంతా కాన్ఫిడెంట్‌తో ఉన్నాం. ఫిబ్రవరి 2న అందరూ థియేటర్‌కెళ్లి చూడాలని కోరుకుంటున్నా' అన్నారు సుహాస్.



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కూతురు భవతరిణి ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. నటుడు మంచు మోహన్‌బాబు ఇళయరాజా ఇంటికి వెళ్లి ఆయన్ను ఓదార్చారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన సోషల్ మీడియాద్వారా తెలిపారు.

ఇల్లు కొందామనుకున్న డబ్బు ఈ సినిమాలో పెట్టా

సొహైల్



'పాషా లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం. సినిమా అంటే ప్యాషన్‌తో చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా తీశారు. సగం సినిమా పూర్తయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పుడు మా నాన్న రిటైర్‌మెంట్ పైసలు, ఇల్లు కొందామని నేను దాచుకున్న డబ్బు ఈ సినిమాకు పెట్టా. నిర్మాత దిల్‌రాజుగారికి మా పరిస్థితి చెబితే 'తెలంగాణ నేను చూసుకుంటా. నువ్వు టెన్షన్ పడొద్దు' అని ధైర్యం చెప్పారు. ఆయనకు నా కృతజ్ఞతలు' అన్నారు 'బిగ్‌బాస్' సొహైల్. ఆయన హీరోగా నటించిన 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన చాలా ఎమోషనల్ అయ్యారు. 'మనం జీవితంలో ఓడినా గెలిచినా ఏ తల్లికీ కొడుకు మీద ప్రేమ పోదు. అదే ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. ఇందులో ఫన్ ఎమోషన్ ఉంది. హీరోయిన్ మేఘలేఖ చక్కగా నటించడమే కాకుండా మా పరిస్థితిని అర్థం చేసుకుని సపోర్ట్‌గా నిలిచారు. దయచేసి ఈ సినిమాను థియేటర్‌లోనే చూడాలని అందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నాను' అన్నారు సొహైల్. చిత్ర దర్శకుడు శ్రీకోనేటి మాట్లాడుతూ 'కథ దగ్గర నుంచి సినిమా తయారయ్యే వరకూ ఈ ప్రయాణంలో బెక్కం వేణుగోపాల్ ఎంతో సహకరించారు. సొహైల్ ఈ సినిమాను తన భుజాల మీద వేసుకుని నడిపించారు. వినోదంతో పాటు మంచి భావోద్వేగం ఉన్న చిత్రమిది' అని చెప్పారు. సొహైల్ ఇమేజ్‌కి తగ్గ కథను ఎన్నుకున్నామనీ, యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దామనీ బెక్కం వేణుగోపాల్ చెప్పారు. సొహైల్‌కు సినిమా అంటే చాలా ఇష్టం. అతనితో ఈ చిత్రం నిర్మించడం గర్వంగా ఉందని నిర్మాత పాషా చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోలు మంచు మనోజ్, సందీప్ కిషన్, రోషన్ కనకాల, విరాజ్ అశ్విన్, బ్రహ్మానందం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొని చిత్రం విజయం సాధించాలని కోరారు.

థ్రిల్లింగ్ భైరవకోన




సందీప్‌కిషన్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఊరిపేరు భైరవకోన'. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సందీప్‌కిషన్ మంత్రదండం పట్టుకుని కనిపించారు. అతని వెనుక హీరోయిన్స్ కనిపించారు. ప్రచార చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని, సినిమా కూడా అందరికీ నచ్చుతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. వెండితెరపై ఇప్పటివరకూ చూడని థ్రిలింగ్ అంశాలు ఈ సినిమాలో ఉంటాయని వారు చెప్పారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, కెమెరా: రాజ్ తోట, సంగీత: శేఖర్ చంద్ర.

ఆసక్తిని రేకెత్తిస్తున్న మమ్ముట్టి భ్రమయుగం



విభిన్నమైన పాత్రలు పోషిస్తున్న మహానటుడు మమ్ముట్టి. మలయాళంలో ఆయన సూపర్‌స్టార్. అంత స్టార్‌డమ్‌లోనూ ఏ తరహా పాత్రనైనా చేసేస్తారాయన. రీసెంట్‌గా వచ్చిన మలయాళ చిత్రం 'కాదల్ కోర్'లో స్వలింగసంపర్కునిగా నటించారాయన. ఆయన స్థాయిలో ఉన్న ఏ నటుడూ ఆ పాత్ర చేయరు. దటీజ్ మమ్ముట్టి. ఆయన నటిస్తున్న మరో వైవిధ్య చిత్రం 'భ్రమయుగం'. కేరళ సాంప్రదాయంతో కూడిన మమ్ముట్టి గెటప్స్ చూస్తుంటే, కథలో ఆసక్తికలిగించే అంశం ఏదో ఉన్నట్టు అనిపిస్తోంది. మలయాళంతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం విడుదల కానుంది. రాహుల్ సదాశివన్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ కలిసి నిర్మించారు. ఫిబ్రవరి 15న ఈ పాన్ ఇండియా సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మాటలు: టి.డి.రామకృష్ణన్, షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జెవియర్.

నోయిడాలో ఫిల్మ్ సిటీ.. బిడ్ గెలుచుకున్న బోనీ కపూర్



యమునా ఎక్స్‌ప్రెస్ వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నోయిడాలో వెయ్యి ఎకరాల్లో అంతర్జాతీయ హంగులతో ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసే ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఫైనాన్షియల్ బిడ్‌లో అధిక ధర కోట్ చేసి బే వ్యూ ప్రాజెక్ట్ సంస్థ బిడ్ గెలుచుకుంది. బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్, రియల్ ఎస్టేట్ సంస్థ భూటానీ గ్రూప్‌లకు చెందిన సంస్థ ఇది.. టీ సిరీస్‌కు చెందిన సూపర్ క్యాసెట్స్, నటుడు అక్షయ్‌కుమార్ ఆధ్వర్యంలోని సూపర్ సోనిక్ టెక్నో బిల్డ్, నిర్మాత కె.సి.బొకాడియా సొంత సంస్థ ఫోర్ లయన్స్ ఫిల్మ్స్ సంస్థలు కూడా ఈ పోటీలో పాల్గొన్నాయి. వెయ్యి ఎకరాల స్థలంలో మొదట 230 ఎకరాలల్లో ఫిల్మ్ సిటీ పనులు ప్రారంభిస్తారు.

అర్బాజ్‌ఖాన్ కీలక పాత్రలో అశ్విన్‌బాబు సినిమా..



చిరంజీవి 'జై చిరంజీవ', మోహన్‌లాల్ 'బిగ్ బ్రదర్' చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులకు కూడా సుపరిచితుడైన బాలీవుడ్ నటుడు అర్బాజ్‌ఖాన్, ఓ తెలుగు సినిమాలో కీలకపాత్రలో కనిపించనున్నారు. అశ్విన్‌బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. చాలాకాలం తర్వాత తెలుగు సినిమాలో నటిస్తుండటం, ఓ మంచి కథలో ముఖ్య పాత్ర పోషిస్తుండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తోందని అర్బాజ్‌ఖాన్ ఆనందం వెలిబుచ్చారు. ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ 'వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. మా మొదటి ప్రయత్నంలో అర్బాజ్‌ఖాన్ భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఆయన పాత్ర అద్భుతంగా ఉంటుంది. భారీ సాంకేతిక విలువలతో ఈ చిత్రం ఉంటుంది' అని తెలిపారు. దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో హైపర్ ఆది, సాయిధీన ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస.

మా గేమ్‌ను గెలిపించాలి

చిత్ర యూనిట్



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన ప్రీ గేమ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత వివేక్ కూచిబొట్ల సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'సినిమా నేను చూశాను. మంచి కాన్సెప్ట్‌తో బాగా తీశారు. కంటెంట్ బాగున్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా విజయవంతం చేయాలి' అని కోరారు. హీరో గీతానంద్ మాట్లాడుతూ 'ఇది చాలా యూనిక్ కాన్సెప్ట్. తెలుగులో ఇంతవరకూ రాలేదు. రియల్ టైమ్‌లో సాగే సైకలాజికల్ గేమ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా మీద కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అన్నారు. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'ప్రతి సీన్ కొత్తగా ఉండాలని ప్రయత్నిస్తూ ప్రేక్షకులకు నచ్చేలా చిత్రాన్ని రూపొందించా. కాన్సెప్ట్ కొత్తగా ఆసక్తికరంగా ఉంటుంది. మా గేమ్‌ను గెలిపించాలి' అని కోరారు. ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీల్ ఇచ్చే ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉందని నిర్మాత రవి కస్తూరి చెప్పారు.



పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుతారు

అపూర్వరావ్

'హ్యాపీ ఎండింగ్' ప్యూర్ యూత్‌ఫుల్ మూవీ. ఇందులో హ్యూమర్‌కి కొదవుండదు. ప్రతి పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుకుంటారు' అంటున్నారు కథానాయిక అపూర్వరావ్. 'హ్యాపీ ఎండింగ్' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నారు. యష్ పూరి హీరోగా, కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అపూర్వరావ్ విలేకరులతో మాట్లాడారు. 'మా నేటివ్ ప్లేస్ ఒంగోలు. నాన్న ఉద్యోగం వల్ల చైల్డ్‌హుడ్ మొత్తం గుజరాత్‌లో గడిచింది. అక్కడ్నుంచి కువైట్‌వెళ్లాం. అక్కడే ప్రైమరీ ఎడ్యుకేషన్ కంప్లీట్ చేశాను. ఇండియాకు తిరిగొచ్చి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కొంతకాలం జాబ్ కూడా చేశాను. సంతృప్తినివ్వలేదు. నాకు నటనంటే పిచ్చి. ఇంట్లోవాళ్ల సహకారం లేదు. ఇక పట్టుబట్టి, వాళ్లను ఒప్పించి హైదరాబాద్‌లో దాదాఫాల్కే ఫిల్మ్‌స్కూల్‌లో జాయినై ట్రైనింగ్ తీసుకున్నాను. ఆ టైమ్‌లో పరిచయమైన కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, వాళ్ల కామన్ ఫ్రెండ్స్ ద్వారా 'హ్యాపీ ఎండింగ్' ఆడిషన్స్‌కు వెళ్లే అవకాశం వచ్చింది. బాగా పర్‌ఫార్మ్ చేసే తెలుగుమ్మాయి కోసం చూస్తున్న వాళ్లకు నేను నచ్చాను. అలా ఈ సినిమాలో అవకాశం దొరికింది. ఒక మంచి ఎంటర్‌టైనర్ ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు అపూర్వరావ్. ఇంకా మాట్లాడుతూ 'ఇందులో హీరోకు ఓ సమస్య ఉంటుంది. దానివల్ల తను చేయాలనుకున్న పనులు చేయలేకపోతాడు. ఈ సమస్యను హీరో ఎలా ఎదుర్కొన్నాడు, అందుకు తను చేసే ప్రయత్నాలేంటి అనేది చాలా హ్యూమర్‌గా ఉంటుంది.' అని తెలిపారు అపూర్వ. కో ఆర్టిస్టులందరూ చక్కగా సహకరించారని, సాంకేతికంగా సినిమా అద్భుతంగా ఉంటుందని, ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా చూడాల్సిన సినిమా ఇదని ఆమె పేర్కొన్నారు.








ఫ్యాషన్



తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాళహస్తి, పెడన దగ్గర ఎక్కువగా కలంకారి పరిశ్రమ కేంద్రీకృతమై ఉంది. కలంకారి బట్టల తయారీలో ఎక్కువగా నీళ్ల ప్రవాహాల అవసరం ఉంటుంది. అందుకే ఈ పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది. అంతే కాకుండా ఒక కలంకారి వస్త్రం తయారవ్వాలంటే సుమారు 45 రోజులు పడుతుంది. దీనివల్ల ఈ పరిశ్రమకు పరిమితులు ఎక్కువ. "ఇంతకు ముందు కేవలం కాటన్ పైనే కలంకారి డిజైన్లు వేసేవారు. ఇప్పుడు తయారీ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసి సిల్క్, హోసరీ వస్త్రాలపై డిజైన్లు వేయగలుగుతున్నాం" అంటారు కలంకారి వస్త్ర వాణిజ్యవేత్త మనోజ్ఞ. తాజాగా ఆమె మార్కెట్లో విడుదల చేసిన లెగ్గింగ్స్‌కు, రెడీ టూవేర్ జాకెట్స్‌కు విపరీతమైన డిమాండ్ వచ్చింది. దీనితో కేవలం చీరలు మాత్రమే కాకుండా చుడీదార్లు, కుర్తీలు, స్టోల్స్, దుపట్టాలు, దుప్పట్లు మొదలైనవి కూడా తయారు చేస్తున్నామంటున్నారు మనోజ్ఞ. మనకు ప్రకృతిలో దొరికే కరక్కాయ, జాజిఆకు, పసుపు వంటి సేంద్రియ పదార్థాలతో చేసే కలంకారి దుస్తుల తయారీ లైఫ్ సైకిల్‌ను ఆమె 'నవ్య'కు వివరించారు.

కలంకారికి కొత్త అర్థం!




కలంకారి బట్టల తయారీలో మొత్తం 16 స్టెప్స్ ఉంటాయి. దీనిలో ఏ ఒక్కటి తేడా వచ్చినా మొత్తం పాడైపోతుంది. అందువల్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

తయారీ ఇలా...

వీటిలో మొదటిది ఎంచుకున్న కోరా లేదా తెల్ల బట్టను గంజిపోయే వరకూ ఉతికి ఆరబెడతారు. ఇలా ఆరబెట్టిన బట్టను ముందుగా తయారుచేసుకున్న కరక్కాయ రసంలో నానబెడతారు. ఈ రసంలో కొద్దిగా పాలు కూడా కలుపుతారు. ఇలా నానబెట్టిన గుడ్డను ఎండలో ఆరబెడతారు. అందువల్ల చాలా సందర్భాలలో కలంకారి బట్టలు మొదటి సారి వేసుకున్నప్పుడు పాల వాసన వస్తూ ఉంటాయి. ఇలా ఆరబెట్టిన బట్టలపై బ్లాక్‌ల ద్వారా తొలి డిజైన్ వేస్తారు. ఈ బ్లాక్‌లను టేకు చెక్కతో నాలుగు ఇంచుల పొడవు, 9 ఇంచుల వెడల్పు ఉండేలా తయారుచేస్తారు. వీటిని ప్రత్యేకంగా తయారుచేసిన నూనెలలో సీజనింగ్ చేస్తారు. వీటిపై రకరకాల డిజైన్లను చెక్కుతారు. ఈ గుడ్డలపై ప్రకృతిసిద్ధమైన రంగుల డిజైన్లను వేసిన తర్వాత ఆ గుడ్డలను నీటి ప్రవాహం పారే ప్రాంతంలో తాడు కట్టుల మీద వదిలివేస్తారు. ఇలా గుడ్డ నానిన తర్వాత-దానిని పెద్ద పెద్ద రాగి బాండీలలో ఉడక పెడతారు. ఈ సమయంలో జాజి ఆకును తప్పనిసరిగా వాడతారు. దీని వల్ల రంగులు కాంతిమంతంగా తయారవుతాయి. ఆ తర్వాత దానిని సహజసిద్ధమైన ఎండలో ఆరబెడతారు. ఈ విధంగా తయారుచేసిన కలంకారీ గుడ్డలపై రంగులు ఎప్పటికీ నిలిచిఉంటాయి.

కలంకారీ బ్లాక్‌లపై చెక్కే డిజైన్లు కూడా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. సాధారణంగా ఈ బ్లాక్‌లను గుడ్డలపై అద్దేది మహిళలే! అందుకే కలంకారి పరిశ్రమలో 90 శాతం మంది మహిళలే ఉంటారు. కొన్ని పనులకు మాత్రమే పురుషులు కనిపిస్తారు. దీనిలో వాడే కరక్కాయ, జాజిఆకు వంటి వాటిని ఆదివాసులు అడవుల నుంచి సేకరించి తీసుకువస్తారు.

వేటితో రంగులు తయారుచేస్తారు? దానిమ్మపొడి, ఎర్రకాసు (కిళ్లీల తయారీలో కూడా వాడతారు), అల్లరియన్, ఉల్లిపాయల పొట్టు, బంతిపువ్వుల రేకులు, బెల్లం, అడవుల్లో దొరికే కొన్ని రకాల వేళ్లు.




ఫ్రాక్స్
ఈ ఫ్రాక్‌లు పార్టీలకు వేసుకు వెళ్లటానికి బావుంటాయి. అదే సమయంలో డైలీ వేర్‌కు కూడా పనికొస్తాయి.



మనోజ్ఞ
మానవ్ కలంకారి
9666588111

స్టిచబుల్ జాకెట్లు
హోసరీ మెటీరియల్‌తో వీటిని తయారు చేస్తున్నారు. అన్ని వయసులవారూ వీటిని ధరించవచ్చు.



లెగ్గింగ్స్
లెగ్గింగ్స్ ఇప్పుడు మహిళల వార్డ్‌రోబ్‌లో ఒక ముఖ్య భాగమయిపోయాయి. కలంకారీ డిజైన్లలో హోసరీ మెటీరియల్ ద్వారా తయారుచేసే లెగ్గింగ్స్‌కు ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఉంది.

చీరలు
కాటన్, సిల్క్, కోటా సిల్క్ మొదలైన వాటితో తయారుచేసిన చీరలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒకప్పుడు కలంకారీలో కాటన్ చీరలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు సిల్క్ చీరలు కూడా లభిస్తున్నాయి.

పిల్లలకు దెబ్బలు తగలకుండా సున్నితంగా పెంచుకుంటాం! కానీ హైదరాబాద్‌కు చెందిన రవి మంజూష, తన తొమ్మిదేళ్ల కూతురు గగనను తైక్వాండో ఫైటర్‌గా తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన గగన, త్వరలో నేపాల్, అర్జెంటీనాల్లో జరగబోయే ప్రపంచ పోటీల్లో కూడా పాల్గొనబోతోంది. తైక్వాండో క్రీడ పట్ల గగనకు ఉన్న ఆసక్తి, సాధించిన విజయాల గురించి మంజూష 'నవ్య'తో ఇలా పంచుకుంది.

స్ఫూర్తి

తైక్వాండోలో తడాఖా చూపిస్తూ



"అమ్మాయిల మీద అఘాయిత్యాలను ప్రతి రోజూ చూస్తున్నాం. చివరకు బడుల్లో కూడా పిల్లల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అలాంటప్పుడు ఆడపిల్లకు స్వీయరక్షణ అవసరమని అనిపించింది. అలా గగనకు తైక్వాండో శిక్షణ ఇప్పించడం మొదలుపెట్టాం. తక్కువ వ్యవధిలోనే తను ఆ క్రీడ మీద ఆసక్తినీ, పట్టునూ పెంచుకుంది. పైగా తెలంగాణా స్టేట్ పోలీస్ అకాడమీలో ట్రైనర్‌గా పని చేస్తున్న సుబ్బారావు మాస్టారు పాపకు గురువుగా మారారు. ఆయన తైక్వాండోలో ఒలంపిక్స్‌లో ఆరు సార్లు విజయం సాధించారు. అలా గత రెండున్నరేళ్లుగా ఆయన ఆధ్వర్యంలో గగన, తైక్వాండోలో పరిణతి సాధించగలిగింది.

వచ్చే నెల నేపాల్‌లో జరగబోయే ఏసియన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కూ, మేలో అర్జెంటీనాలో జరగబోయే వరల్డ్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కూ ఎంపికైంది. ఈ పోటీలకు పాపను పంపించాలనే నిర్ణయించుకున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆర్థిక సహాయాన్ని కోరాం!

దెబ్బ తగిలినా వెరవకుండా...

పోరాట క్రీడలో దెబ్బలనేవి సహజం. కానీ పాపకు తైక్వాండోలో ఎలాంటి దెబ్బలు తగలకపోయినా, రోడ్ డివైడర్‌కు తగిలి కాలికి గాయమైంది. దాంతో వెంటనే డాక్టరుకు చూపించాం. ఆయన కొద్ది రోజులు విశ్రాంతి అవసరం అన్నారు. కానీ రెండు రోజుల్లోనే ఇంటర్‌స్టేట్ లెవల్ పోటీలున్నాయి. ఆ పోటీల నుంచి తప్పుకుందాం అనుకున్నాం. కానీ గగన పోటీల్లో పాల్గొని తీరవలసిందేనని పట్టు పట్టింది. కాలు నొప్పిని సైతం లెక్క చేయకుండా పోటీలో పాల్గొని వెండి పతకాన్ని గెలుచుకుంది. తర్వాత దెబ్బ తగిలిన కాలి పరిస్థితి మరింత దిగజారి, సర్జరీ చేయించే పరిస్థితి తలెత్తింది. ఆ తర్వాత సర్జరీ అవసరం లేకుండా కొద్ది రోజుల విశ్రాంతితో నయమైపోవడంతో మేమంతా ఊపిరి పీల్చుకున్నాం. జాతీయ పోటీలకు ముందు కూడా గగనకు చికెన్ పాక్స్ సోకింది. అదృష్టవశాత్తూ ఆ పోటీలు నెల రోజులకు వాయిదా పడ్డాయి. ఈ క్రీడ శ్రమతో కూడుకున్నది కాబట్టి గగనకు డ్రై ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్ లడ్డు, పళ్ల రసాలు లాంటి బలవర్థకమైన ఆహారం అందిస్తూ ఉంటాం. రోజంతా చురుగ్గా ఉండడం కోసం, హుషారుగా తైక్వాండో శిక్షణ తీసుకోవడం కోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ ఉంటాం. తైక్వాండో క్రీడకు తగ్గట్టుగా శరీరం చలాకీగా ఉండడం కోసం గగన, ఉదయాన్నే గంట పాటు బ్యాడ్మింటన్ కూడా ఆడుతూ ఉంటుంది.

చదువులోనూ ముందంజే...

గగన రోజూ ఉదయాన్నే ఐదున్నరకే నిద్ర లేస్తుంది. తర్వాత గంట పాటు బ్యాడ్మింటన్ ఆడుతుంది. తర్వాత ఒక గంట ట్యూషన్‌కు హాజరై ఎనిమిదిన్నరకు స్కూల్‌కు వెళ్తుంది. మధ్యాహ్నం మూడున్నరకు స్కూల్ నుంచి వచ్చిన తర్వాత గంట పాటు విశ్రాంతి తీసుకుని, అకాడమీకి వెళ్లి మూడు గంటల పాటు తైక్వాండో సాధన చేసి వచ్చి, గంట పాటు హోమ్‌వర్క్ పూర్తి చేసుకుని, తొమ్మిది గంటలకు నిద్ర పోతుంది. ప్రస్తుతం గగన అల్కాపురిలోని ఇలైట్ ఇంటర్నేషనల్ స్కూల్లో మూడో తరగతి చదువుతోంది. సాధారణంగా పిల్లలు కొద్ది పాటి శ్రమకే అలసిపోతూ ఉంటారు. కానీ గగన ఇంత టైట్ షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నప్పటికీ ఎప్పుడూ ఇతరత్రా వ్యాపకాల పట్ల ఆసక్తిని కనబరచలేదు. పోటీల్లో నెగ్గడమే లక్ష్యంగా కష్టపడుతూ ఉంటుంది. చదువులో కూడా తనది ముందంజే! మొదటి మూడు ర్యాంకుల్లోనే ఉంటూ ఉంటుంది."



మాది ఖమ్మం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మా వారు రవి కృష్ణ, ఐబిఎమ్‌లో సీనియర్ మేనేజర్. బాబు కాశ్విన్ ఎల్‌కెజీలో ఉన్నాడు. నేను చార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేశాను. కానీ గగనకు పూర్తి సమయాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో ఇంటికే పరిమితమైపోయాను. పాల్గొన్న ప్రతి పోటీలో గగన గెలిచి తీరాలన్నది మా లక్ష్యం కాదు. పాప గెలుపోటములను సమానంగా స్వీకరించగలగాలి. మరీ ముఖ్యంగా తనను తాను అన్వేషించుకోవాలనే మేం కోరుకుంటూ ఉంటాం. పెరిగి పెద్దయ్యాక తాను ఏ రంగంలో స్థిరపడాలన్నది పాప నిర్ణయానికే వదిలేశాం!

• గోగుమళ్ల కవిత

దానిమ్మతో ఫేస్‌ప్యాక్స్



దానిమ్మ తింటే ఆరోగ్యమే కాదు చర్మ సౌందర్యానికి మేలు చేస్తుంది. చర్మ ఆరోగ్యానికి మేలు చేసే అద్భుతమైన గుణాలుండే దానిమ్మతో సులువుగా ఫేస్‌ప్యాక్స్ చేసుకోవచ్చు..

- బౌల్‌లో టేబుల్ స్పూన్ దానిమ్మరసం, టేబుల్ స్పూన్ పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడచుట్టూ పట్టిస్తే చర్మంలో మెరుపు వస్తుంది.
- తరచుగా దానిమ్మ పండు తిన్నా ఇందులోని విటమిన్లు, యాంటీయాక్సిడెంట్లు, మినరల్స్ వల్ల చర్మంలో నిగారింపు వస్తుంది. ఇందులో విటమిన్-సి ఉండటం వల్ల మొటిమలు రావు.
- టేబుల్ స్పూన్ దానిమ్మరసంలో, టీస్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే నల్లటి మచ్చలు తొలగిపోతాయి.
- ఇంట్లో రోజ్‌వాటర్ ఉంటే .. ఒక టీ స్పూన్ తీసుకుని అందులోకి అంతే పరిమాణంలో దానిమ్మరసం వేసి కలిపిన తర్వాత ముఖానికి మసాజ్ చేసినట్లు చేయాలి. తరచూ ఇలా చేస్తే.. ముఖం తేజోవంతంగా కనిపిస్తుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ దానిమ్మగింజల గుజ్జు తీసుకుని ఇందులోకి అంతే పరిమాణంలో కలబంద గుజ్జును కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించిన తర్వాత అరగంట ఆగి శుభ్ర పరచాలి. ఇలా చేస్తే చర్మంలో ఉండే దురద తగ్గిపోతుంది. మంటలు తగ్గిపోతాయి.
- టేబుల్ స్పూన్ దానిమ్మరసంలోకి టీస్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి నలభై నిముషాల తర్వాత శుభ్రం చేస్తే చర్మం స్మూత్‌గా తయారవుతుంది.

ఆరోగ్యానికి అసలైన నియమాలు...

- ఎన్ని మాటలు చెప్పినా ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాట వాస్తవం. ఆరోగ్యంగా ఉండాలనుకోవటం వేరు.. ఆరోగ్యం కోసం నియమాలను పాటించటం వేరు. ఈ రెండో కోవలోకి చెందినవారే ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. తిండి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జిహ్వా రుచికోసం ఆలోచిస్తే.. పొట్ట పెరగటంతో పాటు పలురకాల సమస్యలు వేధిస్తాయి. అందుకే తిని సంతోషపడటం కంటే శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవటం మంచిది.



- ఉప్పు, చక్కెర శాతం అధికంగా ఉండకుండా జాగ్రత్త పడాలి. వీలైతే వాటిని పక్కన పెట్టడం మంచిది. తాజా ఆహారమే తినాలి. ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలి.
- ఒకేచోట కదలకుండా గంటలతరబడి కూర్చున్నా, కనీస శారీరక శ్రమ లేకపోయినా ఆరోగ్య సమస్యలు వస్తాయి. కనుక రోజూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి. నడక, జిమ్, యోగా లాంటి వాటివల్ల శరీరంలో టాక్సిన్స్ తొలగిపోతాయి.
- డిజిటల్ పొల్యూషన్‌లో చిక్కుకుని ఫోన్‌తో ఎక్కువ సమయం గడపటంవల్ల నిద్ర సమస్యలు వస్తాయి. ఎంత తిన్నా, ఎంత వ్యాయామం చేసినా సుఖమైన నిద్ర తప్పనిసరి.

ముప్పై ఆరేళ్ళు... 500 గ్రామాలు... 30 లక్షల మొక్కలు... 2,800 స్వయం సహాయక బృందాలు ఏర్పాటు ద్వారా 30 వేల మందికి పైగా మహిళలకు స్వయం ఉపాధి. 'జార్ఖండ్ లేడీ టార్జాన్' ఛామీ ముర్ము సాధించిన ఘనతల్లో ఇవి కొన్ని. ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారం పొందిన ఆమె తన జీవితాన్ని పర్యావరణ పరిరక్షణకు, మహిళల శ్రేయస్సుకు అంకితం చేశారు.

'మొక్క'వోని దీక్ష... పర్యావరణానికి రక్ష



అది 1996. ఒక రోజు తెల్లవారుజామునే ఎవరో తలుపు తట్టడంతో నిద్ర నుంచి మేలుకున్నారు ఛామీ ముర్ము. వీధిలో జనం గట్టిగా మాట్లాడుకుంటున్న శబ్దాలు. తలుపు తీసి చూశారు. చాలామంది మహిళలు ఆమె ఇంటి బయట నిలబడి ఉన్నారు. వారిలో ఆందోళన, ఆగ్రహం కనిపిస్తోంది. "మొక్కలన్నీ నరికేశారమ్మా!" అని వాళ్ళు కన్నీరు మున్నీరవుతూ చెప్పిన మాటలు విని ఛామీ దిగ్భ్రాంతి చెందారు. వాళ్ళను సముదాయిస్తూ, ఊరి బయటకు వెళ్ళి చూశారు. లక్ష మొక్కలు! ఎనిమిదేళ్ళ పాటు ఒక యజ్ఞంలా సాగించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆ మైలురాయిని కొద్ది రోజుల ముందే చేరుకున్నారు. చూస్తే ఒక్క మొక్కనైనా మిగల్చకుండా అన్నిటినీ నరికేశారు. అది గ్రామంలోని కొందరు పురుషులు చేసిన పనేనని ఆమెకు తెలుసు.

చెట్లు ఉంటేనే మనుగడ...

యాభై రెండేళ్ళ ఛామీ స్వగ్రామం జార్ఖండ్‌లోని సరైకేలా ఖార్సావాన్ జిల్లా భుర్‌సాయ్ గ్రామం. ఆమె పదోతరగతిలో ఉండగా... ఒక ప్రమాదంలో తండ్రినీ, అన్నను కోల్పోయారు. అనారోగ్యంతో ఉన్న తల్లి, ముగ్గురు తోబుట్టువుల సంరక్షణ బాధ్యత మీద పడడంతో చదువు ఆపెయ్యాల్సి వచ్చింది. ఊళ్ళోనే వ్యవసాయ పనులు చేసేవారు. 1988లో, ఒక స్నేహితురాలి ప్రోత్సాహంతో... అక్కడికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక పట్టణంలో... గ్రామీణ మహిళల వికాసంపై నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరయ్యారు. మహిళలు స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించుకొని, ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకొనే మార్గాలతో పాటు పర్యావరణ పరిరక్షణ గురించి కూడా ఆ సదస్సులో వివరించిన విషయాలు ఛామీలో అనేక ఆలోచనలు రేకెత్తించాయి. "వంట చెరకు కోసం చెట్లను నరకడం గ్రామీణ ప్రాంతాల్లో అలవాటే. దానివల్ల పర్యావరణానికి ఎంత హాని జరుగుతోందనేది మా గ్రామం చుట్టుపక్కల బంజరులా తయారైన భూములు చూసిన తరువాత అర్థమయింది. చెట్లు ఉంటేనే మనకు మనుగడ. అందుకే... ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం మొదలుపెట్టాను. కానీ ఇలాంటి పని ఒక మహిళ చేయడం మా గ్రామంలో పురుషులకు ఇష్టం లేదు. ఎన్నో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మా ఇంట్లోనూ వాదనలు నడిచాయి. అయితే నా సోదరుడు నాకు అండగా నిలబడ్డాడు. జీవనోపాధి కోసం పొలాల్లో కూలీగా పని చేస్తూనే... కొంత సమయాన్ని మొక్కలు నాటే పనికి కేటాయించేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు ఛామీ. ప్రకృతిని సంరక్షించడం ఎంత అవసరమో తోటి మహిళలకు ఆమె వివరించారు. పదకొండుమంది సభ్యులతో 'సహయోగి మహిళ' అనే సంస్థను స్థాపించారు. ప్రభుత్వ సామాజిక అటవీ కార్యక్రమంలో భాగస్వామి అయ్యారు. స్వయంగా ఒక నర్సరీని ప్రారంభించారు. 1996 నాటికి లక్ష మొక్కలు నాటారు. కానీ ఒక్క రాత్రిలోనే వాటిని గ్రామంలోని కొందరు మగవాళ్ళు నాశనం చేశారు. "నా కుటుంబ సభ్యులకు హాని జరిగినట్టు విలవిలలాడిపోయాను. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. నిందితులు అరెస్టయ్యారు. ఇక మొక్కలు నాటడం ఆపెయ్యాలని శ్రేయోభిలాషులు కొందరు సూచించారు. అలా చేస్తే వాళ్ళను గెలిపించినట్టవుతుంది. మరింత ఉత్సాహంగా పని చేస్తాను" అని చెప్పాను. మళ్ళీ లక్షకు పైగా మొక్కలు నాటాను. అప్పుడే కేంద్ర ప్రభుత్వం నాకు 'ఇందిరా ప్రియదర్శిని వృక్ష మిత్ర' పురస్కారాన్ని అందజేసింది. దాంతో నన్ను వ్యతిరేకిస్తున్న వారి నోళ్ళు మూతపడ్డాయి. ఆ తరువాత ఎవరినుంచీ, ఎటువంటి ఇబ్బందీ నాకు ఎదురు కాలేదు" అని ఆమె తెలిపారు.



అందుకే వివాహం చేసుకోలేదు...

అప్పటినుంచి రెట్టించిన ఉత్సాహంతో తన కార్యకలాపాలను మరిన్ని గ్రామాలకు ఛామీ విస్తరించారు. 500కు పైగా గ్రామాల్లో వేలాది మంది మహిళలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. గత ముప్పై ఆరేళ్ళలో 30 లక్షల పైచిలుకు మొక్కలు నాటడానికి దోహదపడ్డారు. "ఎక్కువగా యూకలిప్టస్, తుమ్మ, మద్ది, వేప, జామ, రోజ్‌వుడ్, మామిడి తదితర రకాల చెట్లు నాటుతూ ఉంటాం. గ్రామాల్లో బంజరు భూముల్ని ప్రధానంగా ఎంపిక చేసుకుంటాం. మొక్కలకు, సమీపంలోని పొలాలకు నీరు అందడానికి, భూగర్భ జలమట్టాలు పెంచడానికి చెక్‌డ్యాంలు, వాటర్‌షెడ్ల నిర్మాణం కూడా చేపట్టాం. గ్రామాలు పచ్చదనం సంతరించుకోవడమే కాదు, ఫలసాయం ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థికంగానూ మేలు చేకూరింది" అంటున్నారు ఛామీ. వన్యప్రాణుల పరిరక్షణకోసం, కలప మాఫియా నుంచి అడవులను కాపాడడానికీ ఎడతెగని పోరాటాలు చేసిన ఆమెను 'లేడీ టార్జాన్ ఆఫ్ జార్ఖండ్' అని ఆ ప్రాంతాల వారు పిలుచుకుంటారు. తాను కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామాల్లో 2,800 స్వయం సహాయక మహిళా బృందాలను ఆమె ఏర్పాటు చేశారు. సుమారు 30 వేలమంది మహిళల స్వయంఉపాధికి సాయపడ్డారు. దానికోసం ఒక సహకార మహిళా సొసైటీని ఏర్పాటు చేశారు. కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం, ఆకుకూరలు, కూరగాయల పెంపకం తదితరాలకు ఈ సొసైటీ ఆర్థిక సాయాన్నీ, ఇతర సహకారాన్నీ అందిస్తోంది. ఆమె నేతృత్వంలోని 'సహయోగి మహిళ' సంస్థ బాలికా విద్య, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారణ, గర్భిణుల సంరక్షణ తదితర అంశాలపై పని చేస్తోంది. అంగన్వాడీ కేంద్రాలు లేని ప్రాంతాల్లో పోషకాహారాన్ని పంపిణీ చేస్తోంది. జిల్లాపరిషత్ సభ్యురాలుగానూ వ్యవహరిస్తున్న ఛామీ... పర్యావరణానికీ, మహిళా సాధికారతకు చేసిన సేవలకు గుర్తింపుగా 2000లో 'నారీ శక్తి' పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ ఏడాది ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. "దీన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. పర్యావరణ పరిరక్షణకే నా జీవితం అంకితం చేశాను. నా సేవా కార్యక్రమాలకు ఆటంకం కాకూడదని వివాహం కూడా చేసుకోలేదు" అని చెబుతున్న ఛామీ ధైర్యం, ఓర్పు, ఆత్మవిశ్వాసాలకు చిరునామా. "మంచి చెయ్యాలనే ఆలోచనతో నిరంతరం శ్రమిస్తే సత్ఫలితాలు సాధించగలం" అని చెబుతారామె. దానికి ఆమే గొప్ప ఉదాహరణ.



మార్కెట్ మళ్లీ ఢమాల్

సెన్సెక్స్ 802 పాయింట్లు డౌన్

రిలయన్స్, ఇతర కంపెనీల షేర్లలో
అమ్మకాలకు పాల్పడిన మదుపర్లు
రూ.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: క్రితం సెషన్‌లో భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం మళ్లీ కుప్పకూలాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ సహా ఇతర షేర్లలో మదుపరులు అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఒక దశలో 865.85 పాయింట్లు పతనమై 71,075 స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 801.67 పాయింట్ల నష్టంతో 71,139.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 215.50 పాయింట్లు క్షీణించి 21,522.10 వద్ద క్లోజైంది. అమ్మకాల హోరులో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్లు తగ్గి రూ.375.20 లక్షల కోట్లకు పరిమితమైంది. "ఆఖరి గంటలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్ల సంకేతాలు బలహీనంగా ఉండటంతో పాటు వచ్చే నెల 1న పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందుజాగ్రత్త చర్యగా కీలక కంపెనీల షేర్లలో పెట్టుబడుల ఉపసంహరణకు మొగ్గుచూపార"ని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (రీసెర్చ్) ప్రశాంత్ తాప్సే అన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టాల్లో ముగిశాయి. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5.17 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఈప్యాక్ లిస్టింగ్ ఫ్లాప్: రూమ్ ఎయిర్‌కండీషనర్లు, చిన్న గృహోపకరణాల తయారీ సంస్థ ఈప్యాక్ డ్యూరబుల్స్ లిమిటెడ్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.230తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 2.17 శాతం తక్కువకు రూ.225 వద్ద లిస్టయింది. ఒక దశలో 10.56 శాతం వరకు క్షీణించిన కంపెనీ షేరు చివరికి 9.69 శాతం నష్టంతో రూ.207.70 వద్ద ముగిసింది.

ఇష్యూ ధర పైకి ఎల్ఐసీ షేరు

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేరు తొలిసారిగా ఐపీఓ ధర ఎగువకు చేరింది. ఇంట్రాడేలో కంపెనీ షేరు ధర రూ.954.85 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివరికి 1.82 శాతం లాభంతో రూ.932.75 వద్ద ముగిసింది. దాంతో సంస్థ మార్కెట్ క్యాప్ రూ.5,89,964.16 కోట్లుగా నమోదైంది. 2022 మే 17న ఎల్ఐసీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.949తో పోలిస్తే, బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు 8.62 శాతం డిస్కౌంట్‌తో రూ.867.20 వద్ద లిస్టయింది. తొలిరోజు రూ.920 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన షేరు ధర చివరికి 7.75 శాతం నష్టంతో రూ.875.45 వద్ద స్థిరపడింది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. గత ఏడాది మార్చి చివర్లో షేరు ఆల్‌టైం కనిష్ఠ స్థాయి రూ.530.20 కి పతనమైంది. అప్పటి నుంచి క్రమంగా పుంజుకుంటూ వచ్చింది. జీవనకాల కనిష్ఠ స్థాయి నుంచి దాదాపు 80 శాతం మేర పుంజుకుంది.

మారుతిని దాటేసిన టాటా మోటార్స్

సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచిన టాటా మోటార్స్ షేరు ఒక దశలో 5 శాతానికి పైగా పెరిగి రూ.886.30 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.16 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ సమయానికి దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ మార్కెట్ క్యాప్ రూ.3.15 లక్షల కోట్ల కంటే అధికమిది. దాంతో స్వల్పకాలం పాటు టాటా మోటార్స్.. మారుతి సుజుకీని వెనక్కి నెట్టి మార్కెట్లో అత్యంత విలువైన వాహన రంగ కంపెనీగా నిలిచింది. అయితే, బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి టాటా మోటార్స్ షేరు 2.19 శాతం లాభంతో రూ.859.25 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,85,515.64 కోట్లకు పరిమితమైంది. కాగా, మారుతి సుజుకీ షేరు 0.36 శాతం నష్టంతో రూ.9,957.25కు జారుకున్నప్పటికీ, రూ.3,13,058.50 కోట్ల మార్కెట్ క్యాప్‌తో తన అగ్రస్థానాన్ని తిరిగి నిలబెట్టుకోగలిగింది.



డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,379 కోట్లు

అంచనాలు మించిన క్యూ3 లాభం • ఆదాయంలో 7 శాతం వృద్ధి • కలిసొచ్చిన విదేశీ మార్కెట్లు


హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మార్కెట్ అంచనాలకు వించి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.7,215 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.1,379 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 7 శాతం, నికర లాభం 11 శాతం పెరిగాయి. 'ఉత్తర అమెకా, ఐరోపా దేశాల మార్కెట్లలో కంపెనీ ప్రస్తుత ఔషధాల మార్కెట్ వాటా పెరగడం, కొత్త ఔషధాల విడుదలతో గతంలో ఏ త్రైమాసికంలోనూ లేనంత సాయిలో అమ్మకాలు పెరిగాయి. దీంతో మూడో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు సాధించగలిగాం' అని కంపెనీ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు.

[illegible]

డిసెంబరు త్రైమా[illegible] మార్కెట్ ఆదాయం రూ.1,180 కోట్లకు చేరింది. 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది ఐదు శాతం మాత్రమే ఎక్కువ. అయితే ఇదే సమయంలో విదేశీ మార్కెట్ల నుంచి వచ్చే జెనరిక్ ఔషధాల ఆదాయం 7 శాతం పెరిగి రూ.6,300 కోట్లకు చేరిది. ఇందులో ఉత్తర అమెరికా మార్కెట్ ఆదాయం 9 శాతం పెరిగి రూ.3,349 కోట్లకు చేరుకోగా ఐరోపా ఆదాయం 15 శాతం పెరిగి రూ.500 కోట్లకు చేరాయి. దీంతో మూడో త్రైమాసికంలో కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు సాధించగలిగింది.

[illegible]

మార్కెట్‌పై మం[illegible], అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. డిసెంబరు త్రైమాసికంలోనూ రూ.560 కోట్లు ఇందుకోసం ఖర్చు చేసింది. కంపెనీ క్యూ3 ఆదాయంలో ఇది 7.7 శాతానికి సమానం. గత త్రైమాసికంలో కంపెనీ యూఎస్ఎఫ్‌డీఏ వద్ద రెండు అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్స్ (అండా) ఫైల్ చేసింది. గత ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి అమెరికా ఎఫ్‌డీఏ వద్ద కంపెనీ ఫైల్ చేసిన 79 జెనరిక్ ఔషధాల అనుమతి పెండింగ్‌లో ఉంది.



నాలుగేళ్లలో మూడింతల టర్నోవర్



నూజివీడు సీడ్స్ లక్ష్యం

హైదరాబాద్: వచ్చే నాలుగు నుంచి ఐదేళ్ల కాలంలో విత్తన మార్కెట్లో రెండింతల వృద్ధిని నమోదు చేయవచ్చని నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) అంచనా వేస్తోంది. మంగళవారం నాడిక్కడ నూజివీడు సీడ్స్ కార్యకలాపాలు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్ఎస్ఎల్ గ్రూప్ చైర్మన్, ఎండీ ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లలో విత్తన మార్కెట్ రెండింతల వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ కూడా మూడింతలు పెరగవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.1,100 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ ఈ స్థాయిలోనే ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సంఘటిత విత్తన మార్కెట్ రూ.20,000 కోట్లుగా ఉందని, ఇది ఏటా 10 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందన్నారు. అయితే వచ్చే మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో కంపెనీ 19-20 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని ప్రభాకర్ రావు తెలిపారు. కాగా గడచిన మూడేళ్ల కాలంలో మార్కెట్లోకి 30 రకాలైన విత్తనాలను కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసింది.

13 ప్రాసెసింగ్ యూనిట్లు: గడిచిన 20 ఏళ్ల కాలంలో మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా ఎన్ఎస్ఎల్ కార్యకలాపాలను విస్తరించినట్లు ప్రభాకర్ రావు తెలిపారు. కంపెనీ ప్రస్తుతం 10కి పైగా రాష్ట్రాల్లో 13 ప్రాసెసింగ్ యూనిట్లు, 29 కోల్డ్ స్టోరేజీ, వేర్‌హౌజ్‌లను నిర్వహిస్తోందన్నారు. అంతేకాకుండా విత్తన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై కంపెనీ ఏటా రూ.50-55 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. పత్తి విత్తన మార్కెట్లో కంపెనీ 15-16%వాటాతో టాప్-3 సంస్థగా ఉందన్నారు.

ఇండెల్ మనీ ఎన్‌సీడీల జారీ

రూ.200 కోట్ల సమీకరణ

హైదరాబాద్: నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.200 కోట్ల వరకు సమీకరించనున్నట్లు గోల్డ్ లోన్ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెల్ మనీ లిమిటెడ్ తెలిపింది. ఈ నెల 30న (మంగళవారం) ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూ.. వచ్చే నెల 12న ముగియనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.1,000 ముఖ విలువ కలిగిన ఎన్‌సీడీలను జారీ చేయనుంది. 366 రోజుల నుంచి 72 నెలల కాలపరిమితులతో కూడిన ఈ బాండ్లపై 12.25 శాతం వరకు వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తున్నట్లు ఎన్‌బీఎఫ్‌సీ తెలిపింది. ఈ ఇష్యూలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు కనీసం 10 యూనిట్లు కొనుగోలు (రూ.10,000 పెట్టుబడి) చేయాల్సి ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది.

ఎన్ఎండీసీకి మారుత్ డ్రోన్లు

హైదరాబాద్: డ్రోన్ల తయారీలో అగ్రగామి అయిన మారుత్ డ్రోన్స్- ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీకి డ్రోన్ ఆధారిత ఖనిజాన్వేషణ చేపట్టడానికి డ్రోన్లు సరఫరా చేసింది. మారుత్ డ్రోన్స్ నుంచి రెండు కస్టమైజ్డ్ ఆక్టాకాప్టర్ డ్రోన్లు సేకరించినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. ఈ డ్రోన్లకు మాగ్నెటోమీటర్, హైపర్ స్పెక్ట్రల్, లిడార్ వంటి ఆధునిక సెన్సర్లుంటాయి. దీని వల్ల ఖనిజాన్వేషణ సామర్థ్యాలు పెరుగుతాయి. కచ్చితమైన మ్యాపింగ్, అన్వేషణకు ఇవి సహాయపడతాయని మారుత్ డ్రోన్స్ సీఈఓ ప్రేమ్‌కుమార్ విస్లావత్ తెలిపారు.

62 కొత్త మార్కెట్లలో ఐకియా డోర్ డెలివరీ

న్యూఢిల్లీ: ఫర్నీచర్ రిటైలింగ్ కంపెనీ ఐకియా దేశంలోని 62 కొత్త మార్కెట్లలో కస్టమర్ ముంగిటికే డెలివరీ సేవలు ప్రారంభించింది. రాబోయే సంవత్సరాల్లో ఆన్‌లైన్ డిమాండ్ మరింతగా పెరుగుతుందని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం ఐకియా అమ్మకాల్లో 25 శాతం ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్నట్లు కంపెనీ ఇండియా సీఈఓ సునానే పల్వరర్ తెలిపారు. తాము డోర్ డెలివరీ సదుపాయం విస్తరించిన కొత్త మార్కెట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయని ఆమె తెలిపారు.

55% తగ్గిన కోరమాండల్ లాభం

హైదరాబాద్: మురుగప్పా గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ రూ.5,510 కోట్ల ఆదాయంపై రూ.243 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 34 శాతం, నికర లాభం 55 శాతం పడిపోయాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▲	57,850 ▲	78,000 ▲
ముంబై	62,610 ▲	57,351 ▲	71,742 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	520	విశాఖపట్నం	565
31 జనవరి		వరంగల్	522
చిత్తూరు	573	డజను గుడ్లు రూ.72	
గోదావరి	530		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	గోదావరి	113
వరంగల్	109	విజయవాడ	113
కరీంనగర్	109	గుంటూరు	114
మహబూబ్‌నగర్	109	ఒంగోలు	114
కర్నూలు	109	చిత్తూరు	123
విశాఖపట్నం	110		

స్పోర్ట్స్

టైటాన్స్ 15వ ఓటమి

పట్నా: ప్రొ కబడ్డీ సీజన్-10లో తెలుగు టైటాన్స్ చెత్త ఆటలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. మంగళవారం పుణెరి పల్టన్ జట్టు 60-29 స్కోరుతో టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో పుణె 68 పాయింట్లతో లీగ్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. రైడర్లు ఆకాష్ షిండే (11 పాయింట్లు), మోహిత్ గోయత్ (8 పాయింట్లు), మహ్మద్ రీజా (7 పాయింట్లు) పుణె గెలుపులో కీలకపాత్ర పోషించారు. టైటాన్స్ ప్లేయర్లలో సంజీవి (8 పాయింట్లు) వినహా ఎవరూ ఆకట్టుకోలేదు. కెప్టెన్ కమ్ టైటాన్స్ స్టార్ ప్లేయర్ పవన్ షెహ్రావత్ (4 పాయింట్లు) కూడా విఫలమయ్యాడు. మొత్తంగా ఈ లీగ్‌లో టైటాన్స్‌కు ఇది 15వ పరాజయం.

ఆటకంటే.. అనవసర విషయాలపైనే..!

మహిళా ప్లేయర్లపట్ల వివక్షపై దివ్య ఆవేదన



న్యూఢిల్లీ: నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీ సమయంలో ప్రేక్షకుల నుంచి తనకు చేదు అనుభవం ఎదురైందని టీనేజ్ చెస్ ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ ఆవేదన వ్యక్తం చేసింది. ఆటకంటే.. అనవసర విషయాలపైనే ఎక్కువగా దృష్టిపెట్టారని వాపోయింది. తను ఎదుర్కొన్న లింగ వివక్ష గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఈ విషయాన్ని ఎప్పటి నుంచో చెప్పాలనుకొంటున్నా. కానీ, టోర్నీ ముగిసే వరకు వేచి ఉన్నా. మహిళా ప్లేయర్ల పట్ల ప్రేక్షకులు ఎంత చులకనగా వ్యవహరిస్తారనే విషయాన్ని గమనించా. వారు నా ఆటకంటే.. దుస్తులు, కురులు, యాస ఇలా అనవసర విషయాలను పట్టించుకొంటున్నారని తెలిసి ఎంతో బాధేసింద'ని దివ్య రాసింది. అమ్మాయిల విషయంలో ఆటకంటే.. వారి అందం, తదితర వ్యక్తిగత విషయాలపై వీక్షకులు దృష్టిపెట్టడమంటే తమను చులకనగా చూడడమేనని ఆరోపించింది. అదే పురుషుల గురించి అయితే.. వారి ఆటపైనే ఎక్కువగా మాట్లాడతారని దేశ్‌ముఖ్ చెప్పింది. పుణెకు చెందిన 18 ఏళ్ల దివ్య గతేడాది ఆసియా చాంపియన్‌షిప్ గెలిచింది. తాజాగా ముగిసిన టాటా స్టీల్ మాస్టర్స్ చాలెంజర్స్ విభాగంలో 12వ స్థానంలో నిలిచింది. కాగా, దివ్య పోస్టుపై హంగేరి గ్రాండ్ మాస్టర్ సుసాన్ పోల్గర్ (54) స్పందించింది. వయసులో ఉన్నప్పుడు.. ఇలాంటి వేధింపుల నుంచి తప్పించుకొనేందుకు తాను ఎంతో సాదాసీదాగా ఉండేదానినని చెప్పింది.

ఎంపిక ఎలా?

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)





వైజాగ్ చేరుకున్న గిల్, కుల్దీప్

ఇంగ్లండ్ చేతిలో తొలి టెస్టు పరాజయం ఓవైపు బాధిస్తుండగానే.. శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టుకు కీలక ఆటగాళ్లు దూరం కావడం టీమిండియాను మరింతగా ఆందోళనపరుస్తోంది. ఈనేపథ్యంలో విశాఖ టెస్టు కోసం పకడ్బందీగా బరిలోకి దిగాలనుకున్న జట్టుకు తుది జట్టు ఎంపిక సమస్యగా మారింది. విరాట్‌తో పాటు ఆల్‌రౌండర్ జడేజా, బ్యాటర్ కేఎల్ రాహుల్ అందుబాటులో లేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను డైలమాలో పడేస్తోంది. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మెరుగ్గా ఆడడంలో ఈ ఇద్దరిదే ప్రధాన పాత్ర. తాజాగా జట్టులోకి సర్ఫరాజ్ ఖాన్, సౌరభ్ కుమార్, వాషింగ్టన్ సుందర్‌లను తీసుకున్నారు. జడేజా స్థానంలో కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తను ఆడిన ఎనిమిది టెస్టుల్లో 34 వికెట్లు తీశాడు. ఒకవేళ తొలి టెస్టులో ఇంగ్లండ్ మాదిరి ఒక పేసర్‌తో వెళ్లాలనుకుంటే సిరాజ్‌పై వేటు తప్పదు. తొలి టెస్టులో ఈ హైదరాబాదీ కేవలం 11 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి వికెట్ పడగొట్టలేకపోయాడు. అయితే ఏకైక పేసర్‌గా బుమ్రాపై అదనపు భారం పడే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని కూడా మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

రజత్ లేక సర్ఫరాజ్?




సర్ఫరాజ్



పటీదార్

మిడిలార్డర్‌ను పటిష్ఠం చేసేందుకు రజత్ పటీదార్ లేక సర్ఫరాజ్‌లలో ఒకరికి అరంగేట్ర చాన్స్ దక్కవచ్చు. దేశవాళీల్లో ఇద్దరూ అత్యద్భుతంగా రాణిస్తున్నారు. రజత్ 55 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 45.97 సగటుతో 4000 పరుగులు సాధించగా, ఇందులో 12 శతకాలున్నాయి. ఒత్తిడిలోనూ తడబాటు లేకుండా బ్యాటింగ్ చేయగలడు. అంతే కాకుండా భారత్ 'ఎ' తరపున ఇంగ్లండ్ లయన్స్‌తో వరుసగా 111, 151 పరుగులు చేయడం రాహుల్ స్థానంలో అతడిని తీసుకునేందుకు అదనపు బలం కానుంది. అటు సర్ఫరాజ్ ప్రస్థానం తక్కువేమీ కాదు. 45 మ్యాచ్‌ల్లో 69.85 సగటుతో 3912 రన్స్ సాధించాడు. ఇందులో 14 సెంచరీలుండడం విశేషం. లయన్స్‌పైనా 96, 55, 4, 161 రన్స్‌తో అదరగొట్టాడు. ఇద్దరూ స్పిన్‌ను ప్రభావవంతంగా ఎదుర్కోగలరు. అయితే భారత పిచ్‌లపై సుదీర్ఘంగా ఆడగలిగే సర్ఫరాజ్ టాలెంట్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ తక్కువగా చూడకపోవచ్చు. ఒకవేళ ఒకే పేసర్‌తో బరిలోకి దిగి స్పెషలిస్ట్ బ్యాటర్ కావాలనుకుంటే ఈ ఇద్దరికీ చాన్స్ దక్కవచ్చు. మరోవైపు గిల్, శ్రేయాస్ అయ్యర్‌ల బ్యాటింగ్ వైఫల్యం ఓవైపు జట్టును మరింతగా ఇబ్బందిపెడుతోంది. కొత్త ఆటగాళ్లు తమ సత్తా నిరూపించుకుంటే వీరికి కష్టకాలం ఆరంభమైనట్టే. అయితే పిచ్‌ను, జట్టు కాంబినేషన్‌ను బట్టి కూడా వీరి ఎంపిక ఉంటుంది.

మిగతా టెస్టులకూ విరాట్ డౌటే!



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో తొలి రెండు మ్యాచ్‌లకు వ్యక్తిగత కారణాలతో దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మిగతా టెస్టులు ఆడేది కూడా సందేహంగా మారింది. తన తల్లి లివర్ సమస్యతో బాధపడుతున్నందుకే కోహ్లీ బ్రేక్ తీసుకున్నట్టు సమాచారం. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఈ సిరీస్‌లోని మిగిలిన మూడు టెస్టులకు కూడా కోహ్లీ దూరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు ఇప్పటి వరకు తన రీఎంట్రీ గురించి విరాట్ నుంచి ఎటువంటి సమాచారమూ లేదని బోర్డు అధికారి సైతం పేర్కొన్నాడు. ఇప్పటికే జడేజా, రాహుల్ గాయాలతో రెండో టెస్టుకు దూరమయ్యారు. ఇందులో జడేజా గాయం కాస్త ఆందోళనకరంగానే ఉందని, అతడు మిగిలిన సిరీస్ ఆడేది కష్టమేననే వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్‌సీఏ మెడికల్ సిబ్బంది నివేదికపై బోర్డు ఓ అంచనాకు రానుంది.

విశాఖపట్నం చేరిన క్రికెటర్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్)/గోపాలపట్నం : ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి జరగనున్న టెస్ట్‌మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం నగరానికి చేరుకున్నారు. వీరంతా హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చారు. విమానాశ్రయం నుంచి పోలీసుల భద్రత మధ్య బస్సుల్లో నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొంటారు. కాగా, కోచ్ రాహుల్ ద్రవిడ్ సోమవారమే చేరుకున్నాడు.

ముషీర్ ఆల్‌రౌండ్ షో



ముషీర్

- 214 పరుగులతో భారత్ విజయం
- న్యూజిలాండ్‌తో సూపర్-6 మ్యాచ్
- అండర్-19 వరల్డ్‌కప్


బ్లూంఫోంటీన్: సూపర్ ఫామ్‌లో ఉన్న ముషీర్ ఖాన్ (126 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 131, 2/10) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. అండర్-19 వరల్డ్ కప్ సూపర్-6లో భారత్ ఘనంగా బోణీ చేసింది. గ్రూప్-1లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 214 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 295 పరుగులు చేసింది. అరవెల్లి అవనీష్ (17) దూకుడుగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. మసన్ క్లార్క్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. కానీ, మరో ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (52)తో కలసి రెండో వికెట్‌కు 77 పరుగులు జోడించిన ముషీర్.. కెప్టెన్ ఉదయ్ సహరన్ (34)తో కలసి మూడో వికెట్‌కు 87 రన్స్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నాడు. అయితే, ముషీర్‌ను క్లార్క్ అవుట్ చేయడంతో.. డెత్ ఓవర్లలో టీమిండియా వేగంగా ఆడలేక పోయింది. సౌమీ పాండే (4/19) తిప్పేయడంతో.. ఛేదనలో న్యూజిలాండ్ 28.1 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే టామ్ జోన్స్ (0), స్నేహిత్ రెడ్డి (0)ని రాజ్ లింబానీ పెవిలియన్ చేర్చడంతో.. కివీస్ ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. ఆస్కార్ జాక్సన్ (19) టాప్ స్కోరర్.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 50 ఓవర్లలో 295/8 (ముషీర్ 131, ఆదర్శ్ 52; క్లార్క్ 4/62); **న్యూజిలాండ్:** 28.1 ఓవర్లలో 81 ఆలౌట్ (జాక్సన్ 19; సౌమీ 4/19, లింబానీ 2/17, ముషీర్ 2/10).

గాయత్రి జోడీ ముందంజ

బ్యాంకాక్: థాయ్ మాస్టర్స్‌లో గాయత్రి జంట రెండో రౌండ్‌కు చేరుకొంది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 16-21, 21-10, 21-18తో హాంకాంగ్‌కు చెందిన లి లోక్-వింగ్ యంగ్ జంటపై గెలిచింది. కాగా, మరో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో ద్వయం 21-13, 21-17తో చైనీస్ తైపీ జంట హు లింగ్ ఫాంగ్-లింగ్ జో మిన్‌పై నెగ్గింది. రెండో రౌండ్‌లో గాయత్రి జోడీతో అశ్విని జంట తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ, శంకర్ ముత్తుస్వామి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

వెయిట్‌లిఫ్టింగ్ ఓవరాల్ చాంప్ ఆంధ్ర



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాలికల వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. చెన్నైలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆంధ్ర 236 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్ టైటిల్ కైవసం చేసుకోగా, మహారాష్ట్ర ద్వితీయ స్థానం, ఆతిథ్య తమిళనాడు తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నాయి. స్విమ్మింగ్‌లో విజయవాడ స్విమ్మర్లు తీర్థు, సంపత్ సత్తా చాటారు. బాలుర 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తీర్థు సామదేవ్ (8 నిమిషాల 29.76 సెకన్లు) స్వర్ణం, సంపత్ కుమార్ యాదవ్ (8 నిమిషాల 29.86 సెకన్లు) రజతం కొల్లగొట్టారు.

3 కోట్ల నగదు డీఎస్పీ పోస్టు

దీప్తికి నజరానా



న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇచ్చింది. ఆగ్రాకు చెందిన ఈ 26 ఏళ్ల క్రికెటర్ గత కొంతకాలంగా టీమిండియా తరఫున అద్భుతంగా ఆడుతోంది. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, దీప్తికి ఉద్యోగంతో పాటు రూ.3 కోట్లు నగదు బహుమతి ఇచ్చి, ఘనంగా సత్కరించారు.

ర్యాంకింగ్స్‌లో సంయుక్తంగా రెండో స్థానంలో దీప్తి

తాజా టీ20 ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకొని పాకిస్థాన్ బౌలర్ సాదియా ఇక్బాల్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫియా ఎకెల్‌స్టోన్ అగ్రస్థానం నిలబెట్టుకుంది. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో దీప్తి నాలుగో స్థానంలో ఉంది.

విమానంలో మయాంక్‌కు అస్వస్థత



ఆసుపత్రికి తరలింపు

అగర్తలా: కర్ణాటక రంజీ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ హఠాత్తుగా అస్వస్థతకు గురి కావడంతో.. ఢిల్లీ వెళ్లాల్సిన విమానం నుంచి కిందకు దించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) అధికారి ఒకరు తెలిపారు. త్రిపురతో మ్యాచ్ ముగిసిన అనంతరం.. కర్ణాటక జట్టు మంగళవారం ఢిల్లీ మీదుగా సూరత్ బయల్దేరింది. అయితే, విమానంలో సీటువద్ద ఉన్న బాటిల్‌లోని పానీయాన్ని నీళ్లుగా భావించి తాగిన తర్వాత గొంతు మంట, కడుపులో అసౌకర్యంగా ఉందని అగర్వాల్ ఫిర్యాదు చేశాడట. వాంతులు కావడంతో వైద్యం కోసం అగర్తలాలోని ఐఎల్ఎస్ ఆసుపత్రిలో చేర్చారు.అప్పటికి పెదాలు వాచిపోయి, మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. కాగా కర్ణాటక జట్టు తమ తర్వాతి రంజీ మ్యాచ్‌లో రైల్వేస్‌తో శుక్రవారంనుంచి ఆడనుంది ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కర్ణాటక క్రికెట్ జట్టు మేనేజర్ త్రిపుర పోలీసులను కోరాడు.

మళ్లీ ఓట్లడగడానికి వస్తున్నారా..!

» పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నిరసన సెగ

గాజువాక (విశాఖపట్నం), జనవరి 30: విశాఖ జిల్లా పెందుర్తి వైసీపీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు చేదు అనుభవం ఎదురైంది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని అప్పికొండలో మంగళవారం వంతెన పనులకు శంకుస్థాపన చేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేను మార్గమధ్యంలో మురుబాయి గ్రామస్థులు అడ్డుకున్నారు. నెలకు మూడు సార్లు తమ గ్రామానికి వస్తానని, అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని.. తీరా గెలిచిన తర్వాత తమను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఐదేళ్లలో తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్నాయని ఓట్లు అడగానికి వస్తున్నారా... అంటూ నిలదీశారు. 'ఎమ్మెల్యే గోబ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ ఆయన కారును దిగ్బంధించారు. గ్రామంలో సమస్యలు పట్టించుకోకపోగా అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును తమ గ్రామస్థులకు ఇవ్వకుండా వేరే ఊరికి చెందిన వ్యక్తికి అమ్ముకున్నారని ఆరోపించారు. తాము లేవనెత్తిన సమస్యలు, ప్రశ్నలకు ఎమ్మెల్యే కారు దిగి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే 45 నిమిషాలపాటు కారులోనే ఉండిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఎమ్మెల్యే కారును ముందుకు పంపేందుకు యత్నించగా గ్రామస్థులు ప్రతిఘటించారు. దీంతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అప్పికొండ వెళ్లకుండానే వెనుదిరిగారు.



ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్థులు

ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నాం

హిందూపురం కౌన్సిల్‌లో వైసీపీ కౌన్సిలర్ల ఆవేదన

హిందూపురం, జనవరి 30: ఆ మునిసిపాలిటీ అధికార పార్టీది. మొత్తం 38 మంది కౌన్సిలర్లలో 30 మంది వైసీపీ నేతలే. అయినా, కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు కాకరేపారు. సొంత మునిసిపాలిటీ పాలనాతీరుపై దుమ్మెత్తిపోశారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఏం అభివృద్ధి చేశామని ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. రహదారులు, మురుగు కాలువలు, కరెంటు తదితర సమస్యలపై ప్రజలు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకున్నామని, పదవిలో ఉండటం కంటే వెళ్లిపోవడం మంచిదనిపిస్తోందని సభా సాక్షిగా వాపోయారు. అభివృద్ధి పనుల్లో తమ వార్డులకు న్యాయం చేయడం లేదంటూ చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశంలో కనిపించిన దృశ్యం ఇది. కౌన్సిలర్ల సమావేశం ప్రారంభంకాగానే అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇర్షాద్, నాగేంద్రమ్మ, నసీరాభాను, ఆసిఫ్.. చైర్‌పర్సన్ పోడియం వద్దకు వెళ్లి సమస్యలపై నిలదీశారు. 5వ వార్డులో రోడ్డు మధ్య గుంతపడిందని, మరమ్మతులకు రూ.5వేలు ఖర్చవుతుందని, ఆ పని కూడా చేయలేకపోతున్నామంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఓటు అడగడానికి ప్రజల్లోకి వెళ్లాలంటే భయం వేస్తోందన్నారు. దీంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని ఐదు నిమిషాలపాటు వాయిదావేసి, చాంబర్‌లోకి వెళ్లిపోయారు. అనంతరం పోడియంలోకి వచ్చి అజెండాలోని 14 అంశాలకు సంబంధించిన చర్చను వాయిదా వేస్తున్నామన్నారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం నడుమ కౌన్సిల్ సమావేశం 20 నిమిషాల్లోపే ముగిసిపోయింది.



చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టిన వైసీపీ కౌన్సిలర్లు

షర్మిలకు ప్రాణహాని: అయ్యన్న



విశాఖపట్నం, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తల్లి, చెల్లి, బాబాయి... అనే తేడా లేదని, షర్మిలను అంతమొందించినా ఆశ్చర్యపోనక్కర్లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. విశాఖ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా సీఎం జగన్‌పై ఆయన సోదరి షర్మిల అనేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. తండ్రి ఆస్తిలో వాటా కోసం షర్మిల పట్టుబడుతున్నారని, కొద్దిరోజులుగా జగన్‌ను లక్ష్యంగా చేసుకుని అనేక విషయాలు బహిర్గతం చేశారని అన్నారు. అందుకే షర్మిలకు భద్రత పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. తనకు కూడా ప్రాణహాని ఉందని అయ్యన్న ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసి తన రివాల్వర్ లైసెన్స్ రెన్యువల్‌కు ఆమోదం తెలపాలని కోరామన్నారు. నాలుగున్నరేళ్లలో ఉత్తరాంధ్రకు జగన్ ఏమీ చేయలేదని, విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను దోచుకున్నారని ఆయన ఆరోపించారు. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి టీడీపీ తరఫున తన కుమారుడు విజయ్ దరఖాస్తు చేశారని, ప్రస్తుతం హైకమాండ్ దాన్ని పరిశీలిస్తుందని చెప్పారు. తన కుమారుడు సమర్థుడని, అందుకే ఆయనకు అవకాశం ఇవ్వాలని హైకమాండ్‌ను కోరామన్నారు.

మతిభ్రమించి ప్రేలాపన!

» కేశినేని నానిపై బుద్దా వెంకన్న ఆగ్రహం

» పవన్‌ను దూషించినట్టు తప్పుడు పోస్ట్.. ఫిర్యాదు



విజయవాడ (వన్‌టౌన్), జనవరి 30: పిచ్చివేషాలు వేస్తే నానీని బట్టలూడదీసి ఆంధ్రా బోర్డర్‌లో విడిచిపెడతామని ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)ని ఉద్దేశించి టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న హెచ్చరించారు. నానీ పిచ్చి పట్టి మతిభ్రమించి వాగుతున్నాడని, మానసిక వైద్యులకు చూపించాలని కుటుంబ సభ్యులకు సూచిస్తున్నానన్నారు. రెండుసార్లు ఎంపీని చేస్తే చంద్రబాబును తిడుతున్నాడన్నారు. టీడీపీలోనే ఉంటూ వైసీపీ కోవర్టుగా వ్యవహరించి, అనంతరం వైసీపీలోకి వెళ్లిన నాని, హద్దుల్లో ఉండాలని హెచ్చరించారు. మంగళవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము దమ్ముతో ఇన్నాళ్లూ జగన్‌పై పోరాటం చేస్తే, అతడు పిరికిపందలా కోవర్టు రాజకీయాలు నడిపాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 3లక్షల ఓట్లతేడాతో ఓడిపోవడం ఖాయమన్నారు. ఒకప్పుడు దేవినేని నెహ్రూను తిట్టిన నాని.. ఇప్పుడు అతడి కొడుకైన అవినాష్‌కు అనుచరుడిగా మారిపోయాడని ఎద్దేవా చేశారు. నానీ గానీ, ఆయన కుమార్తెగానీ పశ్చిమలో పోటీ చేసి తనపై గెలుస్తారా? అని సవాల్ విసిరారు. కాగా, తన పేరిట తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పోలీసు కమిషనర్‌కు బుద్దా వెంకన్న ఫిర్యాదు చేశారు. జనసేన-టీడీపీ కలయికను జీర్ణించుకోలేని కొంతమంది తప్పుడు పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. తనకు చంద్రబాబు ఎలానో పవన్‌కల్యాణ్ కూడా అలానే అని స్పష్టం చేశారు.

జగన్‌పై 'హోదా' అస్త్రం!

ఢిల్లీ వేదికగా 2న దీక్ష?

» రేపటికల్లా హస్తినకు రావాలని పీసీసీ ముఖ్య నేతలకు షర్మిల పిలుపు

» ఫిబ్రవరి 5న మడకశిరలో సభ

» తర్వాత గన్నవరం, విశాఖల్లో!

» విభజన హామీలపై మోదీకి షర్మిల లేఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుజ్జీవానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఫల్యాలనే సాధనంగా తీసుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించారు. ప్రధానంగా 2019లో ప్రత్యేక హోదా హామీతోనే ఆయన అధికారంలోకి వచ్చారని.. ఈ ఐదేళ్లలో అది సాధించకపోగా.. కనీసం హోదా ఇవ్వాలని ప్రధాని మోదీని నోరుతెరిచి అడుగలేదని కార్యకర్తలతో సమావేశాల్లో ఆమె పదేపదే చెబుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయనపై హోదా అస్త్రాన్నే ప్రయోగించాలని.. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఢిల్లీ వేదికగా పోరాడాలని నిశ్చయించారు. రెండో తేదీన దీక్షకు కూర్చోనున్నట్లు తెలిసింది. గురువారం నాటికి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులంతా హస్తిన రావాలని ఆమె పిలుపిచ్చారు. ప్రత్యేక హోదాపై ప్రతిపక్ష నేతగా జగన్ చేసిన ప్రసంగాలు, దీక్షల వివరాలను రాష్ట్ర ప్రజలకు షర్మిల ఈ సందర్భంగా గుర్తుచేస్తారు. జగన్ మాటలను విశ్వసించి వైసీపీకి భారీ విజయాన్ని అందిస్తే.. ఎంత నమ్మకద్రోహం చేశారో వివరిస్తారు. ఢిల్లీ యాత్ర పూర్తయ్యాక.. 5న ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిరలో బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నారు. తర్వాత గన్నవరం, విశాఖల్లో కూడా బహిరంగ సభలు చేపట్టాలని షర్మిల యోచిస్తున్నట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. మంగళవారం విజయవాడ ఆంధ్ర రత్నభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు నేతృత్వంలో మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ విభాగం చైర్మన్ కొప్పుల రాజు, జేడీ శీలం సహా 17మంది సభ్యులు హాజరయ్యారు. 10న బెంగళూరులో విస్తృత చర్చల అనంతరం మేనిఫెస్టో తయారవుతుందని కొప్పుల రాజు చెప్పారు.

పదేళ్ల తర్వాతా అదే దుస్థితి

2014లో రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంటు చేసిన చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత



కేంద్రంపై ఉందని షర్మిల స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం (2014 ఫిబ్రవరి 20న) నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో విభజిత ఆంధ్రకు ప్రత్యేక హోదా సహా ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రధాని మోదీకి మంగళవారం ఆమె లేఖ రాశారు. 'ఐదున్నర కోట్ల ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదా అమలు, జీవనాడి పోలవరం నిర్మాణంతోపాటు అసంపూర్తిగా వదిలేసిన హామీలను బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంలో పొందుపరచాలి. చట్టంలో ఎన్నో వాగ్దానాలు చేసి పదేళ్లయినా కనీసం రాజధాని కూడా లేని దుస్థితిలో ఆంధ్రప్రదేశ్ ఉండడం బాధాకరం. రాష్ట్ర ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేశాయి. దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, కలహండి-బుందేల్ ఖండ్ తరహాలో రాయలసీమ-ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, నూతన రాజధాని నిర్మాణం లాంటివన్నీ అసంపూర్తిగానే మిగిలి పోయాయి. ఇవ్వాల్సినవి ఇవ్వకపోగా ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే యత్నాలు మరింత బాధిస్తున్నాయి' అని వాపోయారు.

మాధవి కాదు.. మత్స్యలింగం!

వైసీపీ అరకు అభ్యర్థి మార్పు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేశామని గొప్పగా చెప్పుకొంటున్న సీఎం జగన్.. వైసీపీ శ్రేణుల నిరసనలతో కొందరు అభ్యర్థులను మార్చేస్తున్నారు. తాజాగా అరకు అసెంబ్లీ అభ్యర్థి గొడ్డేటి మాధవిని తప్పించి.. రాగం మత్స్యలింగంను అధికారిక అభ్యర్థిగా ప్రకటించారు. వాస్తవానికి అరకు సిటింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ స్థానంలో అరకు ఎంపీ మాధవిని ఇన్‌చార్జిగా నియమించారు. దీనిపై స్థానిక నేతలు, కార్యకర్తలు తీవ్రఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆమె ఎక్కడకు వెళ్లినా నిరసనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో మాధవిని మార్చి మత్స్యలింగాన్ని ప్రకటించారు. మరి మాధవికి అరకు లోక్‌సభ స్థానం కేటాయిస్తారో.. లేక మొండిచేయి చూపుతారో చూడాల్సి ఉంది.

కాపుల పట్ల సీఎం జగన్ వైఖరి సరైంది కాదు

» సీఎంకు కాపు జేఏసీ నేతల బహిరంగ లేఖ

విజయవాడ, జనవరి 30: కాపులను వర్గశత్రువులుగా భావిస్తూ సీఎం జగన్ అనుసరిస్తున్న విధానం సరైందికాదని కాపు జేఏసీ పేర్కొంది. సీఎంకు జేఏసీ నేతలు రాసిన బహిరంగ లేఖను మంగళవారం విజయవాడలో విడుదల చేశారు. 'గత ఐదేళ్లలో కాపుల ప్రయోజనాలను కాపాడేందుకు జగన్ సర్కారు కనీస చర్యలు తీసుకోకపోగా, వారి ప్రయోజనాలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నార'ని లేఖలో పేర్కొన్నట్లు నేతలు రావి శ్రీనివాస్, గిద్దా శ్రీనివాసనాయుడు, బేతు రామ్మోహన్‌రావు తెలిపారు.

'సాక్షి'లో 70% వాటా జగన్ కుటుంబానిదే

» లక్షతో ప్రారంభమైన కంపెనీ నేడు 4,475 కోట్లకు

» సాక్షి వాటాల దగ్గరే జగన్, షర్మిల మధ్య యుద్ధం

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం



నెల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తనకు మీడియా మద్దతు లేదంటూ బహిరంగ సభల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దీన పలుకులు పలుకుతున్నారని, కానీ.. సాక్షి పత్రిక, టీవీలో ఆయన కుటుంబానికి 70శాతం వాటా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. సాక్షి పత్రిక, టీవీ ముమ్మాటికీ ఆయనవేనని స్పష్టం చేశారు. సాక్షితో తనకు సంబంధం లేదని మాట్లాడుతున్న జగన్‌కు తన సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుమార్తెలు వైఎస్ హర్షిణి, వైఎస్ వర్ష, బావమరిది ఈసీ దినేశ్‌రెడ్డితో కూడా సంబంధం లేదా...? అని ప్రశ్నించారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆనం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. '14-11-2006న 'సాక్షి' పేపర్‌ను స్థాపించారు. రూ.లక్ష పెట్టుబడితో ప్రారంభమైన సాక్షి పేపర్, సాక్షి టీవీలో మొదట ముగ్గురు డైరెక్టర్లు ఉన్నారు. వారిలో ఒకరైన విజయసాయి రెడ్డి 21-06-2007న వైదొలగగానే ఆయన స్థానంలో జగన్ డైరెక్టర్‌గా చేరారు. 01-02-2011 వరకు ఆయన కొనసాగగా ఆ తర్వాత ఆ స్థానంలో భారతీరెడ్డి చేరారు. అయినా సాక్షితో జగన్‌కు సంబంధం లేదట' అని ఆనం మండిపడ్డారు. '2019 ఎన్నికల నాటికి సాక్షి ఆదాయం రూ.51.82లక్షలు. 2022 నాటికి అది రూ.90.05కోట్లకు పెరిగింది. వైసీపీ ప్రభుత్వంలో సాక్షికి అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా దోచిపెట్టారు. జగతి పబ్లికేషన్స్‌లో 10.65 కోట్ల షేర్లను 2012లో రూ.350 ప్రీమియానికి అమ్మారు. నేడు ఒక షేర్ విలువ రూ.420కు చేరుకుంది. అంటే మొత్తం జగతి పబ్లికేషన్స్ విలువ రూ.4,475 కోట్లకు చేరుకుంది. రూ.లక్షతో ప్రారంభమైన కంపెనీ 17ఏళ్లలో రూ.4,475 కోట్లకు పెరిగింది. టీడీపీ ప్రభుత్వం రాగానే ఈ కుంభకోణంపై సీఐడీ విచారణ జరిపిస్తాం. ఇదంతా అవినీతి సొమ్మే. దీనిలోనే షర్మిల కూడా వాటా అడుగుతోందంటే ఆ పాపిస్టి వాళ్లకు ఆమెకూ తేడా ఏమిటి..? ఇప్పుడు జగన్‌కు, షర్మిలకు మధ్య జరుగుతున్న యుద్ధానికి 'సాక్షి' వాటానే కారణం' అని ఆనం వెల్లడించారు.

ఉమ్మడి చిత్తూరులో.. టీడీపీ దూకుడు!

మెజారిటీ సీట్లలో అభ్యర్థుల ఖరారు

» తిరుపతిలో ముందంజలో విజయకుమార్, బాలసుబ్రమణ్యం

» దీనితోపాటు మదనపల్లెపై మిత్రపక్షం జనసేన కన్ను

» చిత్తూరు బరిలో ఎక్కువ ఆశావహులు

» తిరుపతి ఎంపీ స్థానంలో మాజీ ఐఏఎస్ రత్నప్రభ కుమార్తె!

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన అభ్యర్థుల ఖరారుకు టీడీపీ వేగం పెంచింది. ఈ జిల్లాలో మెజారిటీ సీట్లలో ఆ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసింది. ఐదు సీట్లపై మాత్రం ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. పొత్తులో జనసేన పార్టీకి ఏ సీట్లు వెళ్తాయన్నదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా కావడంతో అభ్యర్థులపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 సీట్లు ఉండగా ఇందులో 8సీట్లలో అభ్యర్థులు ఇప్పటికే ఖరారయ్యారు. అధికారికంగా ప్రకటించకపోయినా ఆ సీట్లలో పోటీ చేసేది వారేనని అంతర్గతంగా ఆ పార్టీ వర్గాలు స్పష్టత ఇస్తున్నాయి. ఈసారి కూడా కుప్పంలో చంద్రబాబే పోటీ చేయబోతున్నారు. పీలేరులో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, పలమనేరులో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి, నగరిలో గాలి భానుప్రకాశ్, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరిలో పులివర్తి నాని, గంగాధర నెల్లూరు(ఎస్సీ)లో డాక్టర్ థామస్, పూతలపట్టు(ఎస్సీ)లో మురళీమోహన్ అభ్యర్థిత్వాలు ఖరారైనట్లేనని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వీరిలో సుధీర్‌రెడ్డిపై కొంత అసమ్మతి ఉన్నా బొజ్జల కుటుంబం మొదటి నుంచీ పార్టీలో ఉండడంతో ఆయనకు పార్టీ నాయకత్వం పచ్చ జెండా ఊపింది. పుంగనూరు కోసం బీసీ నేత రామచంద్ర యాదవ్ గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అవి ఎంతవరకు సత్ఫలితమిస్తాయో చూడాలి.

తిరుపతికి గట్టి పోటీ

తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, సత్యవేడు (ఎస్సీ) నియోజకవర్గాలపై టీడీపీ నాయకత్వం నిర్ణయానికి రావాల్సి ఉంది. ఇందులో మదనపల్లె, తిరుపతి స్థానాలను మిత్రపక్షం జనసేన ఆశిస్తోంది. తిరుపతిలో టీడీపీ నుంచి ఊకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆమె మనవరాలు కీర్తి, పార్టీనేత కోడూరి బాలసుబ్రమణ్యం రేసులో ఉన్నారు. ప్రస్తుతం విజయ్‌కుమార్, బాలసుబ్రమణ్యం రేసులో ముందంజలో ఉన్నారు. తనకు కాని పక్షంలో తన మనవరాలికి అవకాశం ఇవ్వాలని సుగుణమ్మ కోరుతున్నా సర్వేల్లో సానుకూలత రాకపోవడంతో నాయకత్వం ఆసక్తి చూపడం లేదు. ఈ స్థానాన్ని జనసేన కోరితే ఇచ్చే అవకాశాలున్నాయి. చిత్తూరులో టీడీపీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య చాలానే ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి గురజాల జగన్మోహన్, జడ్పీ మాజీ చైర్మన్ చంద్రప్రకాశ్, మాజీ మేయర్ కఠారి హేమలత, మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడి కుటుంబానికి చెందిన తేజస్విని, శ్రీనివాస్, పార్టీ నేత బాలాజీ, విద్యాసంస్థల నిర్వాహకుడు రాజన్ తదితరులు పరిశీలనలో ఉన్నారు. టీడీపీలో లేకపోయినా మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి లావణ్య పేరును కూడా ఆ పార్టీ పరిశీలిస్తోంది. పార్టీ అంతర్గత సర్వేలో గురజాల జగన్మోహన్ ముందు వరుసలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నియోజకవర్గంపై ఇంకా కసరత్తు జరుగుతోంది. మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే, మైనారిటీ నేత షాజహాన్‌వైపు నాయకత్వం మొగ్గుతోంది. ఇంకొందరు నేతలు మరో మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి పేరును ప్రతిపాదించారు. జనసేన కూడా ఈ సీటు కోసం గట్టి ప్రయత్నాల్లో ఉంది. తంబళ్లపల్లెలో టీడీపీ కసరత్తు కొలిక్కి రాలేదు. మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శంకర్ యాదవ్, పార్టీ నేత సైకం జయచంద్రారెడ్డి పోటీపడుతున్నారు. శంకర్ యాదవ్ స్థానికంగా అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు రావడంతో ప్రవీణ్‌రెడ్డివైపు నాయకత్వం మొగ్గుచూపుతోంది. ఆయనకే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. సత్యవేడు రేసులో మాజీ ఎమ్మెల్యే రత్నవేల్ గాంధీ మేనకోడలు చందన స్రవంతి, రిటైర్డ్ అధికారి పనబాక కృష్ణయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తిరుగుబాటు చేసిన వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా తాజాగా టీడీపీ పరిశీలనలోకి వచ్చారు.



ఎంపీ స్థానాల్లో..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 3 ఎంపీ సీట్లు ఉన్నాయి. వీటిలో చిత్తూరు, తిరుపతి ఎస్సీ వర్గాలకు రిజర్వు అయ్యాయి. అన్నమయ్య జిల్లా రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలోని 4 అసెంబ్లీ సెగ్మెంట్లు.. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు.. ఉమ్మడి చిత్తూరులోవే. తిరుపతి ఎంపీ స్థానానికి అంగలకుర్తి నీహారికవైపు టీడీపీ నాయకత్వం మొగ్గు చూపుతోంది. ఈమె కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసి రిటైరైన ఐఏఎస్ అధికారిణి రత్నప్రభ కుమార్తె. తండ్రి విద్యాసాగర్ కూడా రిటైర్డ్ ఐఏఎస్ అధికారే. నీహారిక కుటుంబం బాపట్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్నా టీడీపీ నాయకత్వం తిరుపతిలోనే నిలపాలని భావిస్తోంది. ఆమె మామ తలారి మనోహర్ చిత్తూరు జిల్లాలో గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆమె కాని పక్షంలో ప్రత్యామ్నాయంగా చందన స్రవంతి, రమేశ్‌బాబు పేర్లు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. చిత్తూరు ఎంపీ సీటుకు తలారి ఆదిత్య, వెటర్నరీ వైద్యుడు యశ్వంత్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి హరిప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. తిరుపతిలో నీహారికకు అవకాశం వస్తే చిత్తూరులో ఆదిత్యకు రాకపోవచ్చని అంటున్నారు. ఆమె ఆదిత్య తమ్ముడి భార్య. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినందున రెండు టికెట్లు ఇవ్వకపోవచ్చని అంటున్నారు.



లోకేశ్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు

లోకేశ్‌ను కలిసిన ఆదిమూలం

» టీడీపీలో చేరనున్న సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే

తిరుపతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ కుట్ర రాజకీయాలతో మరో దళిత ఎమ్మెల్యే ఆ పార్టీని వీడనున్నారు. సత్యవేడు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ టికెట్‌ను నిరాకరిస్తూ తిరుపతి ఎంపీ స్థానానికి బదిలీ చేయడంపై ఆగ్రహిస్తూ, మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు చేసిన తిరుపతి జిల్లా సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. తన తనయుడు, నారాయణవనం మండల జడ్పీటీసీ సుమన్‌తో కలిసి మంగళవారం ఆయన హైదరాబాద్‌లో లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆ సందర్భంగా వైసీపీలో తాను ఎదుర్కొన్న అవమానాలు, కష్టనష్టాలు వివరించినట్లు తెలిసింది. పార్టీ నుంచీ ఏమీ ఆశించకుండా బేషరతుగా టీడీపీకి మద్దతు తెలిపినట్టు సమాచారం. కాగా, సత్యవేడు అసెంబ్లీ నుంచీ పోటీ చేసే అవకాశం లేదని వైసీపీ అధిష్ఠానం తేల్చి చెప్పిన రోజు నుంచే ఆదిమూలం తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనయ్యారు. దీంతో అప్పుడే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే.. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ నాయుడును సంప్రదించినట్టు సమాచారం. టీడీపీకి ఎన్నికల వ్యూహాలు రూపొందిస్తున్న రాబిన్‌శర్మ బృందానికి సమాచారం అందడంతో వారు రంగప్రవేశం చేసి ఆదిమూలాన్ని హైదరాబాద్‌లో లోకేశ్‌తో భేటీ ఏర్పాటు చేసినట్టు సమాచారం. వైసీపీలో కీలక నేతల నుంచీ వేధింపులు, మానసిక క్షోభకు గురైన ఆదిమూలం పట్ల లోకేశ్ సానుభూతి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అక్రమాలకు ఫలితం అనుభవిస్తావు

'నీ ఎంపీ టికెట్‌ను తిరస్కరిస్తున్నా.. దళిత నాయకుడిని.. ఉద్యమ స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాను తప్ప దోచుకోవడానికి, దాచుకోవడానికి రాలేదు.. కుట్ర, మోసం మానుకో.. ఇది నీకు మంచిది కాదు.. నీ అక్రమాలకు తగిన ఫలితం అనుభవిస్తావు' అంటూ తిరుపతి జిల్లా సత్యవేడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మరోసారి ధ్వజమెత్తారు. మంగళవారం హైదరాబాద్‌లో లోకేశ్‌ను కలిసిన అనంతరం ఆయన సెల్ఫీ వీడియో మీడియాకు విడుదల చేశారు. మంత్రిని నమ్ముకున్నందుకు మోసం చేశాడని ఆరోపించారు. తనకు ఎంపీ టికెట్ వద్దని, ప్రశాంత వాతావరణంలో బతకాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. కాగా, అధిష్ఠానాన్ని ధిక్కరించి, మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు చేసిన వైసీపీ దళిత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్ల ఆ పార్టీ శ్రేణులు అమానుషంగా వ్యవహరించాయి. హైదరాబాద్‌లో లోకేశ్‌ను కలవడం పట్ల ఆగ్రహించాయి. సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను, చిత్రపటాలను తగులబెట్టాయి. పిచ్చాటూరులోను, వైసీపీ కార్యాలయం వద్ద, హైవేపైనా ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను తగులబెట్టారు. అయితే, దళిత ఎమ్మెల్యే పట్ల అధికార పార్టీ శ్రేణులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది.

ఒంగోలు ఎంపీ టికెట్.. మాగుంటకు ఇవ్వాల్సిందే!

» కాదని చెవిరెడ్డికి ఇస్తే సహకరించేది లేదు: బాలినేని

» రంగంలోకి సజ్జల, సాయిరెడ్డి

» సీఎంను కలవాలని సూచన

» అంగీకరించని మాజీ మంత్రి

» టీడీపీ నాయకత్వంతో మాగుంట సంప్రదింపులు?

» నేడు అనుచరులతో ఎమ్మెల్యే మద్దిశెట్టి ప్రత్యేక భేటీ

(ఒంగోలు/అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రకాశం జిల్లా అధికార వైసీపీలో ముసలం ముదిరింది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా సీఎం జగన్ ఖరారు చేయడంపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఒంగోలు లోక్‌సభ టికెట్ సిటింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ స్థానంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నిలబెడితే సహకరించే ప్రసక్తేలేదని కరాఖండీగా చెప్పేశారు. ఇక జగన్‌ను కలిసేది లేదని కూడా తెలిపారు. దీంతో ఆయన్ను సముదాయించేందుకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి రంగంలోకి దిగారు. ఆయనతో మంతనాలు జరిపినా లాభం లేకపోయింది. అటు జగన్ ఉద్దేశం స్పష్టం కావడంతో మాగుంట ప్రత్యామ్నాయం వైపు వేగంగా పావులు కదుపుతున్నారని.. టీడీపీ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. ఈ పరిణామాలు ప్రకాశం జిల్లా వైసీపీ శ్రేణులను కలవరపరుస్తున్నాయి.

ఎంత చెప్పినా శాంతించని బాలినేని..

మాగుంటకు టికెట్ ఇవ్వనని గతంలోనే చెప్పిన జగన్.. ప్రత్యామ్నాయంగా జిల్లాకు చెందిన కొందరు నాయకులతోపాటు చెవిరెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సంకేతాలిచ్చారు. దీనిపై మాట్లాడేందుకు బాలినేనిని విజయవాడ పిలిపించారు. అయితే మంగళవారం ఉదయం విజయసాయిరెడ్డి ఆయనకు ఫోన్ చేసి.. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డిని సీఎం ఖరారు చేశారని చెప్పారు. అంతేగాక తన పరిధిలో ఉన్న కొత్త ప్రకాశం జిల్లా, అలాగే నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగిస్తున్నారని తెలిపారు. దీంతో బాలినేని ఒక్కసారిగా మండిపడ్డారు. మాగుంటకు కానిపక్షంలో జిల్లాలో మరెవరికైనా అవకాశం ఇవ్వాలని తాము కోరుతుంటే.. జిల్లాలో ఎవరినీ సంప్రదించకుండా చెవిరెడ్డిని ఖరారుచేయడాన్ని ఆక్షేపించారు. పైగా పార్టీ బాధ్యతలు కూడా అప్పగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని చెప్పారు. బాలినేని తిరిగి హైదరాబాద్ వెళ్తున్నారని తెలియడంతో మధ్యాహ్నం తర్వాత సజ్జల.. ఆయన బస చేసిన హోటల్‌కు వెళ్లి చర్చించారు. ఒకసారి సీఎంను కలవాలని సూచించగా.. 'ఇంక కలిసేందుకు ఏముంది? ఒంగోలులో నివాసస్థల పట్టాల కోసం నిధులు ఇచ్చినందుకు ధన్యవాదాలు.. ఇక పార్టీ వ్యవహారాలు పట్టించుకోను' అని తేల్చిచెప్పినట్లు తెలిసింది. సజ్జల బయటకు వెళ్లేటప్పుడు మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మా పార్టీ వ్యవహారాలు మీకెందుకంటూ కసురుకుంటూ వెళ్లిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. తర్వాత బాలినేని అదే హోటల్లో తన కుటుంబ సభ్యులు, అక్కడికొచ్చిన ముఖ్య అనుచరులతో సమాలోచనలు సాగించారు.

రాజీనామా చేస్తానని ఎవరితోనూ చెప్పలేదు

'ఆంధ్రజ్యోతి'తో బాలినేని

బాలినేనితో విజయసాయి, సజ్జల మంత్రాంగం ఫలించలేదని, ఆయన వైసీపీకి గుడ్‌బై చెబుతున్నట్లు జోరుగా ప్రచారం సాగింది. దీనిపై ఆయన్ను మంగళవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. తాను పార్టీకి రాజీనామా చేస్తానని ఎవరితోనూ చెప్పలేదన్నారు. రాజీనామా చేశానంటూ వస్తున్న ప్రచారంలో నిజం లేదని.. ఒంగోలు లోక్‌సభ టికెట్ మాగుంటకే ఇవ్వాలన్న డిమాండ్‌పై పునరాలోచనా లేదని స్పష్టం చేశారు. చెవిరెడ్డిని నిలబెడితే సహకరించనని విజయసాయి, సజ్జలకు స్పష్టం చేశానని బాలినేని చెప్పారు.

అనుచరులతో మద్దిశెట్టి సమావేశం

మరోవైపు ఒంగోలు లోక్‌సభ టికెట్ ఆశించిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. ఆయన్ను దర్శి నుంచి తప్పించి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మర్యాద కోసం కూడా మద్దిశెట్టిని బూచేపల్లి కలవలేదు. పైగా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి ఒకరిద్దరు మద్దిశెట్టి అనుచరులతో మంతనాలు చేస్తున్నారు. దర్శి నుంచి తప్పించినందున ప్రత్యామ్నాయంగా తనకు ఒంగోలు లోక్‌సభ టికెట్ ఇవ్వాలని సీఎంను మద్దిశెట్టి కోరగా.. అంగీకరించలేదు. మంగళవారం చెవిరెడ్డి పేరును ఖరారు చేయడంతో మద్దిశెట్టి కూడా తన రాజకీయ భవిష్యత్‌పై దృష్టిసారించారు. తన అనుచరులతో దర్శిలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. వారి అభిప్రాయాలు విన్నాక తుది నిర్ణయం ప్రకటిస్తారని తెలుస్తోంది. వైసీపీలో ఉన్నా లేకపోయినా.. దర్శిలో పార్టీ అభ్యర్థిని ఓడించాలన్న ఉద్దేశంతోనే ఆయన ఈ భేటీ తలపెట్టినట్లు సమాచారం.

టీడీపీతో టచ్‌లోకి మాగుంట!

మాగుంటను కాదని చెవిరెడ్డి పేరును సీఎం ఖరారుచేశారని తెలియగానే.. ఎంపీ అనుచరులు భగ్గుమన్నారు. ఒంగోలు, కొండపి, కనిగిరి, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లోని అనుచర గణం ఎక్కడికక్కడ సమావేశమయ్యారు. ఇప్పటికే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వారు ఆయనకు ఫోన్ చేసి రాజకీయ భవితవ్యంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని, ఏ నిర్ణయం తీసుకున్నా వెంటే ఉంటామని భరోసా ఇచ్చారు. ఒంగోలు టికెట్‌పై జగన్ నిర్ణయం ప్రకటించాక తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన మాగుంట.. తాజా పరిణామాలతో ఇక వేచిచూడడం అనవసరమన్న అభిప్రాయానికి వచ్చారు. ఇప్పటికే టీడీపీ అగ్ర నాయకత్వంతో టచ్‌లో ఉన్న ఆయన.. పోటీపై చర్చించారు. ఎన్నికల బరిలో తాను, ఆయన కుమారుడు రాఘవరెడ్డిల్లో ఒకరే ఉండాలా.. ఇద్దరం చెరో స్థానంలో పోటీచేయాలా అన్న అంశంపై స్పష్టత తీసుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం జిల్లాలో వైసీపీకి గట్టి షాకే ఇస్తుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

దివ్యాంగులు కోరితే ఇంటివద్దే ఓటు

- ఫారం 12-డి ద్వారా 'హోమ్ ఓటింగ్'
- దివ్యాంగ, నిండు గర్భిణి, బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు
- సీఈవో ముఖేష్ కుమార్ మీనా



ఎన్‌జీవో ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో ఎంకే మీనా

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 2024 సార్వత్రిక ఎన్నికలు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని, వారు కోరితే ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. 'అందరికీ అందుబాటులో ఎన్నికలు' అనే అంశంపై మీనా మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే దివ్యాంగులు బీఎల్‌వో ద్వారా ఆర్వోకు ఫారం 12-డి సమర్పించాలన్సి ఉంటుందన్నారు. దివ్యాంగ ఉద్యోగులు, నిండు గర్భిణి, బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వనున్నామని మీనా తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రబాబు, రాష్ట్ర బధిర సంఘ

424 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి):వైద్య ఆరోగ్యశాఖలోని డీఎంఈ పరిధిలో మెడికల్ కాలేజీల్లో 424 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్, లేటరల్ ఎంట్రీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్లు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు.

వేలిముద్రలు రిజిస్టర్లో తీసుకోవద్దు

- సబ్ రిజిస్ట్రార్లకు ప్రభుత్వం ఆదేశం

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కార్ కొత్తగా జిరాక్సు రిజిస్ట్రేషన్ల విధానం అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత అటు ప్రజలు, ఇటు ఆ శాఖ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాత రిజిస్ట్రేషన్ల విధానంలో.. ఆయా పార్టీల వేలిముద్రలు రిజిస్టర్లలో నమోదు చేసేవారు. కొత్త విధానంలో వేలిముద్రలను ఆధార్ వెబ్‌సైట్ ద్వారా అనుసంధానించి సరిపోల్చి చూడాలని చెబుతున్నారు. అయితే ఆధార్ వెబ్‌సైట్ సరిగ్గా ఓపెన్ అవ్వకపోవడంతో చాలా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో, రిజిస్ట్రేషన్‌దారుల వేలిముద్రలను పాత విధానంలో రిజిస్టర్లలో ఫిజికల్‌గా నమోదు చేస్తున్నారు.

నేడు ఐఆర్ఆర్ పీటీ వారెంట్‌పై విచారణ

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు జరిగాయని సీఐడీ జారీచేసిన పీటీ వారెంట్‌పై విచారణను ఏసీబీ కోర్టు బుధవారానికి వాయిదావేసింది. చంద్రబాబుకు స్కిల్ కేసులో రెగ్యులర్ బెయిల్ వచ్చినందున ఈ పీటీ వారెంట్ నిరర్థకమవుతుందని భావించారు. ఇదే విషయాన్ని న్యాయాధికారి హిమబిందు సీఐడీ తరఫున న్యాయవాదులకు చెప్పారు. బెయిల్ రద్దు చేయాలని తాము సుప్రీంను ఆశ్రయిస్తున్నామని, అప్పటివరకు ఈ పీటీ వారెంట్‌ను మనుగడలో ఉంచాలని వారు అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసినందున పీటీవారెంట్‌పై ఏసీబీ కోర్టు బుధవారం నిర్ణయాన్ని వెలువరించనుంది. అదేవిధంగా ఫైబర్ నెట్ కేసులో దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను వచ్చే నెల 22వ తేదీకి వాయిదా వేసింది.



విజయవాడలో జరిగిన ధర్నాకు భారీగా హాజరైన యానిమేటర్లు

కదం తొక్కిన యానిమేటర్లు

సమస్యల పరిష్కారానికి డిమాండ్

విజయవాడ, జనవరి 30: గ్రామస్థాయిలో పొదుపు సంఘాల కోసం పని చేస్తున్న వెలుగు వీఓఏ (యానిమేటర్లు)లు తమ సమస్యల పరిష్కారానికి కదంతొక్కారు. ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో మంగళవారం నిర్వహించిన 36 గంటల మహాధర్నాలో అధిక సంఖ్యలో వీఓఏలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, డ్వాక్రా సంఘాలకు రూ.20 లక్షల వరకు వడ్డీ రాయితీ ఇవ్వాలని నినదించారు. ఈ మహాధర్నాను ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడుతూ కాల పరిమితి సర్క్యులర్ అమలు చేస్తే 28 వేల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి కార్మికులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీపీఐ, సీపీయం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఫణి రాజ్, ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

మారణాయుధాలతో

'మైనింగ్' సోదాలు!

(మొదటి పేజీ తరువాయి)

వెంటేసుకు రావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఉదయాన్నే రెండు బృందాలుగా రాక..

మైనింగ్, విజిలెన్స్ ప్రత్యేక బృందాల పేరిట రెండు బృందాలుగా 12 మంది సిబ్బందితో ఇద్దరు అధికారులు మంగళవారం ఉదయాన్నే బల్లికురవ, మార్టూరు మండలాలకు చేరుకున్నారు. బల్లికురవ మండలం వేమవరంలోని హరగాయత్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో మచిలీపట్నం మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి నలుగురు సిబ్బందితో కలిసి తనిఖీలకు వచ్చారు. ఈ ఫ్యాక్టరీ టీడీపీ నేత కోటపాటి సురేష్‌ది. ఈయన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుడు. అలాగే, నెల్లూరు మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్ తన బృందంతో మార్టూరులోని నాగరాజుపల్లిరోడ్డులో ఉన్న టీడీపీ నేత కామినేని జనార్థన్‌కు చెందిన అనంత గ్రానైట్ ఫ్యాక్టరీలో సోదాలకు వచ్చారు. జనార్థన్ కూడా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుడే. టీడీపీ మద్దతుదారుల ఫ్యాక్టరీలే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నారన్న సమాచారంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మార్టూరులోని అనంత గ్రానైట్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్‌ను అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవనే సమాధానం వచ్చింది. దీంతో రాత పూర్వక ఉత్తర్వులు లేకుండా పొరుగు జిల్లా నుంచి తనిఖీలకు ఎలా వచ్చారని ఎమ్మెల్యే నిలదీశారు. ఇదే సమయంలో మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి కూడా వాహనంలో అక్కడకు చేరుకున్నారు. ఆ వాహనాన్ని వైసీపీ నాయకుడు కోరుకొండ శ్రీనివాస్ నడపడం గమనార్హం. కోరుకొండ శ్రీనివాస్‌తోపాటు వైసీపీ గూండాలు ఒక దశలో ఎమ్మెల్యేపై దాడికి యత్నించగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఇతనెవరని కోరుకొండ శ్రీనివాస్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే నిలదీయగా ఏడీ నీళ్లు నమిలారు. వారు వచ్చిన వాహనాన్ని తనిఖీ చేయగా అందులో కర్రలు, కత్తులు, కారంపొడి ప్యాకెట్లు కూడా లభించడంతో అక్కడున్న వారంతా నివ్వెరపోయారు. నంబర్ ప్లేట్ కూడా సరిగా లేని వాహనాల్లో తనిఖీలకు రావడం చూస్తుంటే వీరు అసలు అధికారులేనా అని ఎమ్మెల్యే అనుమానం వ్యక్తం చేశారు.



మైనింగ్ అధికారుల వాహనంలో లభించిన కారంపొడి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

12 యూనిట్లలో తనిఖీకి వ్యూహం..

ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగానే ప్రభుత్వ పెద్దలు ఈ దాడులకు ఉసిగొల్పారని తెలుస్తోంది. రెండు బృందాలతో మొత్తం 12 ఫ్యాక్టరీలలో సోదాలతో భయభ్రాంతులకు గురిచేయాలనేది వ్యూహంగా అనుమానిస్తున్నారు. ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని అధికారులను నిలదీయడం, వైసీపీ నేతలు వెంట వచ్చినట్టు బట్టబయలవడంతో అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు. ప్రైవేటు వైసీపీ సైన్యాన్ని వెంటపెట్టుకుని అధికారులు తనిఖీలకు వెళ్లడం చర్చనీయాంశమైంది. రౌడీమూకను వెంటపెట్టుకుని సోదాలకు అధికారులు వెళ్లిన ఉదంతం గతంలో ఎప్పుడూ చూడలేదని ప్రస్తుతం ఆగీత కూడా చెరిపేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

వైసీపీ బడా నేతల బినామీ శ్రీనివాస్..

కోరుకొండ శ్రీనివాస్ వైసీపీ బడా నేతలకు బినామీగా వ్యవహరిస్తాడని సమాచారం. గనుల శాఖ డైరెక్టర్‌కు నమ్మినబంటని, మైనింగ్ మాఫియాను నడపడంలో సిద్ధహస్తుడని చెబుతున్నారు. మచిలీపట్నం మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డికి అతను బినామీ అని, ఆయనకు షాడోగా వ్యవహరిస్తాడని చెబుతున్నారు. ఇతని స్వస్థలం వైజాగ్ అని, వైసీపీలో రాష్ట్రస్థాయి పదవిలో ఉండడంతో పాటు ఎంపీ విజయసాయిరెడ్డితో కలిసి ఉన్న ఫొటోలు కూడా మంగళవారం వెలుగులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ, ఎంపీ మోపిదేవి వెంకటరమణ, మాజీ హోంమంత్రి సుచరితతోనూ కోరుకొండ శ్రీనివాస్ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.

ఎమ్మెల్యేతోపాటు మరో ఏడుగురిపై కేసులు

తమ విధులకు ఆటంకం కలిగించారంటూ నెల్లూరు మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, ఏడీ ప్రతాప్‌రెడ్డితో పాటు వైసీపీ నేత కోరుకొండ శ్రీనివాస్‌పై గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఇచ్చిన ఫిర్యాదును తీసుకోడానికి పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో బాధితులనే పోలీసులు నిందితులుగా చేర్చారని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు విమర్శించారు.



రేపో ఎల్లుండో బాబు-పవన్ భేటీ

- సీట్లు, అభ్యర్థులపై కసరత్తుకే!
- మళ్లీ 4 నుంచి చంద్రబాబు పర్యటనలు
- అదే రోజు నుంచి జనసేనాని కూడా!

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 2-3 రోజుల్లో మరోసారి భేటీ కాబోతున్నారు. సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపనున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ హైదరాబాద్‌లోనే ఉన్నారు. గతంలో వారి మధ్య ఈ అంశాలపై కొంతమేర చర్చలు జరిగాయి. పొత్తులో భాగంగా జనసేన ఆశిస్తున్న సీట్లు, వాటిలో ఇవ్వడానికి టీడీపీ సుముఖంగా ఉన్న స్థానాలపై స్థూలంగా అవగాహనకు వచ్చారు. వాటిలో రాజానగరం, రాజోలు సీట్లను పవన్ 26న ప్రకటించారు. మిగిలిన స్థానాలపై చర్చలు కొనసాగుతాయని ఆయా పార్టీల వర్గాలు తెలిపాయి. అంతర్గత సర్వేల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని సీట్ల సర్దుబాటు చేసుకోవాలన్న ఆలోచనలో టీడీపీ నాయకత్వం ఉన్నట్లు సమాచారం. మంచి అభ్యర్థులు ఉన్న చోట పరస్పరం సర్దుబాటు ధోరణిలో వెళ్లాలన్న ఆలోచనలో ఉందని చెబుతున్నారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక కసరత్తును కొలిక్కి తెచ్చేందుకు చంద్రబాబు తన బహిరంగ సభలకు కొంత విరామం ఇచ్చారు. సోమవారం వరకూ ఆయన సభలు జరిగాయి. ఇప్పుడు ఒక వారం విరామం ఇచ్చి ఫిబ్రవరి నాలుగో తేదీ తర్వాత ఆయన తిరిగి పర్యటనలకు బయల్దేరతారని టీడీపీ వర్గాలు తెలిపాయి. పవన్ కూడా 4 నుంచే రాష్ట్ర పర్యటన ప్రారంభించే యోచనలో ఉన్నారు. ఈ రెండు పార్టీలు ఉమ్మడి మేనిఫెస్టోను కూడా ఖరారు చేసే ప్రయత్నంలో ఉన్నాయి. ఫిబ్రవరిలో ఏదో ఒక బహిరంగ సభలో దీనిని విడుదల చేసే అవకాశం ఉంది



సమస్యల పరిష్కారానికి సహకరించాలంటూ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

చెల్లని ఆరోగ్యశ్రీ కార్డు!

- జగన్ బొమ్మ చూసి ఆస్పత్రిలోనికే రానివ్వటం లేదు
- విజయ సంకల్ప సభలో బీజేపీ చీఫ్ పురందేశ్వరి నిప్పులు

గుంటూరు సిటీ, జనవరి 30 : ముఖ్యమంత్రి జగన్ బొమ్మ ముద్రించిన ఆరోగ్యశ్రీ కార్డు చూసి రోగులను ఆసుపత్రిలోనికి కూడా రానివ్వడం లేదని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎద్దేవా చేశారు. ఆరోగ్యశ్రీ సేవలపై ఆసుపత్రులు చేతులెత్తేశాయన్నారు. మంగళవారం గుంటూరు హిందూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప సభలో పాల్గొన్న ఆమె.. జగన్ అసమర్థ పాలనపై నిప్పులు చెరిగారు. జగన్ రాష్ట్రాన్ని తలలేని మొండెంలా చేసి, మూడు ముక్కలాటతో రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. గడువు దాటినా పోలవరం ప్రాజెక్టు ఇంకా పూర్తి కాని పాపం వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. నిర్వాసిత కుటుంబాల సంఖ్య తేలిస్తే పరిహారం ఇస్తామని కేంద్రం చెబుతున్నా రాష్ట్రం లెక్కలు తేల్చటం లేదని ఆరోపించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టు నిర్మాణ పనులను ఏడాది పాటు నిలిపివేసి, తమకు నచ్చిన కంపెనీకి ప్రాజెక్టును కట్టబెట్టారని దుయ్యబట్టారు. తాజాగా ప్రాజెక్టును సందర్శించిన పోలవరం అథారిటీ రాష్ట్రం ప్రాజెక్టు పనులు చేపట్టక పోతే తామే స్వాధీనం చేసుకుంటామని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం ప్యాకేజీ ఇస్తామన్నా నిధులు తీసుకునేందుకు జగన్ ప్రభుత్వం ముందుకు రాకపోవడం దారుణమని తెలిపారు. ప్రత్యేక హోదా బూచిగా చూపించి లబ్ధిపొందాలని చూస్తున్నారని పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలు చేసి ఆ పాపాన్ని కేంద్రం మీద నెట్టాలని చూడటం దారుణమన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యల్ని వైసీపీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి బీజేపీ మద్దతు కోరుతూ డీలర్లు మంగళవారం విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి వచ్చారు. తమకు ఏడున్నర వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.150 చొప్పున కమీషన్ చెల్లించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షురాలి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. డీలర్ల డిమాండ్లు పరిష్కరించాలంటూనే, ఉచితంగా కేంద్రం బియ్యం ఇస్తుంటే సరఫరా వాహనంపై ప్రధాని మోదీ ఫొటో లేకపోవడం ఏంటని జగన్ సర్కారును నిలదీశారు.

మళ్లీ రిటైర్మెంట్ రణం!

(మొదటి పేజీ తరువాయి)

ఆగిపోయింది. కానీ.. ఆ రెండేళ్ల గడువు 2024 జనవరి 31తో పూర్తవుతుంది. ఉద్యోగుల రిటైర్మెంట్లు బుధవారంతో ప్రారంభమవుతున్నాయి. రెండేళ్ల క్రితం రిటైరైన వారికే ఇంకా పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందలేదు. ఇప్పుడు తమ గతి ఏమవుతుందో అని తాజాగా రిటైర్ కాబోతున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

చంద్రబాబు హయాంలో ఇలా...

పాతిక నుంచి ముప్పై సంవత్సరాలపాటు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారు... రిటైర్‌మెంట్ తర్వాత పెన్షన్, గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం ఏమాత్రం సరి కాదని చంద్రబాబు సర్కారు భావించింది. రిటైరైన రోజే ఆ ఉద్యోగికి అందాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాల చెక్కులను చేతిలో పెట్టి, ప్రభుత్వ వాహనంలో సగౌరవంగా ఇంటి వద్ద దిగబెట్టి వచ్చేవారు. సాంకేతికంగా ఏదైనా అనుకోని జాప్యం జరిగిన సందర్భాల్లో మాత్రమే మూడునాలుగు రోజులు ఆలస్యమయ్యేది. జగన్ సీఎం అయ్యాక సీన్ పూర్తిగా మారిపోయింది. గౌరవ మర్యాదల మాట అటుంచితే, వారికి దక్కాల్సిన ప్రయోజనాల కోసం ఆర్థిక శాఖ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఏపీజీఎల్ఐ డబ్బులూ గోవిందా

ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు ప్రతి నెలా వారి జీతం నుంచి ఏపీజీఎల్ఐ కట్ చేస్తారు. ఇలా జమ అయిన డబ్బుకు కొంత వడ్డీ జోడించి ఆ ఉద్యోగి రిటైర్ అయ్యే రెండేళ్ల ముందు అందజేస్తారు. చంద్రబాబు హయాంలో తు.చ. తప్పకుండా ఈ నిబంధన పాటించారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు రిటైర్ అయిన రెండు మూడేళ్ల తర్వాత కూడా ఆ డబ్బు వారికి అందడం లేదు. ప్రస్తుతమైతే ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేస్తున్న ఏపీజీఎల్ఐ నిధులను ప్రభుత్వం ఏం చేస్తోంది, అసలు జమ చేస్తోందా లేదా అన్న అనుమానాలు ఉద్యోగులు లేవనెత్తుతున్నారు.

ఉద్యోగులకు రూ.31,800 కోట్లు

ఉద్యోగంలో ఉన్న వాళ్లకు జీతాలు ఇవ్వలేరు... రిటైరైన వాళ్లకు సంబంధిత ప్రయోజనాలు, పెన్షన్లూ ఇవ్వలేరు! ఇదీ... నేటి పరిస్థితి. అన్ని రకాల బకాయిలు కలిపి ఉద్యోగులకు ప్రభుత్వం సుమారు రూ.31,800 కోట్లు బాకీ పడింది. పీఆర్సీ ఎరియర్లు, డీఏ బకాయిలు రూ.18,000 కోట్లు... రెండు కొత్త డీఏల బకాయిలు రూ.7,300 కోట్లు, వైద్య బిల్లులు, ఈఎల్స్, ఏపీజీఎల్ఐ, సరెండరు లీవులు ఇతరత్రా పెండింగ్ రూ.2,800 కోట్లు, సీపీఎస్, జీపీఎఫ్ కంట్రిబ్యూషన్ బాకీ రూ.3,700 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఈఎల్స్ డబ్బులూ ఎగవేత...

ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదికి 15 ఈఎల్స్ ఉంటాయి. వాటిని వాడుకోకుండా రెండేళ్లకొకసారి 30 ఈఎల్స్ క్లెయిమ్ చేసి డబ్బు తీసుకునేవారు. కానీ... జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగులకు ఈఎల్స్ డబ్బు అందడం లేదు. ఆర్థిక శాఖ అధికారులను అడిగితే మీరు వాడుకున్నా, వాడుకోకుండా క్లెయిమ్ చేసుకున్నా డబ్బులైతే ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

సీఎస్ హామీకే దిక్కులేదు

డీఏ ఎరియర్లు 2023 సెప్టెంబరులోగా ఇచ్చేస్తామని సీఎస్ జవహర్ రెడ్డి ఉద్యోగులందరికీ రాతపూర్వక హామీ ఇచ్చారు. ఈ మేరు సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన రెండు డీఏ ఎరియర్ల బిల్లులు కూడా సీఎఫ్ఎంఎస్‌లో పెట్టారు. ఆ బిల్లులపై ఉద్యోగుల నుంచి ఆదాయపన్ను కూడా వసూలు చేశారు. తీరా ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఆ బిల్లులు రద్దు చేశారు. చెల్లించని బిల్లులకు ఆదాయపన్ను చెల్లించిన ఉద్యోగులు ఉసూరుమన్నారు.

ఐదేళ్లలో ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు

జగన్ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో ఉద్యోగులకు ఒక్క డీఏ డబ్బులు కూడా పూర్తిగా చెల్లించలేదు. 2018 జూలై నుంచి జూలై 2022 వరకు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల సగటున ఒక్కో ఉద్యోగికి రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లే. చంద్రబాబు హయాంలో చివరి రెండు డీఏలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అప్పుడు విపక్షంలో ఉన్న జగన్... దీనినే ఘోరం, నేరంగా అభివర్ణించారు. ఉద్యోగులను రెచ్చగొట్టారు. తాను అధికారంలోకి వస్తే డీఏలు టైమ్ ప్రకారం ఇస్తానని, ఉద్యోగులను గుండెల్లో పెట్టుకుంటానన్న జగన్ ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. అధికారంలోకి వచ్చాక... మాటలన్నీ మడతపెట్టేశారు.

వలస పక్షులతో వచ్చే లాభమేంటి?

(మొదటి పేజీ తరువాయి)

అటువైపు పోవడం లేదు. టీడీపీ పైనే దృష్టి కేంద్రీకరించి ఆ పార్టీ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి పావులు కదుపుతున్నారు.

ఇది మంచి సంస్కృతేనా?

ఆర్థికంగా బలంగా ఉన్న అధికార పక్షాన్ని ఢీకొట్టడానికి ప్రతిపక్ష పార్టీ కూడా అదే స్థాయి వనరులు ఉన్నవారి కోసం అన్వేషిస్తుండటం విదేశీ వలస పక్షులకు కలిసి వస్తోంది. కానీ వీరి వల్ల ఎంతవరకూ ఉపయోగం అన్న అంశం కూడా తెరపైకి వస్తోంది. "విదేశీ నేతలపై ఉన్న పెద్ద విమర్శ వారు అందుబాటులో ఉండరు. ఓడితే ఆ రోజే సర్దుకొని విదేశాలకు వెళ్లిపోతారు. గెలిచినా అంతగా అందుబాటులో ఉంటారా అన్నది సందేహం. వారి వ్యాపారాలన్నీ విదేశాల్లో ఉంటాయి. దానికి ఎక్కువ సమయం ఇవ్వాలి. ఒకవేళ పార్టీ ప్రతిపక్షంలో ఉంటే ఇక్కడ పార్టీ శ్రేణుల కష్టనష్టాల్లో ఆదుకోవడానికి ఎంతవరకూ సమయం ఇవ్వగలుగుతారన్నది పెద్ద సమస్య." అని ఒక మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

దేశంలోకి కాలు మోపకముందే సీటు

గుంటూరు లోక్‌సభ స్థానానికి ప్రవాసాంధ్ర ప్రముఖుడు పెమ్మసాని చంద్రశేఖర్‌కు టీడీపీ టికెట్టు ఖాయమని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన 2014లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ టికెట్ ఆశించారు. కానీ అప్పుడు ఆ అవకాశం మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావును వరించింది. చంద్రశేఖర్ ఆ తర్వాత టీడీపీ రాజకీయ కార్యకలాపాల్లో కనిపించలేదు. ఆయన మంగళవారం రాత్రే స్వదేశానికి చేరుకున్నారు.

విదేశీ వలస పక్షులకు పార్టీలకు ఇస్తున్న ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు ఇదే రుజువు. ప్రత్యామ్నాయంగా సరైన అభ్యర్థి లేనిచోట ప్రవాస నేతలను ఎంచుకోవచ్చునని, కానీ అన్ని వనరులు ఉండి స్థానికంగా మంచి సంబంధాలు ఉన్నచోట కూడా బయటి వారిని ఎంచుకోవడం ఎందుకన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు లోక్‌సభ స్థానంలో ఆర్థికంగా దీటైన స్థాయి ఉన్న అభ్యర్థులు భాష్యం రామకృష్ణ, భాష్యం ప్రవీణ్, కంచర్ల సుధాకర్ వంటివారు టీడీపీ రేసులో ఉన్నారు. అందుబాటులో ఉండే వీరిని వదిలి పెట్టి మరొక వైపు చూడటం సరికాదేమో అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

టికెట్ రాకపోతే మళ్లీ విదేశాలకే..

గత ఐదు ఎన్నికల నుంచి ప్రతి ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో ప్రవాస నేతలు టీడీపీ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నం చేసిన వారెవరూ ఎన్నికల తర్వాత మళ్లీ కనిపించడం లేదు. తాము నివాసం ఉంటున్న దేశాలకు వెళ్లిపోయి అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో ప్రవాస నేతలపై గురి కుదరడం లేదు. అక్కడక్కడా అరుదుగా ఒకరిద్దరు ప్రవాస నేతలు బాగా ముందుగానే రాష్ట్రానికి వచ్చి తమ కార్యక్షేత్రాన్ని ఎంచుకొని వివిధ రూపాల్లో పనిచేస్తూ పునాది నిర్మించుకొంటున్నారు. ఉదాహరణకు గుడివాడలో వెనిగళ్ల రాము్మోహన్ ఏడాదిన్నర ముందు నుంచే అక్కడ మకాం పెట్టి పనిచేస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద అర డజను మంది ప్రవాస నేతలు అసెంబ్లీ టికెట్ల కోసం, ముగ్గురు ఎంపీ టికెట్ల కోసం గట్టిప్రయత్నాల్లో ఉన్నారు.



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, తరగతి గదిలో బందీలుగా ఉన్న ఉపాధ్యాయులు

టీచర్లను గదిలో పెట్టి తాళం

- రెగ్యులర్ టీచర్లను నియమించాలని తల్లిదండ్రుల డిమాండ్

నూతిపాడు (విస్సన్నపేట), జనవరి 30: పాఠశాలకు రెగ్యులర్ టీచర్లను నియమించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యుటేషన్‌పై వచ్చిన ఇద్దరు టీచర్లను తరగతి గదిలో బంధించి.. పాఠశాల ఎదుట రోడ్డుపై కూర్చుని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు వెంటనే రెగ్యులర్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి శివారు నూతిపాడు ఎంపీయూపీ పాఠశాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కాగా, టీచర్లను తరగతి గదిలో బంధించిన విషయం తెలుసుకున్న తిరువూరు పోలీసులు వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎంఈవో-2 హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

22,302 కోట్లతో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు

- వివిధ జిల్లాల్లో ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదముద్ర

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇంధన రంగంలో రూ.22,302 కోట్ల పెట్టుబడులతో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం ఆమోదముద్ర వేసింది. జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాదాపు రూ.12,065 కోట్ల పెట్టుబడితో వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ వద్ద 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1,050 మెగావాట్లు, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ వద్ద 850 మెగావాట్లు కలిపి మొత్తం 3,350 మెగావాట్ల సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇదే సంస్థ ఆధ్వర్యంలో మరో రూ.1,287 కోట్ల పెట్టుబడితో నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద రెండు పవన ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

సరే .. ఫిబ్రవరి 8న విచారణకు రండి

- నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ ఆదేశం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద విచారణ నిమిత్తం వచ్చే నెల 8వ తేదీన హాజరు కావాలంటూ వైసీపీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవిని స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హతావేటు తమపై ఎందుకు వేయకూడదో వివరిస్తూ, ఆధారాలతో సహా నలుగురు ఎమ్మెల్యేలూ సోమవారం స్పీకర్ ఎదుట హాజరయ్యారు. లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు ప్రతిని స్పీకర్ కార్యాలయం మాకు అందించాలి. మేం అందించిన లిఖిత పూర్వక సమాధానాలు ముట్టినట్లుగా రశీదును ఇవ్వాల"ని తమ విచారణ సందర్భంగా స్పీకర్ తమ్మినేనిని కోరారు. అయితే.. అందుకు స్పీకర్ అంగీకరించలేదని మీడియాకు వివరించారు. తమకు మరింత గడువు కావాలని కోరినా స్పీకర్ అంగీకరించలేదని వెల్లడించారు. ఈక్రమంలో స్పీకరు నోటీసు జారీ చేశారు. సరే... ఫిబ్రవరి 8న మళ్లీ విచారణకు హాజరు కావాలని వారిని ఆ నోటీసులో కోరారు.


Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



పెద్దాసుపత్రికి గ్రహణం!

జిల్లాలోని పెద్దాసుపత్రికి గ్రహణం పట్టింది. వైద్యశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో ఆసుపత్రి నాణ్యతా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఏ భవనం చూసినా బీటలు వారిన గోడలు, కళావిహీనంగా మారిన గదులు కనిపిస్తున్నాయి. ఫర్నిచర్ సంగతైతే చెప్పనక్కర్లేదు. విరిగిన కుర్చీలు, పగిలిన అద్దాలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది. ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ప్రభుత్వాసుపత్రిలో అరకొర సౌకర్యాలతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోగుల్ని తరలించేందుకు ఉపయోగించే వీల్‌చైర్లు, క్యాజువాలిటీలో ఉపయోగించే బల్లలు తప్పుపట్టి విరిగిపోవడంతో వాటిని మూలన పడేశారు. కొత్తవి లేక పాతవి పనికిరాక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు పెద్దాసుపత్రిపై శ్రద్ధపెట్టి సమస్యలు పరిష్కరించాలని రోగులు, ఉద్యోగులు కోరుతున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి









ఉత్తమ సేవలందించిన వైద్యులు, వైద్యేతర సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

వైద్యరంగంలో సేవలు
అనిర్వచనీయం: కలెక్టర్

కృష్ణలంక, జనవరి 30: అనారోగ్యం, ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చేరిన రోగులకు వైద్య, వైద్యేతర సిబ్బంది అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని వారికి మరింతగా సేవలందించడం ద్వారా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉత్తమ సేవలందిస్తున్న వైద్యులు, వైద్యేతర సిబ్బందికి మంగళవారం కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు పొందేందుకు పేద బలహీన వర్గాల వారు ప్రభుత్వాసుపత్రిలో వస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రులను తీర్చిదిద్ది అత్యాధునిక మౌలిక వసతులతో పాటు వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలో వైద్యులు, సిబ్బంది అందించిన నిరుపమాన సేవలు నేటికీ ప్రజలు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వాసుపత్రి ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.వెంకటేష్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీ మార్గంలో పయనిద్దాం

అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ స్వాతంత్రాలను అందించిన జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో పయనించి ప్రజలకు సేవలందిద్దామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. మహాత్మాగాంధీ 76వ వర్ధంతి, అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రత్నకుమారికి తీవ్ర అస్వస్థత

- టీడీపీ నేతలు, ఎమ్మెల్యేల పరామర్శ

వన్‌టౌన్: దివంగత నేత వంగవీటి రంగా సతీమణి, మాజీ ఎమ్మెల్యే రత్నకుమారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమె ఈనెల 24న అస్వస్థతకుగురై గవర్నరుపేటలోని హెల్ప్ ఆసుపత్రిలో చేరారు. మంగళవారం విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నేతలు తొండెపు దశరథ జనార్దన్‌తో పాటు, వైసీపీ ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, అభిమానులు, నేతలు, టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆమెను పరామర్శించారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

చిట్టినగర్: నాకు బతకటం ఇష్టంలేదు.. అందరికీ దూరంగా వెళ్లిపోతున్నా, నా చావుకు ఎవరూ కారణం కాదంటూ లెటర్ రాసి ఓ యువతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక సౌమ్యా థియేటర్ ప్రాంతంలో బీడీఎస్ రాజేశ్వరి (24) తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. వివాహం కాలేదు. ఓ ప్రైవేట్ కంపెనీ పని చేస్తోంది. తల్లి నాగమణి, స్వీపర్‌గాను, తండ్రి సత్యనారాయణ టైల్స్ పనిచేస్తాడు. వీరిరువురు ఉదయం పనికి వెళ్లారు. రాజేశ్వరి పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. రాత్రి 7 గంటలకు ఇంటికొచ్చిన తల్లి నాగమణి ఇంట్లోకి వెళ్లిచూడగా ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరేసుకున్న కూతురు కనిపించడంతో నాగమణి పెద్దగా కేకలు పెట్టి ఏడవటంతో చుట్టుపక్కల వారు వచ్చారు. వెంటనే ఆమెను దించిచూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

16న అఖిల భారత రవాణా సమ్మె

బస్టేషన్: ఫిబ్రవరి 16న అఖిల భారత రవాణా సమ్మెను జయప్రదం చేయడానికి మంగళవారం రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. వివిధ అసోసియేషన్ల నేతలు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య అధ్యక్షతన పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ డ్రైవర్లపై శిక్షలు, జరిమానాలు విధించే సెక్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న జరగబోయే సమ్మెను జయప్రదం చేయడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ఎం.శంకరరావు, వర్కర్స్ ఫెడరేషన్ ఎస్‌కే జిలానీ బాషా, ఎం.అయ్యప్ప రెడ్డి, డి.మల్లికార్జున్, బీసీ అసోసియేషన్ ఎస్‌పి.శేషగిరి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ పి.కిరణ్ బుజ్జి, సూపర్‌వైజర్ అసోసియేషన్ నుంచి విష్ణురెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమెన్ వన్డే టోర్నీలో హైదరాబాద్, యూపీ జయకేతనం

విజయవాడ స్పోర్ట్సు: మూలపాడు వేదికగా ఏసీఏ పర్యవేక్షణలో జరుగుతున్న బీసీసీఐ అండర్-23 ఉమెన్ వన్డే టోర్నీ మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో మేఘాలయపై హైదరాబాద్, జార్ఖండ్‌పై ఉత్తరప్రదేశ్ మంగళవారం జయకేతనం ఎగురవేశాయి. మేఘాలయ-హైదరాబాద్ మ్యాచ్‌లో తొలుత బ్యాట్‌పట్టిన మేఘాలయ 35.1 ఓవర్లలో 62 పరుగులకు కుప్పకూలగా, 63 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 10.5 ఓవర్లలో 2 వికెట్లను నష్టపోయి అధిగమించింది. జార్ఖండ్-యూపీ మ్యాచ్‌లో తొలుత బ్యాట్‌పట్టిన జార్ఖండ్ 50 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటయ్యింది. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు బరిలో దిగిన ఉత్తరప్రదేశ్ 36.4 ఓవర్లలో వికెట్ నష్టపోయి 165 పరుగులతో జయకేతనం ఎగురవేసింది.



5జీ టెక్నాలజీపై వర్క్‌షాపు

కృష్ణలంక: ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై మంగళవారం 3 రోజుల వర్క్‌షాపు జరిగింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జోజిరెడ్డి, డీఏడీటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ కార్స్టన్ ష్రోడర్, నీలేష్ లంకిరెడ్డి, వి.శరణ్య, ఎ.సత్య, నరేష్ పాల్గొన్నారు.

అంతా ఏకపక్షం

- దోమలు, కుక్కల దాడులపై వాడివేడిగా చర్చ
- 88కేలో వీధిపేర్లను ఖండించిన టీడీపీ, సీపీఎం నేతలు

● మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం ● టిడ్కో ఇళ్లపై రసాభాస

చిట్టినగర్, జనవరి 30: కౌన్సిల్ సమావేశం ఏకపక్షంగా సాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో టిడ్కో ఇళ్లపై చర్చ వాడివేడిగా జరిగింది. పూర్తయి ఐదేళ్లయినా పేదలకు ఇళ్లివ్వలేదని, పేదలు అప్పులు చేసి టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టారని సీపీఎం, టీడీపీ నేతలు ప్రశ్నించడంతో మేయర్, అధికార పార్టీ కార్పొరేటర్లు ఎదురుదాడికి దిగారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకే ఇళ్లు ఇచ్చామన్నారు. దోమల దండయాత్ర, కుక్కల దాడుల విషయంపై అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు, మేయర్ సహా అధికారులను ఎండగట్టారు. కుక్కల నియంత్రణ చర్యలు వెంటనే తీసుకోవాలని కౌన్సిల్‌లో కార్పొరేటర్లు ముక్తకంఠంతో కమిషనర్ ఇతర అధికారులకు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందే టీడీపీ, సీపీఎం కార్పొరేటర్లు నగరంలో దోమల దండయాత్ర, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని, కుక్కల దాడులను అరికట్టాలని, ప్రజలను కాపాడాలని దోమల నెట్‌తో, మంచినీటి టిన్నులతో నిరసన తెలుపుతూ కౌన్సిల్ హాలు వరకు నినాదాలు చేసుకుంటూ వచ్చారు. విగ్రహాల ఏర్పాటులో అధికార పార్టీకి అనుమతిస్తూ ప్రతిపక్షాలకు నిరాకరించడంపై టీడీపీ, సీపీఎం వాగ్వాదానికి దిగారు. మేయర్ కలుగజేసుకొని కమిషనర్‌ను అడిగారు. ప్రత్యేక కమిటీలున్నాయి కాదా వాటిలో పెట్టవచ్చునన్నారు. టీడీపీ హయాంలో 90శాతం ఇళ్లు పూర్తి చేస్తే వైసీపీ ఐదేళ్లలో కనీసం రంగులు వేసి పేదలకు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. లారీ స్టాండ్‌లో రూ.కోటి 55 లక్షలతో షెడ్‌ల నిర్మాణానికి టెండర్ పిలిచి, రద్దు చేసి అదే టెండర్‌దారునికి రూ.55లక్షలకు చుట్టు గోడ నిర్మాణానికి టెండర్ లేకుండా నామినేషన్ పద్ధతిలో కేటాయించడం, ఎమర్జెన్సీ 88కేని వీధిపేర్లు పెట్టి ఆమోదించుకోవడంపై టీడీపీ, సీపీఎం కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అత్యవసర అంశాలను 88కేలో పెడతారని, కానీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఓటు, కుటిల రాజకీయాలను చేయడాన్ని ఖండిస్తున్నామని మేయర్ వద్ద వచ్చి నిరసన తెలిపారు. 88కేలో అంశాలపై చర్చ జరగకుండానే మేయర్, అధికార పార్టీ ఏకపక్షంగా ఆమోదించుకున్నారు.



ప్లకార్డులు చేపట్టి నినాదాలతో కౌన్సిల్ సమావేశానికి వస్తున్న టీడీపీ కార్పొరేటర్లు





కుక్కల నిర్మూలనలో విఫలం

కుక్కల నిర్మూలనలో అధికారులు తీవ్రంగా విఫలమయ్యారని కార్పొరేటర్లు మండిపడ్డారు. కుక్కల దాడులతో ప్రజలు రోడ్లపై తిరగలేకపోతున్నారని మండిపడ్డారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉన్నా చర్యలు శూన్యమని కార్పొరేటర్లు మండిపడ్డారు. జీవకారుణ్యం ఇతర సంస్థలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కుక్కల దాడుల నుంచి ప్రజలను కాపాడాలని కార్పొరేటర్లు మేయర్, కమిషనర్‌ను కోరారు.

వీధిపేర్లకే కౌన్సిల్ సమావేశం: బాలస్వామి

నగరంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే వాటి పరిష్కారంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారపార్టీ కేవలం వీధిపేర్ల కోసం సమయం కేటాయించి ప్రజలను గాలికొదిలేసిందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎస్.బాలస్వామి దుయ్యబట్టారు. దోమల దండయాత్ర, మంచినీటి సమస్యలు, కుక్కల దాడులను నివారణలో అధికార పార్టీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎమర్జెన్సీ 88కెలో వీధిపేర్లు పెట్టి ఆమోదించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లారీ స్టాండ్ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ55లక్షలు కేటాయించి టెండర్‌లు లేకుండా పనులు చేయిస్తున్నారని, కమిషన్ల కకుర్తితో ప్రజాదానాన్ని దోచుకుంటున్నారన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదు: సత్యబాబు

నగరంలో ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులు పడుతున్నా ఓట్లు సీట్లు గురించే తప్ప ప్రజాసమస్యలపై వైసీపీకి చిత్తశుద్ధి లేదని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు దుయ్యబట్టారు. మంచినీటి సమస్యలపై ప్రశ్నిస్తే దాటవేత వేస్తున్నారని, దోమలు దండయాత్ర చేస్తున్నా అధికార పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వకుండా దగా చేసిందన్నారు. కమిషన్ల కకుర్తితో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్నారు. వీటన్నింటిపై రానున్న రోజుల్లో సీపీఎం ఆందోళనలు చేస్తుందన్నారు.

అర్ధరాత్రి జనసేన పోస్టర్ తొలగించే యత్నం.. అడ్డుకున్న జనసైనికులు



సిద్ధం.. మేమూ సిద్ధమే..!

- వైసీపీ, జనసేన ఫ్లెక్సీ వార్

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార, ప్రతిపక్షాల మధ్య వార్ వేడెక్కుతోంది. కొద్దిరోజుల క్రితమే సీఎం జగన్ విశాఖ జిల్లాలో భీమిలి వద్ద సిద్ధం పేరుతో ఎన్నికల శంఖారావం పూరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వైసీపీ నేతలు కృష్ణలంక వద్ద జాతీయ రహదారికి పక్కన సిద్ధం పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పక్కనే జనసేన నేతలు మేమూ సిద్ధమే అన్న టైటిల్‌తో పవన్ కల్యాణ ఫొటోను ముద్రించి మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో నగరంలో చర్చనీయాంశమైంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నారా భువనేశ్వరి

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

గన్నవరం/పటమట, జనవరి 30: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు అనంతరం మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మంగళవారం విచ్చేశారు. ఆమెకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు మంతెన సత్యనారాయణ రాజు, పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, గన్నె ప్రసాద్ (అన్న), మేడేపల్లి రమాదేవి స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డుమార్గాన గుంటూరు, ప్రకాశంజిల్లా వెళ్లారు.

బాలికను గర్భవతిని చేసిన నిందితుడికి పదేళ్ల జైలు

విజయవాడ లీగల్, జనవరి 30: బాలికను మాయమాటలతో గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.4లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ వారిని పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.రజని మంగళవారం ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నున్న పోలీసు స్టేషన్ పరిధిలోని వాంబేకాలనీకి చెందిన బాలిక (15) కుటుంబంతో కలిసి జీవిస్తూ వన్‌టౌన్‌లోని దుస్తుల దుకాణంలో పనిచేస్తోంది. ప్రతిరోజు షాపుకి వెళ్లి, వచ్చే సమయంలో శాంతినగర్ పాయకాపురానికి చెందిన ఆటోడ్రైవర్ సిందే సురేంద్రకుమార్ (23) పరిచయమై ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకొంటానని బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకొన్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. విషయం నిందితుడికి చెప్పగా సంబంధం లేదని అనడంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపి నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గుజ్జుల నాగిరెడ్డి 17 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

స్విమ్మింగ్‌లో సామ్‌దేవ్, సంపత్‌కు పతకాలు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 30: చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ స్విమ్మింగ్‌లో జిల్లా స్విమ్మర్ ఎం.తీర్థసామ్‌దేవ్ (8:29.76 సెకన్ల) స్వర్ణంతో సత్తాచాటగా, కృష్ణాజిల్లా స్విమ్మర్ జి.సంపత్‌కుమార్ యాదవ్ (8.29.86 సెకన్ల)లో ఈది రజతాలను మంగళవారం సాధించారు. వీరిద్దరూ ఏపీఎప సెక్రటరీ ఎ.మోహన్ వెంకటరామ్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ అభినందించారు.

సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్‌కు కేఆర్‌యూ టీమ్

చెన్నైలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా వర్శిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 3వరకు జరిగే సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పురుషుల చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కృష్ణా వర్శిటీ టీటీ టీమ్‌ను ఎంపిక చేసినట్టు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. బచ్చు వెంకట మల్లికార్జున రోహిత్, గోనుగుంట్ల సాయితేజ, కె.చరణ్ తేజ, డి.రూపేష్ కల్యాణ్,అనుమకొండ గోవింద్ ఎంపికయ్యారు. టీమ్ మేనేజర్‌గా ఎల్.వినయ్ శేఖర్, కోచ్ ఎస్‌కే.అబ్దుల్ ముజామిల్ వ్యవహరించనున్నారు.



భక్తిరసాన్ని తూచిన శ్రీ కృష్ణతులాభారం

విజయవాడ కల్చరల్, జనవరి 30: శ్రీ వెంకట లక్ష్మీ దుర్గా నాట్యమండలి ప్రదర్శించిన శ్రీ కృష్ణ తులాభారం నాటకం భక్తిరసాన్ని ప్రతి సన్నివేశంలోను ఒలికించింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. ముత్తరాజు సుబ్బారావు రచించిన ఈ నాటకం భక్తిరసం ప్రాధాన్యంగా సాగింది. సత్యభామ, శ్రీకృష్ణుని తుల యందు తులతూచలేకపోవడంతో సత్యభామ శ్రీకృష్ణుని శరణువేడటం, రుక్మిణీదేవిని ఆహ్వానించడం, తులసీదళంతో రుక్మిణీ శ్రీ కృష్ణుడి భక్తితో తులతూచి ప్రేమకన్నా భక్తి గొప్పదని నిరూపించడంతో నాటకం ముగిసింది. శ్రీ కృష్ణుడిగా డాక్టర్ ఎ.కోటేశ్వరరావు, నారదుడిగా కె.గణేష్‌కుమార్, సత్యభామగా రత్నశ్రీ, రుక్మిణిగా కె.విజయదుర్గ, వసంతక-జె.ప్రసాద్‌బాబు అద్భుతంగా నటించి మెప్పించారు.

పోరాటంతోనే విధ్వంస పాలన అంతం: బాబు



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ వారిని తరిమికొట్టేందుకు నాడు జాతిపిత అనుసరించిన బాటలోనే నేడు పోరాటం చేసి, రాష్ట్రంలో విధ్వంస పాలనకు ముగింపు పలకాలని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం తన నివాసంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలేసి, చంద్రబాబు నివాళులర్పించారు. మహాత్మాగాంధీ వర్ధంతిని అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్న సందర్భంగా.. దేశం కోసం మహోన్నత త్యాగాలు చేసిన దేశభక్తులను స్మరించుకుందాం. మంచికి మద్దతు పలుకుతూ, రామరాజ్య స్థాపనకు మన వంతు కృషి చేయడమే జాతిపితకు మనమిచ్చే అసలైన, ఘనమైన నివాళి' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, పార్టీ నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలేసి, నివాళులర్పించారు.

సౌదీలో తెలుగు దౌత్యవేత్తకు కీలక బాధ్యతలు

కాన్సుల్ జనరల్‌గా ఫహాద్ సూరి నియామకం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



ఫహాద్ సూరి

అరబ్ దేశాల్లో అత్యంత కీలకంగా భావించే సౌదీ అరేబియాలోని జెడ్డాలో భారత కాన్సుల్ జనరల్‌గా తెలుగు యువ దౌత్యవేత్తను నియమించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఫహాద్ అహ్మద్ సూరి భారత కాన్సుల్ జనరల్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వాణిజ్య మంత్రిత్వ శాఖలో మధ్యప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా దేశాలతో భారత ఎగుమతులు, దిగుమతుల వ్యవహారాలను పరిశీలిస్తున్నారు. అంతకు ముందు కువైత్‌లోని భారతీయ ఎంబసీలో పనిచేశారు. కర్నూలులోని ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన ఫహాద్ స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదివారు. ఆ తర్వాత బెంగుళూరులో ఎంబీఏ చేశారు. లండన్‌లో బ్యాంకర్‌గా పనిచేసిన అనంతరం ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. ఇప్పటి వర కు జెడ్డాలో పనిచేసిన షాహీద్‌ను లండన్‌లోని భారతీయ హైకమిషన్‌కు బదిలీ చేశారు.

కక్ష సాధింపుతోనే ఏలూరిపై కేసు: వర్ల

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుల కంపెనీలపై దాడులు చేయించడం జగన్‌కు అలవాటుగా మారిందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) కలిసి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై తప్పుడు కేసు పెట్టి, వేధిస్తున్నారు. ఆదాయపన్ను శాఖకు చెందిన రాజేశ్వర్‌రెడ్డి అనే బంధువును జగన్ డీఆర్ఐ స్పెషల్ కమిషనర్‌గా నియమించుకున్నారు. అతడి సహకారంతో కోట్లు దండుకుంటున్నారు. పాత పుస్తకంలో ఎవరో ఏదో రాశారని, దాన్ని ఎన్నికల్లో డబ్బులు పంచినట్లుగా చిత్రీకరించి, ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసు నమోదు చేశారు. ఏలూరి ఎప్పుడో వదిలేసిన కంపెనీల్లో ఏదో ఉందని దాడులు చేస్తున్నారు. వైసీపీ దొంగ ఓట్ల బాగోతాన్ని బయట పెట్టి, నలుగురు ఎస్ఐలను సస్పెండ్ చేయించారన్న కక్షతో పోలీసులను ఉసిగొల్పి ఈ అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు.

తన కేసులపై జగన్ నోరు విప్పరే?: కాలవ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజలిచ్చిన అధికారం, ప్రజాధనంతో జగన్‌రెడ్డి తన దురుద్దేశాలు, రాజకీయ కక్ష సాధింపులు నెరవేర్చుకుంటూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంపై నాలుగున్నరేళ్లలో 15,046 కోర్టు ధిక్కరణ కేసులు, 30వేల రిట్ పిటిషన్లు పడటంపై మాత్రం జగన్ నోరు విప్పడని మండిపడ్డారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుపై చేసిన ఆరోపణలు, పెట్టిన కేసుల్లో ఒక్కదానినైనా జగన్ నిరూపించాడా? అని ప్రశ్నించారు.

వెలిగొండపై 2న మార్కాపురంలో ధర్నా: బీజేపీ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసినట్టు వైసీపీ ప్రభుత్వం పత్రికల్లో తప్పుడు ప్రకటనలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తోందని రాష్ట్ర బీజేపీ మండిపడింది. జగన్ పార్టీకి ఓట్లు కురిపించిన పశ్చిమ ప్రకాశం ప్రజల కంటనీరు కారుతోందని ఆ పార్టీ నేతలు లంకా దినకర్, సిరసనగండ్ల శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.1800కోట్ల పరిహారం చెల్లించకుండా.. కొల్లం వాగు హెడ్ రెగ్యులేటరీ పనులు 60శాతం పూర్తి చేయకుండా.. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మించకుండా ప్రాజెక్టు పనులు పూర్తి చేశామని ఎలా చెప్పగలదంటూ వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే వరకూ బీజేపీ పోరాటం ఆపబోదని, ఫిబ్రవరి 2న మార్కాపురంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని దినకర్, శ్రీనివాసరావు ప్రకటించారు.

జగన్ ఢిల్లీ పర్యటన మర్మం ఇదే!

- **5న సుప్రీంలో అవినాశ్ బెయిల్‌పై విచారణ: ఎంపీ రఘురామ**

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఢిల్లీ పర్యటన ఉద్దేశం పైకి చెప్పేది ఒకటని, వెనుక మనసులో మరోటి ఉంటుందని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీన సుప్రీంకోర్టులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణకు రానుందని, ఈ నేపథ్యంలోనే కేంద్ర పెద్దలను కలుసుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మంగళవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామ ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 'క్విట్ జగన్.. క్విట్ వైసీపీ' అనే శాంతియుత ఉద్యమాన్ని చేపడదామని, గాంధీజీకి మనం ఇచ్చే నిజమైన నివాళి ఇదేనని అన్నారు. ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధం ద్వారా అధికారంలో నుంచి దించడానికి, చంద్రబాబు నాయుడు, పవన్, బీజేపీ నేతృత్వంలోని కూటమికి ఓటు వేసి జగన్ సర్కార్‌ను తరిమికొడదామన్నారు. వైఎస్ షర్మిలనుద్దేశించి మంత్రి రోజా ఏకంగా ప్యాక్ చేస్తామని చేసిన హెచ్చరికలను షర్మిల తీవ్రంగా తీసుకోవాల్సిందేనని ఆయన సూచించారు. దానికి కారణం.. గతంలో అనంతబాబు అనే ఎమ్మెల్సీ దళితుడైన సుబ్రహ్మణ్యాన్ని, పులివెందులలో వైఎస్ వివేకానంద రెడ్డిని ప్యాక్ చేశారని.. దీన్ని షర్మిల గుర్తెరగాలని సూచించారు.

విభజన హామీలు ఇంకా నెరవేరలేదు: గల్లా జయదేవ్

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కేంద్ర ప్రభుత్వానికి గుర్తుచేశారు. పార్లమెంట్ చివరి సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి గల్లా జయదేవ్ హాజరయ్యారు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, సెక్షన్ 93 ప్రకారం, 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా, 10 ఏళ్ల పూర్తవుతున్నాయని.. ఇకనైనా ఇచ్చిన హామీలు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. రామమందిర నిర్మాణంపై టీడీపీ తరపున కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

షర్మిల ప్రశ్నలకు జవాబు చెప్పగలవా?: అచ్చెన్న

టెక్కలి, జనవరి 30: 'వారం రోజులుగా మీ చెల్లి రాష్ట్రమంతటా పర్యటిస్తూ నీపై సంధిస్తున్న ప్రశ్నలకు జవాబు చెప్పగలవా జగన్‌రెడ్డీ' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. మంగళవారం రాత్రి శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలసలో ఆయన మాట్లాడుతూ 'నాకు పేపరు లేదు, టీవీ లేదు అన్నావు. నీ దగ్గరున్న సాక్షి పేపరు, సాక్షి చానల్‌లో సగం వాటా నాదే అని నీ చెల్లే చెబుతోంది. దీనికి జవాబు చెప్పగలవా?' అని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్లలో 85శాతం హామీలు అమలుకు నోచుకోలేదని, ఏ ముఖం పెట్టుకుని ఈ ఎన్నికల్లో ఓట్లు అడుగుతావని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులపైన 50 కేసులు వేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి నిన్ను వదిలేశాడు. ముఖ్య అనుచరుడు అయిన బాలిరెడ్డి చచ్చినా నీ మొఖం చూడనని వెళ్లిపోయాడు. టీడీపీ పడవ ఇప్పటికే నిండింది. మేము తలుపులు తెరిస్తే జగన్‌రెడ్డి, సజ్జల మాత్రమే మిగులుతారు. మిగిలిన వారంతా టీడీపీలోకి వస్తారు' అన్నారు.

షర్మిల 'సక్సెస్'తో వైసీపీకి చెమటలు: రఘువీరా

మడకశిర, జనవరి 30: రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనలు విజయవంతమవుతుండటంతో వైసీపీ ప్రభుత్వానికి చెమటలు పడుతున్నాయని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు రఘువీరా రెడ్డి అన్నారు. షర్మిలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 5న షర్మిల మడకశిరకు వస్తున్నారని, ఆమె పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు.

నన్ను స్వదేశానికి పంపండి

- **దుబాయ్‌లోని ఏపీ మహిళ ఆవేదన**
- **పాస్‌పోర్టు లేక.. ఇరవై ఏళ్లుగా ఇక్కడే!**
- **కొడుకు చనిపోయినా వెళ్లలేని దైన్యం**
- **అనారోగ్యంతో పనులు చేయలేక ఇబ్బందులు**
- **తెలిసినవారి ఇళ్లలో తలదాచుకుంటూ జీవనం**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పేదరికంతో ఇరవై ఏళ్ల కిందట దుబాయ్ చేరుకున్న ఆమె... పాస్‌పోర్టు పోగొట్టుకుని, అనారోగ్యంతో బాధపడుతూ.. తెలిసినవారి ఇళ్లలో తలదాచుకుంటూ.. స్వదేశానికి పంపేయమని వేడుకుంటోంది. ఒక్కగానొక్క కొడుకు, కోడలు రోడ్డు ప్రమాదంలో చనిపోయినా కడచూపు చూసేందుకూ వెళ్లలేని పరిస్థితి ఆమెది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం బ్రహ్మణచెరువు గ్రామానికి చెందిన కడజారి మరియమ్మ అలియాస్ లక్ష్మి రెండు దశాబ్దాల కిందట విజిటింగ్ వీసాపై దుబాయ్ వచ్చింది. ఇళ్లలో పాచి పనులు చేస్తూ జీవితం గడిపిన ఆమె ప్రస్తుతం అనారోగ్యానికి గురై ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పాస్ పోర్టు పోగొట్టుకున్న ఆమె వద్ద కనీసం దాని కాపీ కూడా లేదు. అందువల్ల గత 20 ఏళ్లలో ఒక్కసారి కూడా స్వదేశానికి వెళ్లలేకపోయింది. మరియమ్మ గల్ఫ్ వచ్చినప్పుడు దుబాయ్ ఇమ్మిగ్రేషన్ విధానంలో బయోమెట్రిక్ నమోదు కాలేదు. బయోమెట్రిక్ నమోదుకు ఇక్కడి ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినా పాస్ పోర్టు పోగొట్టుకోవడం, విజిటింగ్ వీసా గడువు కూడా ముగియడంతో ఆమె భయపడి వేలిముద్రలు నమోదు చేయించుకోలేదు. దీంతో లక్ష్మి అనే



మహిళ తమ దేశంలో ఉన్నట్లుగా దుబాయ్ ప్రభుత్వ రికార్డుల్లో లేదు. మరోవైపు తన పేరులో ఉన్న వ్యత్యాసం కారణంగా తాత్కాలిక పాస్ పోర్ట్ అయిన ఈసీని కూడా ఆమె భారతీయ కాన్సులేటు నుంచి పొందలేకపోయారు. దీంతో ఏళ్ల తరబడి ప్రయత్నిస్తున్నా ఆమె స్వదేశానికి వెళ్లలేకపోయారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పనులు చేయలేకపోతోంది. గోదావరి జిల్లాలకు చెందిన మహిళలు ఆమెకు ఆశ్రయం ఇచ్చి ఆదుకుంటున్నారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న దుబాయ్‌లోని ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్, సామాజిక సేవకుడు ప్రసన్న సోమిరెడ్డి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఆమెను వీలయినంత త్వరగా స్వదేశానికి పంపించడానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

జగన్‌కు తిరుగు 'పోటు'!

ఐదో జాబితా విడుదలకు జంకు.. రాజ్యసభ ఎన్నికల భయంతో వీలైనంత ఆలస్యం చేసే యోచన

ఇప్పటిదాకా 26 మంది సిటింగ్‌లకు మొండిచేయి

- **చాలా మందిలో ఆగ్రహజ్వాలలు**
- **వీరంతా పార్టీ రాజ్యసభ అభ్యర్థులకు ఓటేయరేమోనని అనుమానం**
- **టీడీపీ అభ్యర్థి గెలిస్తే పరువుపోతుందని ఆందోళన**
- **సార్వత్రిక ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని కలవరం**
- **తాడేపల్లికి సిటింగ్‌ల వెల్లువ**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాలను గెలిచేస్తామని ధీమాగా చెప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి పార్టీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తారేమోనని ఇప్పుడు భయం పట్టుకుంది. సర్వేల సాకుతో పలువురు సిటింగ్‌లను తప్పించిన ఆయన.. ఇప్పుడు రాజ్యసభ ఎన్నికలు రావడంతో వారు పార్టీ అభ్యర్థులకు ఓటేయరేమోనని సందేహిస్తున్నారు. టీడీపీ అభ్యర్థికి ఓటేస్తే పరువు గంగపాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ భయంతోనే ఆయన ఇప్పుడు అభ్యర్థుల ఐదో జాబితా ప్రకటించేందుకు జంకుతున్నారు. ఇప్పటికే నాలుగు జాబితాలు ప్రకటించి.. 26 మంది సిటింగ్‌లను మార్చేశారు. వీరిలో పలువురు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అనుకోకుండా వచ్చిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటేసి కసిదీర్చుకోవాలని వీరు భావిస్తున్నట్లు వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వీరిలో కొందరు టీడీపీలో చేరేందుకూ సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరిగే ఫిబ్రవరి 27వరకు అభ్యర్థులను ప్రకటించకుండా ఆగాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సిటింగ్‌లను బుజ్జగించడానికి.. అభ్యర్థిత్వాలపై రీసర్వే చేస్తున్నామని.. వారికి సానుకూలంగా వస్తే టికెట్లు వారికేనని లీకులు కూడా ఇచ్చారు. అయితే ఆయన మాటలు తాము నమ్మలేమని.. తనపై ఉన్న ప్రజావ్యతిరేకతను కప్పిపెట్టి.. ఎమ్మెల్యేలపైనే వ్యతిరేకత ఉన్నట్లు ప్రచారం చేసి తమకు మొండిచేయి చూపారని వారు రగిలిపోతున్నారు. 58 స్థానాలకు అభ్యర్థులు.. వాస్తవానికి.. సంక్రాంతినాటికే తుది జాబితాను విడుదల చేస్తానని జగన్ ప్రకటించారు. కానీ ఇప్పటిదాకా 10 లోక్‌సభ, 58 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ఖరారుచేశారు. 58లో 26 మంది సిటింగ్‌లకు మొండిచేయి చూపారు. వీరంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిలో పలువురు టీడీపీ వైపు.. కొందరు జనసేన, కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఫిబ్రవరి 27న రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. టీడీపీకి సంఖ్యాబలం లేకపోయినా.. వైసీపీలో పరిణామాలను చూశాక ఒక స్థానంలో అభ్యర్థిని పోటీపెట్టాలని భావిస్తోంది. సీట్లు దక్కని 26 మంది సిటింగుల్లో సగం మందైనా తమకు ఓటేస్తారని ఆశిస్తోంది. టికెట్లు దక్కని ఎమ్మెల్యేల్లో.. ఎలీజా (చింతలపూడి-ఎస్సీ), ఎంఎస్ బాబు (పూతలపట్టు-ఎస్సీ), కోనేటి ఆదిమూలం (గంగాధరనెల్లూరు-ఎస్సీ), సుధాకర్ (కోడుమూరు-ఎస్సీ), గొల్ల బాబూరావు (పాయకరావుపేట-ఎస్సీ), టీజేఆర్ సుధాకర బాబు (సంతనూతలపాడు-ఎస్సీ), జొన్నలగడ్డ పద్మావతి (శింగనమల-ఎస్సీ), టి.ఆర్థర్ (నందికొట్కూరు-ఎస్సీ), రక్షణనిధి (తిరువూరు-ఎస్సీ), కంబాల జోగులు (రాజాం-ఎస్సీ), కొండేటి చిట్టిబాబు (పి.గన్నవరం-ఎస్సీ), చెట్టి ఫాల్గుణ (అరకు-ఎస్టీ), మద్దిశెట్టి వేణుగోపాల్ (దర్శి), ఆరణి శ్రీనివాసులు (చిత్తూరు), నవాజ్ బాషా (మదనపల్లె), మేడా మల్లికార్జునరెడ్డి (రాజంపేట), కొలుసు పార్థసారథి (పెనమలూరు), కాపు రామచంద్రారెడ్డి (రాయదుర్గం), జ్యోతుల చంటి(జగ్గంపేట), పెండెం దొరబాబు (పిఠాపురం), పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ (ప్రత్తిపాడు), పీవీ సిద్దారెడ్డి (కదిరి), చెన్నకేశవరెడ్డి (ఎమ్మిగనూరు), మల్లాది విష్ణు (విజయవాడ సెంట్రల్), ఆళ్ల రామకృష్ణారెడ్డి (మంగళగిరి), మంత్రులు గుమ్మనూరు జయరాం (ఆలూరు), గుడివాడ అమర్నాథ్ (అనకాపల్లి) కూడా ఉన్నారు. వీరిలో గొల్ల బాబూరావు, ఆరణి శ్రీనివాసులును రాజ్యసభకు పంపుతామని జగన్ ప్రకటించారు. మిగతావారిలో మెజారిటీ ఎమ్మెల్యేలు జగన్‌కు వ్యతిరేకంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

తాడేపల్లికి క్యూ..

టికెట్లు దక్కని, ఖరారుకాని ఎమ్మెల్యేలు తాడేపల్లి సీఎం కార్యాలయానికి వస్తున్నారు. మంగళవారం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాలనాయుడు, ఉషశ్రీచరణ్, ఎంపీలు ఆదాల ప్రభాకరరెడ్డి, నందిగం సురేశ్, ఎమ్మెల్యేలు పొన్నాడ సతీశ్, కురసాల కన్నబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బాలనాగిరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ధనలక్ష్మి, ఎమ్మెల్సీలు అనంత బాబు, కుంభా రవిబాబు వచ్చారు. అయితే వీరితో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడలేదు. సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయ రెడ్డి మాత్రమే మాట్లాడారు. ఎక్కువ మంది సిటింగ్‌లు తమకే టికెట్ ఇవ్వాలని.. వేరెవరికో ఇస్తే అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు.



నిరూపక్ డీకమిషనింగ్ కార్యక్రమంలో నౌకా దళ అధికారులు

సేవలను విరమించుకున్న సర్వే నౌక నిరూపక్

విశాఖపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన భారత నౌకాదళ సర్వే నౌక 'ఐఎన్ఎస్ నిరూపక్' సోమవారం నుంచి తన సేవలను విరమించుకుంది. ఈ కార్యక్రమాన్ని (డీ కమిషనింగ్) విశాఖపట్నం నావల్ డాక్‌యార్డులో నిర్వహించారు. దీనికి చీఫ్ హైడ్రోగ్రాఫర్ వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా అధ్యక్షత వహించారు. విశాఖపట్నం కేంద్రంగా 38 ఏళ్ల సేవలు అందించిన నిరూపక్ 1994, 1995, 2005, 2009లలో ఉత్తమ సర్వే నౌకగా రోలింగ్ షీల్డులు అందుకుంది. ఈ నౌకకు 20 మంది కమాండింగ్ అధికారులుగా పనిచేశారు.

సినీ మోజులో వచ్చి.. డ్రగ్స్‌కు బానిసై

- **ఆర్టిస్ట్ లావణ్య రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే విషయాలు**



లావణ్య

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సినిమాల్లో నటించాలనే ఆసక్తితో హైదరాబాద్ వచ్చి.. మధ్యలో చదువు కొనసాగించి.. అనంతరం డ్రగ్స్‌కు బానిసై.. ఏకంగా సరఫరాదారుగా మారిందా యువతి. ఓవైపు సంగీతం పాఠాలు చెబుతూనే.. మరోవైపు డ్రగ్స్ అమ్మకం సాగించింది. పోలీసులకు చిక్కి కటకటాలపాలైంది. నగర శివారు నార్సింగిలో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో రిమాండ్ రిపోర్ట్‌ను పరిశీలించగా విస్తుపోయే అంశాలున్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన మన్నె లావణ్య (32) అలియాస్ అన్విత సినీ అవకాశాల కోసం 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి సోదరుడు కార్తీక్‌తో కలిసి పటాన్‌చెరులో ఉండేది. 2014లో ఓ షార్ట్ ఫిలింలో నటిస్తుండగా శేఖర్‌రెడ్డి ద్వారా ఉనీత్‌రెడ్డి పరిచయమయ్యాడు. వీరిద్దరూ కొన్ని షార్ట్ ఫిలింలలో నటించారు. ఉనీత్‌రెడ్డితో సాన్నిహిత్యంతో క్రమంగా డ్రగ్స్‌కు బానిసగా మారిన లావణ్య మూడేళ్లుగా సరఫరా కూడా చేస్తోంది. ఉనీత్‌రెడ్డి బెంగళూరు, గోవా నుంచి రూ.1500కి గ్రాము చొప్పున కొని హైదరాబాద్ తరలించి గ్రాము రూ.6వేల చొప్పున లావణ్య, ఈ కేసులో పరారీలో ఉన్న ఇందిరతో అమ్మించేవాడు. దీంతో పాటు లావణ్య, ఉనీత్‌రెడ్డి డ్రగ్స్ తీసుకునేవారు. ఈ దందాపై మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం శంకర్‌పల్లి-నార్సింగి రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో లావణ్య వద్ద 4 గ్రాముల ఎండీఎంఏ దొరికింది. సినీ ఇండస్ట్రీతో పాటు చాలామంది ప్రముఖులతో లావణ్యకు పరిచయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమెకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కాగా, లావణ్య ఏపీలోని గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో 2022లో కేసు నమోదైందని పోలీసులు రిపోర్టులో పేర్కొన్నారు. 2023లో మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఉనీత్‌రెడ్డి, లావణ్యపై మరో కేసు నమోదైంది. డ్రగ్స్ వాడుతూ ఉనీత్ దొరికిపోయాడు.

విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో గోల్‌మాల్

- **స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలి**
- **ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తల డిమాండ్**

అమరావతి/విజయవాడ/విశాఖపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రంలో ఉన్న ధరలకు, మన రాష్ట్రంలోని ధరలకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన ఆదాయ అంచనాలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన రెండోరోజు మంగళవారం కూడా ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ కొనసాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల కంటే అదనపు చార్జీల భారమే అధికంగా ఉందని, వాటన్నింటినీ తక్షణమే రద్దు చేయాలన్నారు. విజయవాడ సూర్యారావుపేటలోని సీపీడీసీఎల్ కార్యాలయం నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ సంస్థలు భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. మొత్తం మూడు రకాలుగా ఈ భారాన్ని ప్రతినెలా బిల్లులో చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతినెలా 40 పైసలు చొప్పున ట్రూఅప్ చార్జీలను పెంచేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు కావాల్సింది ట్రూఅప్ కాదని, ట్రూడౌన్ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్తు సంస్కరణలు విఫలమయ్యాయని బాబూరావు విమర్శించారు. ఇంకా ప్రారంభం కాని షిర్డీ సాయి, విండ్ సోల్ కంపెనీలకు రూ.12కు విక్రయించాల్సిన యూనిట్‌ను రూ.4కే అందిస్తూ ప్రత్యేక కేటగిరీని తీసుకొచ్చారని, దీని వల్ల రాబోయే 15 ఏళ్లలో ఈ కంపెనీలకు రూ.47వేల కోట్లు ఆదా అవుతాయని వివరించారు. ఇదే రాయితీలను సాధారణ వినియోగదారులకు ఎందుకు ఇవ్వట్లేదని నిలదీశారు. విద్యుత్తు చార్జీల భారం, ట్రూఅప్ చార్జీల రద్దు, స్మార్ట్ మీటర్లు, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఎం కార్యకర్తలు విద్యుత్తు సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.



విజయవాడ ఎస్ఈ కార్యాలయం ముందు ప్రజా బ్యాలెట్‌లతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేత సి.హెచ్.బాబూరావు తదితరులు

ఏఐసీటీఈ పరిధిలోకి వద్దు

- **బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులపై కాలేజీల డిమాండ్**
- **రేపు విజయవాడలో కాలేజీ యాజమాన్యాల నిరసన ర్యాలీ**

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(బీబీఏ), బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(బీఎంఎస్) కోర్సుల పరిధి మార్పుపై డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ఈ కోర్సులను అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) పరిధిలోకి తీసుకొస్తున్నట్లు యూజీసీ ప్రకటించింది. దీంతో ఇకపై వీటికి ఏఐసీటీఈ నుంచి కాలేజీలు అనుమతి పొందాల్సి ఉంది. అయితే ఇది రాష్ట్రంలోని యూనివర్సిటీలను కాదని తీసుకున్న నిర్ణయమని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. గత 20ఏళ్లుగా అన్ని డిగ్రీ కోర్సులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అనుమతులు ఇస్తోంది. ఇక్కడి వర్సిటీలు అఫిలియేషన్ మంజూరు చేస్తున్నాయి. కానీ ఇకనుంచి బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సుల అనుమతికి జేఎన్‌టీయూ లాంటి సాంకేతిక వర్సిటీల వద్దకు వెళ్లాల్సి వస్తుందని యాజమాన్యాలు చెబుతున్నాయి. అంటే ఒకే కాలేజీలోని కొన్ని డిగ్రీ కోర్సులకు సాధారణ వర్సిటీలకు, మరికొన్నిటికి సాంకేతిక వర్సిటీలకు వెళ్లాల్సి రావడం తమపై భారం పెంచుతుందని వాపోతున్నాయి. ఇప్పటివరకూ ఉన్నత విద్యామండలి నిబంధలు పాటించామని, ఇప్పుడు అకస్మాత్తుగా ఈ మూడు కోర్సుల కోసం ఏఐసీటీఈ రూల్స్ పాటించాలంటే ఎలాగని యాజమాన్యాలు ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఈ మూడు కోర్సులకే కాలేజీలో 20వేల చదరపు అడుగులు చూపడం సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నారు. వీటిని అమలు చేయాలంటే ఫీజులు భారీగా పెంచాల్సి వస్తుందని, అప్పుడు గ్రామీణ విద్యార్థులకు డిగ్రీ చదువు భారంగా మారుతుందని పేర్కొంటున్నారు. కాలేజీలకు ఏఐసీటీఈ అవసరం లేదని, ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ఈ కోర్సులు ప్రవేశపెట్టే కాలేజీలకు కూడా కాకుండా ఎప్పటినుంచో ఉన్నవారికి కూడా ఈ నిబంధనలు వర్తింపజేయడం సరికాదంటున్నారు. ఇప్పటికే దీనిపై కోర్టును ఆశ్రయించిన యాజమాన్యాలు గురువారం విజయవాడలో రాష్ట్ర స్థాయి నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. 'సమర భేరి' పేరుతో ర్యాలీ, సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి తెలిపారు.

వాహన ప్రమాద కేసుల్లో సత్వర న్యాయానికి చర్యలు

- **జస్టిస్ శేషసాయి**



తాడేపల్లి, జనవరి 30: మోటారు వాహన ప్రమాద బాధితులకు ఉచిత న్యాయం అందాలని, సత్వర న్యాయం జరగాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలోని చిగురు బాలల ఆశ్రమంలో పోలీస్, ఆర్టీవో, ఇన్సూరెన్స్ అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ ప్రమాద బాధితులకు సంబంధించి వెంటనే పోలీసు, ఇన్సూరెన్స్, రవాణా విభాగాలు స్పందిస్తే బాధితులకు నష్టపరిహారం త్వరగా అందజేయవచ్చని అభిప్రాయపడ్డారు. వారికి సత్వర న్యాయం కూడా లభించినట్టు అవుతుందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన చట్ట సవరణల గురించి అవగాహన కల్పించారు. తొలుత కొద్దిసేపు జస్టిస్ శేషసాయి చిగురు ఆశ్రమంలోని చిన్నారులతో ముచ్చటించి స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఇన్సూరెన్స్, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది, ఏపీ ఎస్ఎల్ఎస్ఏ అడ్వకేట్ సెక్రటరీ బబిత, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ్ శర్మ, సీనియర్ అడ్వకేట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పోలవరం పూర్తిచేయాలి

- **కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి.. హైకోర్టులో పిల్**

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తన ఆధీనంలోకి తీసుకొని.. నిర్దిష్ట గడువులోగా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిచేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అమలాపురానికి చెందిన న్యాయవాది వి రమేశ్‌చంద్రవర్మ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం చేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతించిన అధికారులపై విచారణకు ఆదేశించకపోవడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. డయాఫ్రంవాల్, కాఫర్ డ్యాంల పురోగతిపై నివేదిక సమర్పించేలా అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సీఈవో, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

నారా భువనేశ్వరికి తృటిలో తప్పిన ప్రమాదం

గన్నవరం, జనవరి 30 : టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి గన్నవరానికి ఇండిగో విమానంలో బయలు దేరారు. గన్నవరం ఎయిర్ పోర్టు చేరుకున్న విమానంలో ల్యాండింగ్ సమయంలో సమస్య తలెత్తింది. సరిగ్గా విమానం ల్యాండింగ్ సమయంలో వీల్ తెరుచుకోలేదు. దీంతో అప్రమత్తమైన పైలెట్ విమానాన్ని మళ్లీ టేకాఫ్ చేశారు. కొద్దిసేపు అలాగే గాల్లో చక్కర్లు కొట్టింది. దాంతో ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు ఆందోళన పడ్డారు. కాసేపటి తరువాత ల్యాండింగ్ గేర్ తెరుచుకొని వీల్ బయటికి రావడంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భువనేశ్వరికి గన్నవరం ఎయిర్ పోర్టులో మాజీ మంత్రి దేవినేని ఉమా తదితరులు స్వాగతం పలికారు.

దేవదాయ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పర్సంటేజ్‌లో మార్పులు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టుల భర్తీకి పర్సంటేజ్‌లో మార్పులు చేస్తూ దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-1 పోస్టుల్లో 20 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. మిగిలిన పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేస్తారు. గ్రేడ్-3 పోస్టుల్లో 50 శాతం పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మిగిలిన పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టుల్లో 50 శాతం డైరెక్టర్ రిక్రూట్‌మెంట్‌లో భర్తీ చేయనున్నారు. వీటితో పాటు మరికొన్ని పోస్టులను రోస్టర్ పాయింట్లను నిర్ణయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. కాగా, దేవదాయ శాఖ ఉద్యోగుల వయో పరిమితిని 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఉత్తర్వులు జారీచేశారు. గతేడాది జూన్ 12 తర్వాత నుంచి 62 ఏళ్ల వయో పరిమితిని వర్తింపచేయనున్నారు.

సమ్మె ఉద్యోగులు తిరిగి విధుల్లోకి.. సమగ్రశిక్ష ఉత్తర్వులు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్లతో ఇటీవల సమ్మెచేసి విరమించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్ని జిల్లాల కో ఆర్డినేటర్లకు ఆదేశాలు జారీచేశారు. జీతాలు పెంచాలని ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె నిర్వహించగా, కఠిన వైఖరి ప్రదర్శించిన ప్రభుత్వం వారిని తొలగించాలని ఆదేశాలు జారీచేసింది. ఆ తర్వాత ఉద్యోగులు సమ్మె విరమించారు. తొలగించిన ఉద్యోగులను తిరిగి తీసుకుంటామని సమ్మె విరమణ సమయంలో మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఇప్పుడు ఉత్తర్వులు జారీచేశారు.

వారంలో ప్రాజెక్టులు అప్పగించండి

- **బోర్డు నుంచి ముందస్తు అనుమతి లేకుండా ప్రాజెక్టుల్లోకి వెళ్లేందుకు వీల్లేదని స్పష్టీకరణ**

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, శ్రీశైలంతో పాటు కృష్ణానదిపై నిర్మించిన 15 ప్రాజెక్టులను అవుట్‌లెట్లతో సహా వారం రోజుల్లోగా తమకు అప్పగించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ, తెలంగాణ జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌లకు బోర్డు సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రకాశ్ మంగళవారం లేఖ రాశారు. ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 11గంటలకు జరగనున్న సమావేశంలో కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను అప్పగించడంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టులను తక్షణమే కేంద్ర సాయుధ బలగాలు స్వాధీనంలోకి తీసుకుంటాయని వెల్లడించారు. కేఆర్ఎంబీ నుంచి ముందస్తు అనుమతి లేకుండా ప్రాజెక్టుల్లోకి వెళ్లేందుకు వీల్లేదని పేర్కొన్నారు. నాగార్జున సాగర్‌కు మరమ్మతులు చేయాల్సి వస్తే రెండు రాష్ట్రాలూ వాటి పరిధిలో చేపట్టే పనులపై కేఆర్ఎంబీ నుంచి ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. తెలంగాణ ఎన్నికల పోలింగ్‌కు కొద్ది గంటల ముందు సాగర్‌ను ఏపీ పోలీసు బలగాలు స్వాధీనం చేసుకోవడం ద్వారా కేంద్రానికి పెత్తనం ఇచ్చినట్లయిందని జల వనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

హెటిరో భూమి లీజ్ రద్దు చేసిన తెలంగాణ సర్కార్

- **హైదరాబాద్ నడిబొడ్డున హైటెక్‌సిటీ వద్ద బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథిరెడ్డి ట్రస్ట్‌కు భూమి**

హైదరాబాద్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): హెటిరో డ్రగ్స్ ఎండీ, బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు హైటెక్ సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారికి చేరువలో విలువైన 15 ఎకరాలను లీజుకు కేటాయిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.140ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలిపేసింది. జీవో నెం.140ని నిలుపుదల చేస్తున్నట్లు జీవో నెం.12ను తాజాగా జారీ చేసింది. ఈ భూమి లీజును రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఈ భూకేటాయింపును పునఃపరిశీలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. నగరం నడిబొడ్డున హాట్ కేక్ లాంటి ఆ విలువైన స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో సాయిసింధు ఫౌండేషన్‌కు కారు చవగ్గా లీజుకు ఇచ్చేసింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 31 జనవరి 2024

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పీజీ డిప్లొమాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'రూరల్ డెవలప్‌మెంట్(గ్రామీణాభివృద్ధి)' ప్రధానాంశంగా వీటిని రూపొందించారు. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పర్సనల్ ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్‌లను తప్పనిసరిగా తెలపాలి. ప్రోగ్రామ్ మొదటి ట్రైమెస్టర్‌లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది.

పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం-ఆర్ఎం): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. క్యాట్/ ఎక్స్‌ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో చూపిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.


పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** ఏడాదికి రూ.2,20,500
- **భోజన, వసతి ఖర్చులు:** ఏడాదికి రూ.1,11,000
- **కాషన్ డిపాజిట్:** రూ.10,000
- **సీట్ రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.20,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **చిరునామా:** సెంటర్ ఫర్ పీజీ స్టడీస్ అండ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in

కొమెడ్‌కె యూజీఈటీ నోటిఫికేషన్



కన్సార్షియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఈ ఎగ్జామ్ నుంచి మినహాయించారు. దీనికి సంబంధించి విడిగా ప్రకటన విడుదల చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటికోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 12 నుంచి 16 వరకు
- **టెస్ట్ అడ్మిషన్ టికెట్(టీఏటీ) డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, పుట్టపర్తి, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడిపత్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్
- **కొమెడ్‌కె యూజీఈటీ 2024 తేదీ:** మే 12
- **ఫైనల్ కీ విడుదల:** మే 21
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **వెబ్‌సైట్:** www. comedk.org

ఏఐఐఏలో పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు ఉంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సును ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధిస్తారు. కోర్సులో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు చివరలో థియరీ అండ్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. దీనిని హెల్త్‌కేర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎస్ఎస్‌సీ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి హెచ్ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసినవారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థలు, ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, పంచకర్మ సెంటర్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 16 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10
- **చిరునామా:** డైరెక్టర్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ), గౌతమ్‌పురి, సరిత విహార్, మధుర రోడ్, న్యూఢిల్లీ-110076
- **వెబ్‌సైట్:** https://aiia.gov.in



జాబ్ కార్నర్

ఎన్‌డీఏలో గ్రూప్ 'సి' పోస్టులు

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కింద పేర్కొన్న గ్రూప్ 'సి'(బ్యాక్‌లాగ్ సహా) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 198

1. లోయర్ డివిజన్ క్లర్క్: **16 పోస్టులు**
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: **1 పోస్టు**
3. డ్రాఫ్ట్స్‌మన్: **2 పోస్టులు**
4. సినిమా ప్రొజెక్షనిస్ట్-2: **1 పోస్టు**
5. కుక్: **14 పోస్టులు**
6. కంపోజిటర్-కమ్ ప్రింటర్: **1 పోస్టు**
7. సివిలియన్ మోటార్ డ్రైవర్(ఓజీ): **3 పోస్టులు**
8. కార్పెంటర్: **2 పోస్టులు**
9. ఫైర్‌మన్ : **2 పోస్టులు**
10. టీఏ- బేకర్ అండ్ కాన్ఫెక్షనర్: **1 పోస్టు**
11. టీఏ- సైకిల్ రిపేరర్: **2 పోస్టులు**
12. టీఏ- ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్: **1 పోస్టు**
13. టీఏ- బూట్ రిపేరర్: **1 పోస్టు**
14. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రెయినింగ్: **151 పోస్టులు**

వయోపరిమితి: ఎల్‌డీసీ/స్టెనోగ్రాఫర్/డ్రాఫ్ట్స్‌మన్/డ్రైవర్/ఫైర్‌మన్ పోస్టులకు 18-27 ఏళ్లు. ఇతర పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాత పరీక్ష, స్కిల్/ప్రాక్టికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://ndacivrect.gov.in/

నాల్కోలో జూనియర్ ఫోర్‌మెన్

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(ఎన్ఏఎల్‌సీఓ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 42

1. జూనియర్ ఫోర్‌మన్(షార్ట్ ఫైర్ బ్లాస్టర్): **2 పోస్టులు**
2. జూనియర్ ఫోర్‌మన్(ఓవెర్‌మన్/మైన్స్): **18 పోస్టులు**
3. జూనియర్ ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): **5 పోస్టులు**
4. జూనియర్ ఫోర్‌మన్(సర్వేయర్): **5 పోస్టులు**
5. జూనియర్ ఫోర్‌మన్(సివిల్): **2 పోస్టులు**
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-3: **2 పోస్టులు**
7. డ్రెస్సర్ కమ్ ఫస్ట్ ఎయిడర్: **4 పోస్టులు**
8. నర్స్ గ్రేడ్-3: **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, హెచ్ఎస్సీ, డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్/మైనింగ్, మైనింగ్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 35-40 ఏళ్లు మించరాదు.
జీతం: పోస్టును అనుసరించి నెలకు రూ.29,500-రూ.1,15,000
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
దరఖాస్తు ఫీజు: రూ.100
వెబ్‌సైట్: https://nalcoindia.com

సుప్రీంకోర్టులో లా క్లర్క్‌లు

మొత్తం ఖాళీలు: 90

న్యూఢిల్లీలోని సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: లా క్లర్క్ కమ్ రీసెర్చ్ అసోసియేట్
అర్హతలు: న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రీసెర్చ్/అనలిటికల్ స్కిల్స్, రాత సామర్థ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 15 నాటికి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.
జీతభత్యాలు: నెలకు రూ.80,000
పరీక్ష విధానం: పార్ట్-1, 2 రాత పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15
రాత పరీక్ష తేదీ: మార్చి 10
వెబ్‌సైట్: main.sci.gov.in




లిటిల్స్

ఆశకు పోతే.. ఆనందం దక్కదు!

ఒక ఊరిలో నందనుడు అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి చదువురాదు. పైగా ఏ పని చేతకాదు. ఎవరో చెబితే గేదెలు, ఆవులు కొన్నాడు. హాయిగా పాల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతనికి అత్యాశ ఎక్కువ. ప్రతి చిన్న విషయానికి ఆశపడేవాడు. గేదెలన్నీ అడవికి వెళ్లి గడ్డిమేసి ఇంటికి వచ్చి పాలిచ్చేవి. గేదెలు, ఆవులతో అతనికి మంచి పేరొచ్చింది. తగిన సొమ్ము కూడా వచ్చేది.

ఒక రోజు ఓ గేదె తప్పిపోయింది. చాలా బాధపడ్డాడు. ఆ గేదె మరుసటి రోజు ఉదయానికి ఇంటికి వచ్చేసింది. దీంతో ఏమాత్రం ఆలోచించకుండా గేదెలకు చిన్న గంటలు కట్టాలని నిర్ణయించుకున్నాడు. అన్ని గేదెలకు చిన్న గంటలు కట్టాడు. అవి ఎక్కడున్నా, ఎన్ని గేదెల్లో ఉన్నా కనుక్కునేందుకు సులువయ్యింది. తన దగ్గర ఉండే రెండు ఆవుల్లో ఓ ఆవును ఎక్కువ సొమ్ము వస్తుందనగానే అమ్మేశాడు. మిగిలిన ఆవుకు పెద్ద గంట కట్టాడు. ఆ గంట ఖరీదు రెండు వందల రూపాయలు. నాణ్యత ఎక్కువని ఆ గంటను చూస్తే అర్థమయ్యేది.




గేదెలతో పాటు నందనుడి ఆవు కొండలో మేస్తోంది. ఓ దొంగవాడు ఆ ఆవు గంటను దొంగిలించాలనుకున్నాడు. అయితే కుదరటం సులువు కాదని అర్థమైంది. నందనుడు పక్కనే ఉన్నాడు. దీంతో ఆ దొంగవాడు.. 'అయ్యా.. ఈ ఆవుకు ఉండే గంట ఎవరిది?' అని నందనుని అడిగాడు. 'ఆవు నాది. గంటనాదే' అన్నాడు. 'అవునా.. ?ఆ గంటను ఇస్తావా?' అనడిగాడు. 'ఇవ్వను' అన్నాడు నందనుడు. 'ఊరికే కాదు వెయ్యి రూపాయలు' అన్నాడు ఆ దొంగ 'వీడెవడో పిచ్చివాడు. ఎర్రివాడు. గంటను అంత ధరకు అమ్ముతాడా?' అనుకున్నాడు మనసులో. 'అయ్యా.. మీరు ఏ దేశం వారో తెలీదు. గంట ఎంతో విలువైనదని ఇట్టే గ్రహించారు. తమరికి ఇష్టం ఉంటే పన్నెండు వందలు ఇచ్చేయండి' అన్నాడు. దొంగవాడు తటపటాయించాడు. చివరకు సరేనన్నాడు. ఆ గంటను కొనుక్కున్నాడు.

మరుసటి రోజు రాత్రి ఆ దొంగవాడు మెల్లగా వచ్చి ఆ గంటలేని ఆవును తోలుకుని వెళ్లిపోయాడు. ఆ గంటను కొన్న దొంగవాడే ఆవును దొంగిలించాడని నందనుడికి తెలీదు. దీంతో ఏమీ పట్టించుకోలేదు. పైగా ఆ గంట ఉంటే బావుండునే.. కనీసం ఆవు ఉండేదని బాధపడ్డాడు.

సరైన నీడ ఏది?




7 తేడాలను గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 217

	9		4		2		1	8
		1	9			6		
			1			3	4	
						8	6	
1				9				4
	8	5						
	5	3			9			
		8			3	9		
6	1		7		4		5	

సుడోకు - 216 సమాధానం

6	9	5	3	2	1	4	8	7
7	8	3	9	6	4	5	2	1
4	2	1	7	5	8	9	3	6
5	6	4	2	1	7	8	9	3
2	7	8	6	3	9	1	4	5
3	1	9	4	8	5	6	7	2
1	4	7	5	9	3	2	6	8
8	3	6	1	4	2	7	5	9
9	5	2	8	7	6	3	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.